న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 ఏ ప్రి ల్ 1960

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 * విజయవాడ * ఏప్రిల్ 1960 | సంచిక 7

ఏది మానవతవ్యాప్తికి మార్గము ?

మన దేశములో పలువిధములైన మత విశ్వాసములు గలవారు నివసించు చున్నారు. ఈ దేశములో నివసించు ప్రతివారికి మత స్వాతంత్ర్య మనునది యున్నది. అయితే మతవిశ్వాసము వ్యక్తిగతమై, మతశక్తి యనునది వ్యక్తి యిష్టానిష్టములపై ఆధార పడి యున్నదని చెప్పబడుచున్నది.

మనది ప్రజాస్వామ్యము. ప్రజాస్వామ్యములో రాజకీయ పక్షములు యేర్పడి ప్రబోధముచేయవచ్చును. ఎన్నికలలో నిలచి బహు జనామోదమును పొంది స్థానికసంస్థలలోను శాసనసభలలోను, పార్లమెంటులోను అధికారమును స్వీకరించవచ్చును ప్రజలను పరిపాలించవచ్చును ఎవరి అభిప్రాయములు యెటువంటివైననూ. ప్రజామోదము పొందిన యెడల ఆ యా అభిప్రాయములను అధికారస్వీకరానంతరము అమలు జరుపవచ్చును. ఇది కొందరికి నచ్చినను, నచ్చకపోయినను తప్పనిసరిగా అధికారములో నున్నవారు ఆచరించి తీరుదురు దీనినే ప్రజాస్వామ్య పరిపాలనయని మనమామోదించి నడచుకొనుచుంటిమి.

పరిపాలనా స్వాతంత్ర్యమును రాజకీయభావముల ప్రచారస్వాతంత్ర్యమును అంగీకరించి వాదోపవాదములద్వారా తర్కవితర్కములను స్వేచ్ఛగా మనము చేసుకొను హక్కును కలిగియున్నాము. ఇది మన యందరి ఆమోదమును పొందియేయున్నది. మనలో మనకెన్ని అభిప్రాయ భేదములున్ననూ, మనకు ప్రజలకు మధ్య యీ అభిప్రాయ భేదములను నచ్చజెప్పుకొనునప్పుడు వాద ప్రతివాదములతో గూడిన సంఘర్షణలు జరుపుకొనుచున్నను మనము చూచుచునే యుంటిమి. ఈ వాదప్రతివాదములు ముదిరి, సభ్యమార్గములను విడనాడి కొట్లాటలు, కాల్చి చంపుకొనడములవరకు జరుగుచున్నను మనము చూచుచునే యుంటిమి ఈ వీనిని తప్పించవలయునని రకరకదళముల నేర్పరచి శాసనములద్వారా సభ్యమార్గమున నడుపవలయునని ప్రయత్నించుచుంటిమి. మనమెన్ని ప్రయత్నములు చేయుచున్నను మన ప్రయత్నములు ప్రయత్నములుగానే కొనసాగించబడి రాజకీయ పక్షముల అభిప్రాయభేదములు పెరిగి క్రోధావేశములకు లోనై వివేకరహితమైన వర్తనమునకే తోడ్పడుచున్నవి. ఇది మనముందున్న నేటి సమస్య. మనమీ సమస్యను పరిష్కరించుకొనుటకు ఏ సాధనసామగ్రిని సమకూర్చుకొన వలయునో యోచన చేయగలిగినస్థితిలో యీనాడు లేకనే యుంటిమి. మన శక్తికిమించిన కార్యభారము మనపై బడుటవలననే మనమీ స్థితిలో నుంటిమి.

మన దేశములోని ప్రజలలో భారతజాతీయతా భావము ఒకవంక, మతాభిమానము మరియొక వంక, మతరహితమైన వ్యవస్థాభిమానము వేరొకవంక తర్కవితర్కములతో ప్రచారము చేయబడుటవలన మనకొక అవ్యవస్థ యేర్పడియున్నది.

రాజకీయ పక్షములుమాత్రమే దేశములో శాంతిసామరస్యములను నెలకొలిపి నాగరిక ప్రవర్తనను రూపొందించి సమరసభావముతో ప్రజలు హితచింతకులై తమతమ నడవడికను తీర్చిదిద్దుకొనుటకు సమర్థనీయములనుభావము మనలోనుంచి ఏనాడుతొలగించుకొనెదమో ఆనాడే యీ సమస్యా పరిష్కారమునకు మార్గమేర్పడును.

పరరాజ్య ప్రాభవమువలన మనకు మహమ్మదీయమతము, క్రైస్తవమతము అనునవి యేర్పడియున్నవి. భారతీయులకు మతమనునది యున్నను, మహమ్మదీయమతము క్రైస్తవమతము మనకు తప్పనిసరి అయి యున్నవి. ఇవి ఏ యే కారణములవలన మనలో ప్రవేశించి మనపై ప్రాబల్యము సంపాదించినవో, మనము తెలుసుకొనవలయునని యోచించుటలేదు. ఈ మతప్రాబల్యముల ప్రాభవము మనలో ప్రవేశించి మనము యిందులో దేని ప్రయోజనము ఏదో గ్రహించగలిగిన నేర్పును కోల్పోవునటుల చేసినది. భారతీయులు, క్రైస్తవులు, మహమ్మదీయులు మొదలైన వారందరూ సమానమే నన్న భావము సన్యాసులవలె మనకు యేర్పడియున్నది. మనలో రాజకీయ వేత్తలలో కొందరికి మతమనునది ఒక దురభిప్రాయముగా నేర్పడియున్నది. మతప్రచారమువల్ల దైవభావము యేర్పడునని, దైవభావమువల్ల మంచిచెడులను వివేకభావముకలుగునని,యీ వివేకభావప్రాబల్యమే మానవతభావ వికాసమునకు తోడ్పడునని యిది మానవుని అత్యుత్తమమైన భావసంపన్నునిచేయునని అంగీకరించలేని కారణమున మతమను భావమును దురభిప్రాయముగా నెంచుచుండిరి.

మతమనగనే మనకొక సంకోచము కలుగుచున్నది. ముఖ్యముగా వేదములు మన మతగ్రంథములనగనే యేదియో తెలియని ఒక విధమైన లజ్జాభావము మనలో ప్రవేశించి మనము వానిన్నిగురించి చెప్పుకొనుటకే సిగ్గుపడునటుల చేయుచున్నది లోకమునకు స్వపర మత భేదములనునవి లేవని తెలియజెప్పుటకే మన మీ ప్రవర్తనను పెంపొందించుకొనినామో యేమో తెలియదు. కాని మనలో యీ భావము ప్రబలముగా మాత్రము ఉన్నది. ఇది మన మనోవికాసమునకు తీరని అపచారము చేయుచున్నది.

రాజకీయ, మతప్రచారములను మనము చేసుకొనవచ్చును మానవత వికాసమునకు మనము మతప్రచారము చేయకూడదు. రాజకీయ భావ ప్రచారమునకు స్వేచ్ఛా స్వాతంత్ర్యములనునవి ప్రసాదించిన మనమే మత స్వాతంత్ర్యమునకు ప్రతిబంధకములను కల్పించియున్నాము మతతత్వమని, కులతత్వమని ఏవేవో పడికట్టుమాటలను వల్లించి మనకు మనమే మహాపరాధమును చేసుకొనుచున్నాము. మతద్వేషమును కాదనవచ్చును. కులద్వేషమును కాదనవచ్చును. మతాభిమానమును, కులాభిమానమును, జాతీయాభిమానమును వలదనువారికి వ్యవహారజ్ఞానము లేదనిమాత్రము చెప్పవచ్చును

మతము మానవుని ఆత్మవికాసమునకు దోహదముచేయును ఈనాడు పలువిధములైన మతప్రచారములు ప్రబలము కావడమువల్ల మనము దేనిన్నిగురించి పట్టించుకొనవలయునో మనము దేనిపై భక్తి విశ్వాసములు ప్రదర్శించవలయునో తెలియని తనమువల్లనే యివి మనకు చిక్కులను కల్పించునవిగా కనుపించుచున్నవి. రాజకీయ విభేదములవలెనే మతవిభేదములుకూడ మానవునికి సహజమైనవేనని గుర్తించి మన నడవడికను తీర్చి దిద్దుకొనిన మనము బాగుపడుటకు మార్గమేర్పడును.

రాజకీయ భావములలో మనము విశ్వసించినవే ఉత్తమమైనవని యెవరికివారు ప్రజలకు నచ్చజెప్పి వానిని అనుసరించమని కోరవచ్చును. కాని మత విశ్వాసములను మాత్రమే యేవి ఉత్తమమైనవి, యేవి సామాన్యమైనవి వివరించి ప్రచారము చేయవలదని చెప్పుచున్నారు.

మతప్రచారములు చెడుఫలితము నిచ్చునని, రాజకీయ ప్రచారములు సత్ఫలితములనిచ్చునని యీనాడు వాదప్రతివాదములు చేయువారిలో ప్రధానముగా నీ భావము కనిపించుచున్నది. ఈభావము పరమతప్రచార ప్రాబల్యమువలన, పరరాజ్య ప్రచారప్రాభవమువలన నేర్పడియున్నది.

స్వధర్మభావము, స్వమతభావము, స్వరాజ్యభావము, స్వజాతీయభావము, స్వప్రాంతీయభావము, స్వకులభావము, స్వకుటుంబభావము, స్వదంపతీభావము ననునవి యేజాతిలో పరిపూర్ణములై యుండునో ఆ జాతియే ఉత్తమ మానవస్వభావము పొందినదై అత్యుత్తమమైన ఆత్మోన్నత్యమును తీర్చి దిద్దగలిగిన శక్తి కలిగియుండును.

భారతీయులలో ఎవ రేమతమునకు చెందియున్ననూ, ఎవరే రాజకీయ పక్షములో చేరియున్నను, వారిలో ఏయే భక్తి విశ్వాసములు ప్రబలియున్ననూ మానవస్వభావజన్యమైన తరతమ భేదములను పాటించి వివేకులై తారతమ్యములను గ్రహించి సత్యమానవ ప్రవర్తనను రూపొందించుకొని జాగరూకులై ప్రవర్తించినవాడే జాతీయ పురోగమనమునకు దారి యేర్పడును. మానవతా వ్యాప్తికి మార్గమేర్పడును.

శాతవాహన సప్తశతి

శ్రీ వాసిరెడ్డి వెంకటసుబ్బయ్య

కినుక జూచుకొనఁగఁ గెంపారు గౌరిమొ
గంబు చందమామ బింబ మలర
నర్చనాబ్జ మెత్తినట్లొప్పు శివుని సం
ధ్యా జలాంజలికి ప్రణామమిడుఁడు.

కురవకమ్ము కొఱకు నరసెదు గాని నీ
కొఱకు దోహదమ్ము నరయ వేమ
టంచు నదిగొ! సుభగుఁడా! నవ్వుచుండె నీ
జాయ మోముదమ్మి చాటొనర్చి.

ప్రియులఁ బాసియున్న వేళఁగూడ నశోక
ములు విదగ్ధలైన పూవుఁబోండ్ల
సంతపింపఁ జేయఁ జాలు వాఁడెవఁ డన్య
చరణ తాడనంబు సైఁచి యుండు.

మదికి ముదము గూర్చు మన పల్లెకొక యలం
కార మగుచు నున్న కమలవనము
లూనమైన నూవు చేని వోలెను మంచు
చేతఁ జివికి పోయె మాతులాని!

వరిపొలాలు పలుక బాఱుచుండఁగ దేని
కీవు మొగమువాల్చి యేడ్తు వదిగొ
విరిసె జనుము చాలు హరితాళమున మోము
చాయమీఱు రంగసాని వోలె.

వంట చేయునప్పు డంటిన మసిచేయి
తాఁకి డాఁగువడిన తరుణి మొగము
మగఁడు చూచి చందమామయ్యె నిప్పుడో
బాల! యంచు మందెమేల మాడె.

నిప్పు రాఁజఁజేయ నిపుణవు కింసుక తా
ల్పకుము! రక్త పాటలముల తావి
గురియు నీదు వదనమరుత మానుచుఁ బోగ
చూఱుఁ గాని మండఁ జూడఁడగ్ని.

చెలులు చుట్టుఁజేరి చెప్పవేమే యేమి
కోరెదనుచు గ్రుచ్చి గ్రుచ్చి యడుగ
ముద్దరాలి చూపు మొదటి వేవిళ్ళలోఁ
బఱచెఁ గేవలముగ వరుని దరికె.

చెక్కు ముద్దుగొనఁగ నిక్కఁబుల్కలు దొంగ
నిదుర విడిచి తెఱువు! నీదు కనులు
సుంత నాకుఁగూడఁ జోటిమ్ము సుభగుఁడా!
యింక నెపుడుఁజేయ నిట్టి జాఁగు.

చేసికొన్నవఱకు సింగారమిఁకఁ జాలు
వలచి చూచు వాని నిలయమునకుఁ
జనుము బిడ్డ! వలపు చల్లాఱు మఱల నీ
వశమె వాని మనసు వలగొనంగ.

హర్ష వికసితంబు లగు కపోలమ్ముల సా
నతి శతములు రేయి నా కొసఁగుచుఁ
బగలు మఱల మొగము వాల్చి తిరుగ నిదే
యది యటంచు నమ్మనయితిఁ బ్రియను.

ఇష్టుఁడైన వాని యెడబాటు నిష్టము
కాని వాని తోడి కాపురమ్ము
నింతలేసి యిడుమ లీ రెండు భరియింతు
దేనికో కులీనతా నమోస్తు.

సగము ప్రక్కమీఁద మొగమైనఁ జూప కే
మున్న వెనుకఁజేరి యూర్పు సెగల
వీపు గూడ మఱల వేపెదేమిటి కోరి
మునుపు మనసు కాలిచినది చాలు.

తన మఱఁదికిఁ జెడ్డమనసు వానికిఁ బవ
లెల్లఁ గఱపుచుండు నింటి వధువు
గోడమీఁద నున్న కోదండరాముని
గొలిచి మను సుమిత్రకొడుకు కథలు.

ఇల్లు చత్వరమున నిరుగున జారిణి
లేమి బాధ పీటలేదు మగఁడు
జవ్వనమ్ము నంద చందాలుఁ గలిగియుఁ
జివురు టాకుఁబోఁడి చెడదు గాద.

అరమునుఁగుచుఁ దేలు చంతయు మునుఁగుచు
సుడుల వడికి నకరు లిడిసిపోవఁ
గడిమిపూవు చూడు గండుతుమ్మెద వెంటఁ
బడఁగఁ బోయెఁ గొండవాగు వెల్లి.

మానుషంబు వంశ మర్యాద పాటించు
బీదమగని యింటిపేరు నిలుపఁ
గినియు బారుబూరు మని వచ్చు నెటి పో
రాని బంధులకును వాని గృహిణి.

నీకు వసతియైన నెలవంచు నెడఁదయు
నిన్నుఁ జూపెననుచుఁ గన్నుగవయు
నిన్నుఁ బాసినంత సన్నగిల్లెనటంచు
నంగములును దానికయ్యెఁ బ్రియము.

మంచిమనసు వలపు మర్యాద గల చోట
స్నేహ మెవ్వరైనఁ జేయవచ్చుఁ
గాని యెందొ మనసు గల వారలకు మన
సిచ్చి తిరుగ లోకులెల్ల నగరె!

ఘటి పొంగువంటి యెల జవ్వనము నందుఁ
బోయిరాని పగటి పూటలందు
మఱలఁ దిరిగి రాని మాపులందున బిడ్డ!
యిట్టి పాడుపంత మేల నీకు?

నా జ్వరమ్ము తగ్గినదొ లేదొ ప్రతివాని
కీ విచారమేల యెమ్మెకాడ!
గుప్పుగుప్పు మనఁగఁ గుశలం బడిగెదు నా
కకును నన్ను జ్వరము కంపుదాన.

కపట నాటకమ్ముఁ గన్నారఁ గని తెగి
పడిన వలపు మఱల ముడినిడంగ
సరస మగునె కాఁగి చల్లాఱిన జలమ్ము
విరసమగునె కాక వెఱ్ఱితల్లి!

తలఁచుమాత్రఁ జెంత నిలిచిన ప్రియుతోడఁ
గోపకారణముల రేపి రిత్త
కలహ పడుచుఁ గలఁగు చెలిఁ జూచి యేడ్చు
కాని నవ్వరైరి దాని చెలులు.

ఇంగితం బెఱుంగునెడఁ జాలు గోర్కెలు
తీఱకున్నఁ గూడఁ దీఱినట్లె
యది యెఱుఁగనిచోట నన్ని కోరికలును
దీఱినప్పటికిని దీఱనట్లె.

వాని కీవు ప్రియవు గానిచో నే వేళఁ
గన్నఁ దూలు నంగకములఁ బాలు
త్రాగి చొక్కి గేదెలేఁగ వోలెను బవ
లెల్ల నిద్రఁగూరెదేల బాల!

చాల నిడుపులైన చలిరేల నిద్దుర
పట్టకుండుఁ గాక పగటి నిద్ర
తగదు నీకుఁ బ్రాణదయితుండు పరదేశ
మరిగి దీర్ఘకాల మయ్యెఁగాన.

అలసురాలు బురదవలని భయాన నా యడుగు జాడ గంతి యడుగులై చె
వనెదుగాని సుభగుఁడా! చెప్పు నిజము నీ యొడలిదేల గగురుపొడిచె నిపుడు?

పాపకడెము పట్టి పాణిగ్రహణవేళ దూరమ్ముగఁ బ్రియుండు త్రోయు నపుడె
చెలిమికత్తెలెల్లఁ దెలిసికొనిరి మంచు మల కొమార్తె భాగ్య విలసనమ్ము.

సంఘనీతి పరిణతి

ఆల్బర్ట్ ష్వాజర్

మామూలుగా చూస్తే సత్ప్రవర్తనపట్ల మనిషికు గల ఆసక్తినే సంఘనీతి అంటాము. మనం మన వ్యక్తిభద్రతనే గాక, ఇతిరులయొక్క మానవజాతి అంతటి యొక్క శ్రేయస్సును సైతం విచారించటం విధిగా భావిస్తాము ఇతరులతోడి యీఅన్యోన్యతలోనే సంఘనీతి యొక్క తొలి పరిణతి మనకు గోచరిస్తుంది.

ఆదిమ మానవునిలో ఈ అన్యోన్యత తన రక్త సంబంధంగల వారికి మాత్రమే పరిమితమై యుంటుంది అంటే తన కుటుంబ మని చెప్పుకోదగిన తన తెగ వరకు మాత్రమే ఈ అన్యోన్యత ఈ మాటలు నేను స్వానుభవంతో చెబుతున్నాను నాఆస్పత్రిలో ఆదిమ జాతుల వారున్నారు ఆరోగ్యంగా ఉన్న ఒక ఆదిమ జాతివాణ్ని ఎవరైనా ఒక రోగికి పరిచర్య చెయ్యమంటే, ఆరోగి తన తెగ వాడైతే మాత్రమే వాడందుకు అంగీకరిస్తాడు లేకపోతే "వీడు మావాడు కాడు" అని నిరాకరిస్తాడు ఇక వాణ్ని బతిమాలిగానీ, భయపెట్టిగానీ ప్రయోజనం ఉండదు

మానవుడు తనను గురించీ ఇతరుల పట్ల తన నడవడిని గురించీ పర్యాలోచించిన కొద్దీ, మానవులందరూ తన సహోదరులేననీ సన్నిహితులనీ క్రమశః గ్రహిస్తాడు అతనితో సంబంధంగల సర్వమానవులయందూ తనకు బాధ్యత ఉన్నదని తెలుసుకొనే ఒకానొక స్థాయికి నిదానంగా వస్తాడు.

మానవజాతి చరిత్రలో, వివిధ సంస్కృతుల యందును వివిధకాలములలో ఇతరుల పట్ల మనకు గల బాధ్యత ఎంతో కొంత నిర్ణయించ బడింది క్రీ పూ 604 లో జన్మించిన లావ్‌సీ, కుంగ్‌ఫూసీ (కన్ఫ్యూషియస్) క్రీ పూ 551-47, క్రీ పూ 4 వ శతాబ్ది నాటి చౌవాంగ్‌సీ అనే చీనా మేధావులు ఈస్థాయికి వచ్చారు యామస్, హోషియా, ఇసయా అనే క్రీ పూ 8 వ శతాబ్ది ఇజ్రేల్ ప్రవక్తలు ఇతరుల యెడల మనబాధ్యతను నొక్కివక్కాణించారు జీసస్ సెయింట్‌పాల్ చెప్పిన చొప్పునమానవుడు తక్కిన మానవులందరి పట్ల బాధ్యతకలవాడనే భావంక్రైస్తవ సంఘనీతిలో ప్రధాన పాత్ర వహిస్తున్నది

బ్రాహ్మణ బౌద్ధ హైందవ మతాలకు చెందిన మహామేధావుల దృష్టిలోకూడా జీవితాన్ని గూర్చిన వారి ఆధ్యాత్మిక దృక్పథం ప్రకారం సర్వమానవ సౌభ్రాతృత్వం సమ్మతమే. కాని సంప్రదాయ సిద్ధములైన విభిన్న వర్ణముల మధ్యగల వ్యత్యాసాలను అధిగమించ లేక పోవటం వల్ల, ఈ సౌభ్రాతృత్వానికి తమ సంఘనీతిలో సరియైన స్థానం ఇవ్వలేక పోయారు

క్రీ.పూ. 7 వ శతాబ్ది వాడైన జరాతుస్త్రా అ
మేధావి కాంతికీ మంచికీ ప్రభువైన ఆర్మజ్ద్ అ
దేవునియందు విశ్వాసం కలవాడు ఆయనసైతం
దేవునిపట్ల విశ్వాసంగల వారినీ లేనివారినీ వేరు చే
వలసి రావటంవల్ల సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని అ
దుకోలేక పోయాడు దీనిమూలంగా ఆ దైవభక్తు
దేవుని రాజ్యాన్ని స్థాపించటానికై పోరాడటం,తక్కి
వారిని శత్రువులుగా భావించి అలాగే వ్యవహరించట
జరిగాయి ఇది అర్థం కావాలంటే, ఆ దైవభక్తుల
బాక్ట్రియా జాతులవారు, నిలుకడ గలిగి నీతియు
ములైన ప్రశాంతసుటుంబ జీవితాలు కలవారు, నా
కులు దేశాలు పట్టుకు తిరుగుతూ ఎడారుల్లో ని
సిస్తూ, దొంగతనంవల్ల జీవించేవారు - అనే అంశ
గుర్తుంచుకోవాలి.

గ్రీకు వేదాంత మహోన్నతదశనాటి ప్లాటో అ
స్టాటిల్ మున్నగు మేధావులు, తన బ్రతుకుతెరువ
వెతుకుకొననక్కరలేని గ్రీకుదేశపు స్వతంత్ర వ్యక్తి
దృష్టిలోపెట్టుకొని వ్యవహరించారు ఈ ఉన్నతవర్గా
వారు తక్కతక్కినవారంతా నీచమానవులనీ వారి
పరిగణించనక్కరలేదనీ వారి భావం

గ్రీకు వేదాంతంలో రెండవయుగం నాటిదాకా
అంటే స్టాయిసిజమ్ ఎపిక్యూరియానిజం అనే రెండ
తత్వాలు ఏకకాలంలో తల యెత్తేదాకా, సర్వమాన
సమత్వమూ సమస్త మానవజాతితో మనల్ని సమైక్య
మొనరించే సానుభూతి గుర్తింపబడలేదు, ఈ నూతన
దృక్పథాన్ని మొట్టమొదట స్వీకరించినవాడు క్రీ. పూ
2వ శతాబ్దివాడైన స్టాయిక్ పెనేషియస్ ఆయన
మానవత్వ సిద్ధాంత ప్రతిపాదకుడు సర్వమానవ
సౌభ్రాతృత్వం పూర్వం ఎన్నడూ ప్రచారంలో లేకున్న
ప్పటికీ, వేదాంతంలో అది ఒక ప్రధానభావంగా ప్రక
టీకృతం కావటమే దాని భవిష్యత్తుకు ముఖ్యకారణం.

కాని దీనికి తగినగౌరవంమాత్రం ఎప్పుడూ లభించలేదు. ఈ నాటికి కూడా జాతి మత రాజకీయాది విభేదాలమూలాన,సర్వమానవ సౌభ్రాతృత్వం సర్వదా కుంచింపబడుతూనే వుంది ఈ విభేదాలవల్ల మన పొరుగుమనిషి మనకు కేవలం ద్వేష్యుడు కాకపోయినా, ఉపేక్షణీయు డవుతున్నాడు.

సంఘనీతి పరిణతిని పరిశీలిస్తే, దానిమీద భౌతిక
ప్రపంచంలోని వివిధ దృక్పథాల ప్రభావం మనకు
కనిపిస్తుంది భౌతిక విషయాలలోను మన పార్థివ
జీవితం విషయంలోను శ్రద్ధ తీసికోవాలని చెప్పే
అనుకూల దృక్పథాలూ ఉన్నాయి. మన పార్థివ జీ

తంతోసహా, ఈ పృథివికి సంబంధించిన అన్ని విషయాలకూ మనం దూరంగా ఉండాలనే ప్రతికూల దృక్పథాలూవున్నాయి అనుకూల దృష్టి మన సహజ భావనను బలపరుస్తుంది. ప్రతికూలదృష్టి దాన్ని తిరస్కరిస్తుంది అనుకూలత మనకు ప్రాపంచిక సౌఖ్యాన్ని ప్రసాదించి, మనలను కార్యవాదులను చేస్తుంది. ప్రతికూలత మనం ఈ ప్రపంచానికి కొత్తవారివలె ప్రవర్తించి నిరీహులమయ్యేటట్లు చేస్తుంది. సహజంగానే సంఘనీతి అనుకూల దృక్పథంలోనే ఇమిడి వున్నది మంచి అనే ఆదర్శాన్ని అనుసరించాలంటే మనం కార్యవాదులమై వుండాలి. అనుకూల ప్రాపంచిక దృక్పథం సంఘనీతి వృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుంది వ్యతిరేకదృష్టి సంఘనీతిని దెబ్బతీస్తుంది ఈ జగన్మిథ్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారు తొలుత భారతీయ వేదాంతులు; తర్వాత పూర్వ మధ్యయుగాలనాటి క్రైస్తవులు అనుకూలవాదులు చీనామేధావులు, ఇజ్రేల్ జరాతుష్ట్రీల ప్రవక్తలు, వైజ్ఞానిక యుగానికీ ఆధునిక యుగానికీ చెందిన ఐరోపీయ మేధావులు.

వాస్తవమైన జీవితం అపార్థివమూ అనంతమూ అశరీరమూ ఐనదనీ, ప్రాపంచిక జీవితం ఊహాజనితమూ మాయామయమూ పరిణామశీలమూ అని విశ్వసించటం కారణంగా భారతీయ మేధావులలో ఇట్టి ప్రాపంచిక ప్రతికూల దృక్పథం ఏర్పడింది మనం వాస్తవమనుకొనే ఈ జగత్తు వారి దృష్టిలో అలౌకికమైన అసలు జగత్తుయొక్క దేశకాలావధికమైన ఒక మృగతృష్ణమాత్రమే ఈ మాయావరణమునందూ, ఇచ్ఛాటి తన పాత్రయందూ ఆసక్తుడు కావటంలోనే మానవుడు పొరపడ్డాడని వారి వాదం జీవితప్రకృతిని గూర్చిన వాస్తవ జ్ఞానానికి అనుగుణమైనది నిరీహమైన ప్రవర్తన యొక్కటే అని వారి ఉద్దేశ్యం.

ఈ నిరీహతలో కొంతవరకు సంఘనీతి లక్షణాలున్నాయి. ప్రాపంచిక వ్యవహారాలకు దూరంగా ఉండటంవల్ల స్వార్థమోహాలవల్ల కలిగే అహంకారాన్ని మానవుడు పరిత్యజిస్తాడు. అంతేకాక నిరీహతే యొక్క ప్రధానలక్షణం అహింస.

బ్రాహ్మణ సాంఖ్య జైనమతాల మేధావులు - బౌద్ధులుకూడా- అహింసా సిద్ధాంతాన్ని ఉద్ఘాటించారు. నిజానికి అహింసను ఉత్తమధర్మంగా వారు పరిగణించారు కాని మోక్షసాధన విషయంలో మానవుని 'అహం'ను అంగీకరించటంవల్ల, ఆ అహింస అనేది అనిర్దుష్టమూ అసమగ్రమూ అయింది ఆడి అన్యోన్యత పేరిటకాక ఆధ్యాత్మికత పేరిట ప్రతిపాదితమైంది అది పుణ్యక్రియాచరణనుగాక, పాపదూరతనే ఎక్కువగా ప్రేరేపిస్తున్నది.

భౌతిక జగత్తుపట్ల అనుకూల దృక్పథంగల సంఘనీతి పద్ధతిమాత్రమే సహజమూ సమగ్రమూ కాగలదు బ్రాహ్మణ మత ప్రతిపాదితమైన కారుణికత్వంకంటె ఒక అడుగు ముందుకు వేసిన బుద్ధుడు కూడా నిరీహ వాదాన్ని నిర్జించవలెననే కోరికను పూర్తిగా ప్రతిఘటించలేకపోయాడు. ధర్మకార్యాలను నిర్వహించే విషయంలోను, తన్నిర్వహణకు తన అనుయాయులను ప్రేరేపించే విషయంలోనూ ఆయన పెక్కుసార్లు నిరీహతను నిరసించాడు సంఘనీతి పేరిట భారతదేశంలో ప్రాపంచికదృష్టి నెలకొంటూనే వుంది ఇది నిరీహవాదాన్ని నిరంతరం ప్రతిఘటిస్తూనే వుంది బ్రాహ్మణ మత దురాగతాలకు వ్యతిరేకమైన హిందూమతంలో భౌతికదృక్పథం నిరీహావాదంతో సమానమైనదిగా గుర్తింపబడింది. ఈరెండు వాదాలు భగవద్గీతలో సమన్వయింపబడ్డాయి

భౌతికప్రపంచంలో సాక్షిమాత్రుడుగా మాత్రమే పాల్గొనటానికి మానవునికి అధికారం ఉన్నదని నమ్మవచ్చు అదేవిధంగా క్రియావంతమైన పాత్రను నిర్వహించే కర్తవ్యంకూడా అతనికి కలదని నమ్మే అధికారం వున్నది. దానికి వెనుక ఉన్న ఉద్దేశ్యాన్నిబట్టి ఈ క్రియాత్మకత సమ్మతమవుతుంది. భగవదిచ్ఛాపూర్తికై కార్యవంతులు కావలెననే వారి వాదం, నిరీహవాదం ఎంత సమంజసమో అంత సమంజసమైనది. ఈనాడు భారతీయ మేధావులు, ఉపనిషత్సమ్మతమని చెప్పి, క్రియావాదాన్ని చాలావరకు అంగీకరిస్తున్నారు. అది నిజమే పురాతనకాలంలో ఆర్యులు ప్రకృతితో పెన్ఠపేనికొన్న జీవితం గడిపినవారు. క్రీ పూ వేయియేండ్లనాటి పవిత్ర మత గ్రంథాలయిన ఉపనిషత్తులలో ఆధ్యాత్మిక భౌతికవాదాలు ప్రక్కప్రక్కనే కనిపిస్తాయి.

తొలినాళ్ళలోను మధ్యయుగంలోను క్రైస్తవమతం బాహిరమైన ప్రపంచాన్ని నిరసించింది; నిరీహవాదాన్ని అందుకొన్నది. కాని భారతీయమేధావుల ప్రాపంచిక వైముఖ్యానికీ దానికీ భేదంవుంది భారతీయుల దృష్టిలో ఈప్రపంచం ఒక మాయావరణం, క్రైస్తవుల దృష్టిలో అలాకాక, ఈప్రపంచం దోషభూయిష్ఠమైంది కాని క్రమంగా దైవరాజ్యంగా నిర్దుష్టంగా రూపొందవలసినది దైవరాజ్యమనే భావం క్రీ. పూ. 8 వ శతాబ్ది ఇజ్రేల్ మేధావులు సృష్టించినది.

ఈ భౌతిక ప్రపంచం తప్పనిసరిగా దేవునిరాజ్యం కాబోతున్నదని చెప్పి, అట్టి నూతన ప్రపంచంలో నివసించటానికి యోగ్యులుగా మానవులను పరిపూర్ణత సాధించవలసిందిగా క్రీస్తు అర్థించాడు మానవుడు భౌతిక ప్రపంచానికి దూరంగా ఉండవలెనని క్రీస్తు చెప్పాడు దైవచింతన కల్గి ఉండటం మరీ మంచిదని

చెప్పాడు. మానవుడు భౌతికవిషయాలకు దూరంగా ఉండటాన్ని సమ్మతించాడు; కాని తక్కినవారి విషయంలో అతని విధికి దూరంగా ఉండటాన్నికాదు. క్రీస్తు చెప్పిన నీతిలో క్రియాత్మకతే దాని విధిబాధ్యతలను కాపాడింది. బౌద్ధమతంలోని జీవకారుణ్యాన్ని పుణికిపుచ్చుకొన్న క్రైస్తవమతం ఈ విషయంలోనే బౌద్ధంతో భేదిస్తుంది క్రియాత్మకతతో ఉజ్జీవితం కావటంవల్లనే క్రైస్తవ సాంఘికనీతికి భౌతిక దృక్పథంతో ఎక్కువ సాన్నిహిత్యం ఉన్నది

ఈ ప్రపంచం వెంటనే దేవునిరాజ్యంగా పరిణమించాలని ప్రాచీన క్రైస్తవులు కోరుకుంటూ వచ్చారు: కాని అది ఎన్నడూ సంభవించలేదు కనుచూపుమేరలో దేవునిరాజ్యం అవతరిస్తుందన్న ఆశ అతి ప్రాచీనులకువలె, తొలినాళ్ళలోని మధ్యయుగంలోని క్రైస్తవులకు లేకపోవటంవల్ల వారికి ఈ ప్రపంచంమీది ఆస్థ సన్నగిలసాగింది. మధ్యయుగంలో ఉత్సాహపూరితమైన ప్రాపంచికదృష్టి లేనేలేదు ఇది వైజ్ఞానికయుగం వచ్చిందాకా కలుగనేలేదు 16,17 శతాబ్దులలో క్రైస్తవమతం ఈ ప్రాపంచిక దృష్టితో లీనమైపోయింది. వైజ్ఞానిక యుగపు సాంఘికనీతి - క్రీస్తు చెప్పిన ఆత్మపరిణామసిద్ధాంతాన్ని అలావుంచి - మానవజాతికి ఉత్తమ భౌతిక ఆధ్యాత్మిక పరిస్థితులు కల్పించటానికి కృషి చేసింది. అది మొదలు క్రైస్తవ సంఘనీతిలో క్రియావాదానికి ఒకలక్ష్యం ఏర్పడి, అది సమగ్రవికాసం పొందింది. క్రైస్తవతత్వంయొక్క వైజ్ఞానికయుగంయొక్క క్రియాశక్తి ఏకీకృతమై ఈనాటి మననాగరికత ఉత్పన్నమైనది. ఈ నాగరికతలోనే మనం జీవిస్తున్నాము: దీనిని పరిరక్షించి పెంపొందించవలసిన బాధ్యత మనది.

క్రీస్తుశకం మొదటి శతాబ్దిలో మానవతా ప్రతిపాదకుడైన సెనేషియస్ అడుగుజాడలలో - స్టాయిసిజం శాలూకు మేధావులు సెనేకా, ఎపిక్టేటస్. మార్కస్ ఆరిలస్ చక్రవర్తి మొదలైనవారు ప్రేమను ఉత్తమగుణంగా గణించసాగారు. వారి పద్ధతి దాదాపు చీనా మహామేధావుల పద్ధతివంటిదే ప్రేమ సిద్ధాంతమేగాక అది హేతువాదంనుంచే ఆవిర్భవించిందనీ, అది సహేతుకమైనదేననీ ఈ ఉభయులూ సమానంగా నమ్మతారు

క్రీస్తుశకం మొదటి రెండవ శతాబ్దులలో రోమక వేదాంతంకూడా క్రైస్తవనీతివంటి దానినే ప్రబోధించినట్లు కన్పిస్తుంది. పురాతనయుగానికి క్రైస్తవ యుగానికీ సామరస్యం సాధ్యమే కాని అది జరుగలేదు. నైతికమైన స్టాయిసిజం సుప్రతిష్ఠితం కాలేదు. అంతే కాదు, జీసస్ క్రీస్తులో ఒక దివ్యసంబంధం ఆరోపితం కావటంచేత, ఒక నూత్న ప్రపంచాద్భుతావతరణను ప్రతీక్షించటంచేతా క్రైస్తవమతం ఒక మూఢవిశ్వాసమని స్టాయిసిజం నిందించింది. లౌకికజ్ఞానానికి పునాది అనే దృష్టితో క్రైస్తవమతం వేదాంతాన్ని తిరస్కరించింది గ్రీకురోమన్ వేదాంతానికి క్రైస్తవమతానికీ ఉన్న భేదమేమిటంటే- మొదటిది భౌతిక ప్రపంచాన్ని నమ్మింది, రెండవది దానిని మిథ్యగా పరిగణించింది. కనుక సామరస్యం సాధ్యంకాదు.

అయితే శతాబ్దుల అనంతరం సామరస్యం ఏర్పడింది ఐరోపీయ భావప్రపంచానికి వైజ్ఞానికయుగం ప్రసాదించిన ప్రాపంచిక దృష్టిని ఆమోదించిన పిమ్మట, క్రైస్తవమతం నైతికమైన స్టాయిసిజంలో కలిసింది క్రీస్తుచెప్పిన ప్రేమతత్త్వం సహేతుకమైన సత్యమని ఆశ్చర్యంతో గుర్తించింది. దీన్ని బట్టి ప్రధాన మతసిద్ధాంతాలన్నీ తర్వాత సహేతుకంగా నిరూపింపబడిన ప్రబుద్ధసత్యాలు అని నిర్ధారించవచ్చు. క్రైస్తవమతానికీ స్టాయిసిజానికీ తాము చెందినవారమని భావించిన మేధావులు ఎరాస్మస్, హ్యూగోగ్రోషియస్‌లు

క్రైస్తవ మతప్రభావంక్రింద, వేదాంతుల నీతులు అంతకుముందు లేని ఉత్సాహం తెచ్చుకొన్నాయి. వేదాంతప్రభావంక్రింద క్రైస్తవమతం ఆత్మపరిశీలన చేసికొన్నది ఈ ప్రపంచంలో తన కర్తవ్యాన్ని గుర్తించింది. ఈ ప్రేమ సిద్ధాంతంమూలంగా అన్యాయం, దౌర్జన్యం. మూఢవిశ్వాసం నిరాకృతములైనాయి హింస బహిష్కృతమైంది అమానుషమైన శాసనాలు పోయి, మానవకారుణ్యంతో గూడిన శాసనాలు వచ్చాయి. ఇంతకుముందు మానవ చరిత్రలోనే లేని ఒక సంస్కారం ప్రారంభమైంది. ప్రేమతత్త్వం సహేతుకమైనదన్న తొలి ఊపులోనే ఎంతో అభివృద్ధి సాధింపబడింది.

పదునెన్మిదవ శతాబ్ది వేదాంతులు హార్ట్లీ, బారన్ హోల్‌బక్, హెల్వేటస్, బెంథామ్ మొదలైనవారు వాస్తవిక వాదంలోని సహేతుకతను నిరూపించటంకోసం ఇతరుల ప్రేమించటంలో ఒక ఏకతాప్రయోజనం ఉన్నదని చూపితే చాలుననుకొన్నారు. చైనా మేధావులూ, నైతికమైన స్టాయిసిజం ప్రతినిధులూ ఈ ఏకతాప్రయోజనాన్ని అంగీకరించారు. కాని తక్కిన ప్రయోజనాలనుకూడా నొక్కి వక్కాణించారు. పదునెన్మిదవ శతాబ్ది మేధావులదృష్టిలో వాస్తవికవాదం బాగా తెలిసిన స్వార్థవాదం, ఎందుకంటే, మానవులు తమ సాటివారికోసం చేసే త్యాగంవల్లనే వ్యక్తిశ్రేయస్సు సమాజం శ్రేయస్సు సురక్షితం కాగలదు కనుక.

ఈ అయోమయమైన తత్వాన్ని కాంట్, డేవిడ్ హ్యూమ్‌లు నిరాకరించారు నీతిశాస్త్రంయొక్క ఉదాత్త

తను నిలబెట్టే దృష్టితో కాంట్ ఒకనీతికి ప్రయోజనం ఉన్నదాలేదా అని విచారించరాదనేటంతదాకా వెళ్ళాడు అది నీతికి మూలంగా అంగీకరించరాదనేది స్పష్టమే నీతులంటే కేవలం నియమాలు ఏది మంచో ఏది చెడో మన అంతరాత్మే మనకు చెబుతుంది మనం ఈ ప్రపంచానికి మాత్రమే చెందిన వారము కాక, దేశకాలాదులలో ఒక ఆధ్యాత్మిక లోకానికి చెందిన వారముకూడా కనుక మనం నైతిక సిద్ధాంతాలను అనుసరించి తీరాలి

ప్రయోజన వాదాన్ని తిరస్కరించటంకోసం హ్యూము ఆధ్యాత్మికధోరణిని అవలంబించాడు నీతి శాస్త్రంయొక్క ఉద్దేశ్యాలను తరచి, అది కేవలం భావనకు సంబంధించినది మాత్రమే అన్న నిశ్చయానికి వచ్చాడు. ఇతరులయొక్క కష్టసుఖాలను అర్థం చేసికొని సానుభూతి చూపగలశక్తిని మనకు ప్రకృతి ప్రసాదించినదని ఆయన వాదన తక్కినవాటితో మేళవించే తంత్రులవంటివారము మనము ఈ సానుభూతివల్లనే మనం ఇతరులపట్ల ఆసక్తి కలగివున్నాము వారి బాగుకూ, సమాజశ్రేయస్సుకూ కృషి చేయగలిగి వున్నాము.

హ్యూమ్ తర్వాత, నీషే సిద్ధాంతాన్ని వదిలితే,- నీతిశాస్త్రం ప్రేమసిద్ధాంతం అన్నదాన్ని సందేహించిన వారు లేరు

ఇలాగయితే; ప్రయోజన వాదములమాదిరిగా, నీతిశాస్త్రం స్వార్థత్యాగాన్ని నిర్వచించి, దానికి ఒక పరిమితిని పెట్టి, స్వార్థవాస్తవ వాంఛాలను దానికి అనుగుణంగా ఉంచగలిగిందా?

హ్యూము ఈ సమస్యను విచారించనేలేదు ప్రేమవల్ల స్వార్థత్యాగమనే దాని పర్యవసానాన్ని పరిశీలించటం అవసరమని అతని అనుయాయులైన వేదాంతులు కూడా భావించలేదు, ఈ పర్యవసానాన్ని విచారించటం వారికి అననుకూలంగా కనిపించినదేమో నని పిస్తుంది.

అదీ నిజమే ప్రేమతో స్వార్థత్యాగమనే నీతి ఒక న్యాయంతాలూకు లక్షణాన్ని ఎంతమాత్రం పొందలేదు. దాన్నిగురించి స్పష్టమైన సుప్రతిష్ఠతమైన సూత్రాలేమీలేవు ఎవడికివాడు ఎంతస్వార్థాన్ని త్యజించగలడో నిర్ణయించుకోవలసివున్నదీ కాబట్టి అది కేవలం వ్యక్తిగతమైనదే అయింది

స్పష్టములైన ఆజ్ఞలను ఇవ్వటం మానటమేకాదు, న్యాయశాస్త్రం ఉండవలసిన తీరున సాధ్యపరిమితులతో తృప్తిపడటంకూడా మానివేసారు అసాధ్య సాధనకోసం, మన జీవితానికే హాని కలిగినప్పటికీ ఇతరులకు సహాయం చేయటంకోసం సంఘనీతి నిరంతరం మనల్ని ప్రోత్సహిస్తున్నది. మనం జీవితం గడిపిన ఇటీవలి క్లిష్టకాలంలో బహుదారుణ పరిస్థితులను, ఇతరులకోసం ఆత్మ బలిదానం చేసిన అనేక వ్యక్తులను చూసాము మన నిత్యజీవితంలో సైతం ఈ స్వార్థత్యాగ సిద్ధాంతం స్వార్థాన్ని పరిత్యజించి, ఇతరులకోసం స్వలాభాలను వదలుకోవలసిందిగా మనల్ని కోరుతున్నది కాని దురదృష్టవశాత్తు, మన కర్తవ్యనిష్ఠను కాపాడే అంతరాత్మనుకూడా మనం తరచు నిద్రపుచ్చుతున్నాము.

స్వార్థాన్ని పరిత్యజించి, పరార్థాన్ని పరిగ్రహించాలంటే ఎంత సంఘర్షణ! పూర్తిగా యోగ్యతలు కల వాడికి గాక, ఎవడికి ఉద్యోగం అవసరమో వాడికి అధికారులు ఆ ఉద్యోగం ఇవ్వటంలేదు పై విధంగా ప్రేమ సిద్ధాంతాన్ని ఎన్నడూ పరిగణించకుండా ఉండే అధికారం తమకున్నదని భావించేవారికి పాపం తప్పదు

స్వార్థత్యాగాన్ని గురించి మనం ఒక పరమార్థం సాధించవచ్చు ఈ ప్రేమతత్త్వం మానవులసమాత్రమే పరిమితం కాక, మనపై ఆధారపడిన సమస్త జీవకోటికీ వర్తిస్తుంది అన్నిజీవులు సుఖాన్నే ఆశిస్తాయి: కనుక అవికూడ మన సహచరులేగదా! వాటికీ భయమూ బాధా తెలుసు వినాశమంటే వాటికి భయమే.

ఇంగితజ్ఞానంగల ప్రతివ్యక్తికీ సమస్త జీవకోటి యెడల కారుణ్యం కలిగియుండవలసిన ఆవశ్యకత అతి సహజంగా కనిపిస్తుంది మన వేదాంతం మనకు చెప్పే సంఘనీతిలో సమస్త జీవకోటిపట్ల మన ప్రవర్తనకూడా ఒక ప్రధానభాగమని మన వేదాంతం ఎందుకు గుర్తించదు?

కారణం చాలా స్పష్టం సంఘనీతిలో ఇంకా సహేతుక సంతృప్తికర ధర్మాలను నిర్ధరించగలమన్న ఆశకు అవకాశాన్ని ఈ బాధ్యతాబాహుళ్యం తొలగించి వేస్తుందేమోనని మన వేదాంతానికి భయం. అది నిజమేకూడా.

నిజానికి మనసాన్నిహిత్యంలోకి రాగల సమస్త జీవకోటి శ్రేయస్సును మనం దృష్టిలో పెట్టుకొన్నట్లయితే కేవలం మానవశ్రేయస్సుకై కృషి చేసేటప్పటికంటె, ఎక్కువ ఆందోళనకర సంఘర్షణల నెదుర్కొనవలసివస్తుంది మనం ఇతర జీవులకు వాని జీవితాలకు హాని కల్గించక తప్పని పరిస్థితుల్లో తరచుగా పడుతుంటాము రైతు తనదగ్గరి జంతువులన్నిటిని బ్రతికించలేడు. తాను పోషించగలిగినంతవరకు, అవసరమైన ఆదాయం తేగల జంతువులనుమాత్రమే అతడు పోషిస్తాడు చాలా సందర్భాలలో తక్కినవాటిని రక్షించటంకోసం కొన్నిటిని బలిచేయవలసికూడా వస్తుంది ఒక పిట్టను పెంచేవాడు దాని పోషణకు పురుగులను చంపవలసివస్తుంది. అలా చేయటానికి

అతడు నిరంకుశంగా ఒక నిర్ణయం తీసుకుంటాడు. ఒక్క జీవితాన్ని కాపాడటంకోసం అతడు ఏ అధికారంతో బహు జీవితాలను బలిచేస్తాడు? తక్కిన జంతువులను కాపాడటంకోసం, వాటికి హానికరములని తాను భావించే జంతువులను చంపటానికి అతడు నిరంకుశంగానే నిర్ణయించుకోవలసి వుంటుంది.

కాబట్టి అవసరాన్నిబట్టి మనం హానిచేసిగానీ చంపిగానీ పాపం సంపాదించుకోవాలా - అన్న అంశాన్ని మనలో ప్రతి ఒక్కరం నిర్ణయించుకోవలసి వుంటుంది. జీవజంతువులను రక్షించే ఏ ఒక్క అవకాశాన్నీ జారవిడువకుండా వుంటే, మనం భగవంతుని క్షమను అర్థించవచ్చు

జీవకోటి కవసరమైన కారుణ్యాన్ని గుర్తించి నిర్లక్ష్యంవల్ల వాటికి హాని చేయకుండా ఉన్నట్లయితే ఎంత పురోగమనం సాధించినట్లు! మన నాగరికతకు ఏమైనా గౌరవం ఉండాలంటే, ఇంకా ఈనాటికీ ఉన్న అమానుష సంప్రదాయాలకూ భావాలకూ వ్యతిరేకంగా మన పోరాటాన్ని ఇనుమడించవలసి వుంటుంది. మన నాగరిక ప్రపంచం సహించగూడని అంశాలు రెండు ఉన్నవి. ఎడ్ల పోట్లాటలు - వీటిలో వాటి చావు తప్పదుగదా - ఒకటి, వినోదంకోసం వేటాడటం రెండవది

ఒక్క ప్రేమతత్వంతో మాత్రమే మన సంఘనీతి ఆదర్శప్రాయమూ సమగ్రమూ కాగలదు.

మన సంఘనీతిలో మరొక గొప్పమార్పు ఉన్నది ఈనాడు అది ప్రవచించే ఊహాప్రపంచంనుండీ దానికేమీ సహాయం లభించదు

ప్రాపంచిక ప్రకృతిని గూర్చిన జ్ఞానంతో మేళవించిన ప్రవర్తన కావాలనిమాత్రమే పూర్వపు సంఘనీతి చెప్పేది. ఈ విశ్వాసంమీదనే మతాలూ ఆధారపడ్డాయి: ఏడెన్మిది శతాబ్దుల హేతువాద సిద్ధాంతం కూడా ఆధారపడింది మన నీతిశాస్త్రం ఉద్దేశించబడిన ప్రపంచం, వాస్తవ ప్రపంచాన్ని గూర్చిన ఆశాగానం మీద ఆధారపడినదే వాస్తవ ప్రపంచాన్ని గూర్చిన నీతిశాస్త్రం అలాగే వెనుకా వ్యాఖ్యానించింది ఇంకా వ్యాఖ్యానిస్తున్నది. తన భావనా నిర్దేశాలకు అనుగుణంగా అది విశ్వమానవ మనస్సుకు గుణగణాలనూ ఉద్దేశ్యాలనూ ఆరోపించింది,

పందొమ్మిదవ శతాబ్దిలో ప్రత్యక్ష సత్యానికి ప్రాముఖ్యం ఏర్పడింది. దానితో మన నీతిశాస్త్రానికీ నిత్య సన్నిహిత ప్రాపంచిక జ్ఞానానికీ ఏమీ సంబంధం లేదని తేటతెల్లమైంది ప్రకృతి లక్షణాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకొనటంలోనే భౌతిక శాస్త్రాభివృద్ధి ఇమిడివున్నది. అది భౌతిక శక్తులను మనకు వైవసం చేసింది. కాని అది మన సర్వజ్ఞత్వాన్ని విసర్జింపజేసింది ఈ ప్రపంచం పరస్పర సంఘర్షణతోనే బ్రతకాలనే వాంఛను ప్రకటిస్తున్నది ఒక జీవితం వేరొక జీవితాన్ని బలిగొని తన్నుదాను నిలబెట్టుకొంటున్నది ఈ ప్రపంచమంతా ఉదాత్తతలో బీభత్సంగానూ, జ్ఞేయంలో అయోమయంగానూ, సుఖంలో దుఃఖంగానూ కనిపిస్తున్నది,

కనుక ఉచితమైన ప్రాపంచిక దృక్పథంచేత సమర్థింపబడక, స్వార్థత్యాగ సిద్ధాంతం ఏవిధంగా నిలబడగలదు? దీన్నిబట్టి చూస్తే స్వార్థత్యాగమనేది వట్టి బూటక మవుతుంది కాని దానికి ఆ గతిమాత్రం పట్టదు

మొదట్లో, తనకు తృప్తికరమైన ఒక ప్రపంచం అవతరించవలెనని సంఘనీతి కోరింది. ఇతరులపట్ల బాధ్యతకలిగి యుండటమే దాని ప్రధానసూత్రమని గుర్తించిన తర్వాత అది తన్నుదాను తెలిసికొని స్వయం సమృద్ధమైంది.

ఈనాడు మనం ప్రపంచాన్ని మనల్ని అనుశోధించుకొనటం వల్ల దాని పుట్టుపూర్వోత్తరాలను అర్థం చేసికోగలుగుతున్నాము. మనకు ప్రపంచాన్నిగూర్చి పూర్తి తృప్తికరమైన జ్ఞానంలేదు, ఈ ప్రపంచంలో మనలాగానే అన్నిజీవులూ బ్రతుకుతున్నాయనీ, అసలు జీవితమంతా మిథ్యయే అనీ నిశ్చయించుకొనే స్థితిలో పడ్డాము స్థితి జీవితాలయొక్క అద్భుత శక్తిని గ్రహించటంలోనే ప్రపంచాన్నిగూర్చిన మన వాస్తవికజ్ఞానం గోచరిస్తుంది భౌతిక శాస్త్రపరిశోధన పెంపొందినకొద్దీ ఈ అద్భుతశక్తి మరింత అద్భుతంగా కనిపిస్తున్నది. జీవితమాయలో మునిగిపోవటమంటే, మాయావాదుల మాటలలో 'తెలిసిన అజ్ఞానం' అన్నమాట

మనల్నిగురించీ, మనం ఉన్న పరిస్థితినిగురించీ తెలిసికోవలసి వచ్చినప్పుడల్లా మనం మన అంతరాత్మను ప్రశ్నించుకొంటాము ఆ అంతరాత్మయందలి ప్రధానభావం ఇది: "బ్రతుకగోరుతున్న ప్రాణంచేత పరివేష్టితమై బ్రతుకగోరుతున్న ప్రాణాన్ని నేను!" అని జీవితాన్నిగురించి ఆలోచించిన కొద్దీ, జీవించాలనే వాంఛను - మన వాంఛనులాగే - గౌరవించాలనీ దీనికేదో అద్భుతమైన విలువ ఉన్నదనీ నాకు అనిపిస్తుంది

అప్పుడు జీవితాన్ని కాపాడటంలోనూ, దానికి సహాయపడటంలోనూ. దాన్ని ఉత్తమశిఖరాల కెత్తడంలోనూ 'మంచి' అనేది ఉన్నదనీ, జీవితాన్ని వినాశం చెయ్యటంలోనూ దానికి హాని కలిగించటంలోనూ దాని పెంపుకు అడ్డు పెట్టటంలోనూ 'చెడు' ఉన్నదనీ స్పష్టపడుతుంది

మంచినిగూర్చి నిర్వచించిన సర్వమత వేదాంత సారమైన ప్రేమ సిద్ధాంతంతో ఈ జీవితాన్ని గౌరవించాలనే సూత్రం అనుగుణమైనదే

'జీవితంపట్ల గౌరవం' అనేది 'ప్రేమతత్త్వం'కంటె అతివిశాలమైనది; అతి స్థూలమైనదికూడా కాని ఇందులో ప్రేమతత్త్వంలోని శక్తులన్నీ ఉన్నాయి. ప్రేమతత్త్వంకంటె మంచిని గూర్చిన ఆధ్యాత్మిక భావనకే ఎక్కువ సమగ్రంగా ఉండే అవకాశం ఉన్నది ప్రేమ అనేది తక్కిన జీవులపట్ల మనబాధ్యతనుమాత్రమే చెబుతుందిగాని మనపట్ల మన బాధ్యతను చెప్పదు మానవుడు తన జీవితంపట్ల తనకుగల ప్రేమ ఫలంగానే తన్నుదాను వంచించుకొనక ఉదాత్త గంభీరమార్గంలో నడుచుకొంటాడు.

'జీవితంపట్ల గౌరవం' ఉండటంవల్ల మనం ప్రపంచంలో ఆధ్యాత్మిక సంబంధం నెలకొల్పుకోగలము పరమాత్మ మనం ఎట్టి సంబంధమూ పెట్టుకోటానికి అవకాశం లేనంత అజ్ఞాతంగా ఉన్నది కాని మనం జీవితంయొక్క అద్భుతశక్తిని గ్రహించి, మనకు సాధ్యమైనంతవరకు జీవకోటి సేవచేయటంద్వారా మనం పరమాత్మకు సన్నిహితులము కాగలము

మానవులతో, మానవ సమాజంతోమాత్రమే మనల్ని సన్నిహితపరచగలిగిన సాంఘికనీతికి ఇంత ప్రాముఖ్యం ఉండజాలదు సమస్త జీవకోటితో మనల్ని సన్నిహితులను చేయగల్గిన ప్రాపంచికనీతి ఒక్కటే మనల్ని సమస్త ప్రపంచంలోనూ లీనం చేసి, విశ్వాత్మను వెల్గించగలదు

ప్రపంచంలో జీవితాశ అంతస్సంఘర్షణతోకూడి వుంది మనకు తెలియరాని ఒక అద్భుతంగా మనలోని జీవితాశ, మనం దానికి అంటిపెట్టుకొని ఉండేటట్లు చేస్తున్నది ప్రపంచంలో అది దానంతట అదే ప్రకటీకృత మవుతున్నది. మనలోనే తనంతదానే వ్యక్తపడుతున్నది ఈ ప్రపంచంకంటె వేఱుగా ఉండటమే మన ఆధ్యాత్మిక లక్ష్యం దానికి లోబడేకంటె దానిని అనువర్తించటంవల్ల మన జీవితాన్ని సార్థకం చేసికోగలము జీవితంపట్ల గౌరవం కలిగియుండటంవల్ల మనం మంచిగా, గంభీరంగా,సచేతనంగా జీవించగలము

విశ్వనాథమధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

నామనోవృత్తిఁ జూచినను వేంయిజన్మలకైనఁ గాని
యీ మోహము తొలంగిపోవు నను నాశయింతయు లేద
యే మూలనో నీవ యంటి కొంచు దహింప నేఁ జెప్ప
వే మరి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

మనసు భ్రమించుచు నున్కి మంచికి మరలించుచున్కి
చన న్యర్బుదంబులు శంఖముల్లు సార్లు జరిగియుఁ బాయు
టను జెప్పఁగా రాద యిట్టి పట్టి టార్గాలకుఁ గాదు
వినతము నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

మొదలు తుదియు లేని కష్టములు దుఃఖములు పూర్వభక్తు
లెదఁగోరి రనుమాట యర్థమిప్పటి కెఱుఁగ వచ్చెడిని
పది పిచ్చికలు చేతిలోన నాడ నీపై మరుల్ సన్న
ప్రిదిలెడు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

నీ మంచితనమును నిజముగా సాగనీయను నేను
స్వామి నాచెట్టతనమును మరి నీవు సాగనీ వలయు
నామముల్ మొలిచెనా నాకు మొలిచె నిన్నమ్మితిఁ గానఁ
బ్రేమించి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

కురియుచోఁ బైనుండి మన్నుపూడి పోకుండఁ గల్గెడినె
యరయంగ నెంతగాలికిని బ్రాణము లాడగా వచ్చు
నురువులౌ భౌమముల్ దివ్యములునైన యూహా లీ రీతిఁ
బెరసెడు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

నినుఁగూర్చి చదివితిఁ దెలియవచ్చెను నీ స్వరూపంబు
ఘనులైన పెద్దలవలన విన్నాను గడగి యన్యులకు
వినిపింప వలఁతిని గూడ ననుభూతి విభవంబు లేదు
వెనుకొని నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఏం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి.

పంచమోఽధ్యాయః

పూర్వరంగ విధానము.

భరతస్య వచః శ్రుత్వా నాట్య సంతాన కారణమ్
పునరేవా బ్రువన్ వాక్య మృషయో హృష్టమానసాః. ౧

యథా నాట్యస్య జన్మేదం జర్జరస్యచ సంభవః.
విఘ్నానాం శమనం చైవ దేవతానాం చ పూజనమ్ ౨

తదస్మాభిః శ్రుతం సర్వం గృహీత్వా చావధారితమ్.
నిఖిలేన యథాతత్త్వ మిచ్ఛామో వేదితుం పునః. ౩

పూర్వరఙ్గం మహాతేజః సర్వలక్షణ సంయుతమ్
యథా బుధ్యామహే బ్రహ్మం స్తథా వ్యాఖ్యాతు మర్హసి ౪

నాట్యోత్పత్తిని గురించి భరతుడు చెప్పిన వృత్తాంతమును విని సంతోషము నొందు మనస్సులతో మరల ఋషులీ విధముగా భరతునితో పలికిరి- "నాట్యోత్పత్తి, ధ్వజముయొక్క జననము, విఘ్నములు నివారించుట, రంగ దైవతపూజన అను విషయములు మీరు చెప్పగా వింటిమి. ఈ విషయమంతయు చక్కగా మాచే గ్రహించబడినది, అవధరించబడినది. కాని సకల లక్షణములతో కూడిన పూర్వరంగ విధిని సాకల్యముగా వినగోరియున్నాము. అది మాకెట్లు బోధపడగలదో అట్లు మీరు చెప్పవలయునని మా కోరిక."

గ్రహణధారణ పాటవము గలవాడే యోగ్యుడగు శిష్యుడు. అట్టి శిష్యుడే నూతన విషయములను చెప్పుటకు గురువునకు ఉత్సాహము కల్గించగలడు. కనుక మునులకిచ్చట గ్రహణధారణ పటుత్వము చెప్పబడినది. నాట్యము హృదయావేశమును కల్గించునది కావున నాట్యోత్పత్తిని వినిన మునులను హృష్టమానసులనినాడు. ఈ పూర్వరంగ ప్రశంస నాల్గవఅధ్యాయ మందనేక పర్యాయములు కన్పించుట చేతను, పూర్వరంగవిధి ముఖ్యమగుట చేతను, మునులీ యధ్యాయమున పూర్వరంగమును గురించి ప్రశ్నించ నుద్యుక్తులైనారు.

తేషాంతు వచనం శ్రుత్వా మునీనాం భరతోమునిః
ప్రత్యువాచ పున ర్వాక్యం పూర్వరంగవిధింప్రతి. ౫

మునుల వాక్యమును విని భరతముని పూర్వరంగవిధిని గురించి ఇట్లు చెప్ప సాగెను.

పూర్వరఙ్గం మహాభాగా గదతో మే నిబోధత
పాదభాగాః కలాశ్చైవ పరివర్తా స్తథైవచ.

పూర్వరంగ నిరూపణ నిక శ్రద్ధతో వినవలసినది. పూర్వరంగమున పాదభాగ ములు, కళలు, పరివర్తములు కలవు.

బహిర్యవనికాంగములే పూర్వరంగమున వచ్చునవి. ఉత్థాపనీధ్రువా మొదలుగా గీతకములు, ద్వికళచంచత్పుట చాచపుట తాళములు నిట గలవు. ద్వికళ చతుష్కళలకు మార్గములోని చంచత్పుటాదుల సంయోగముతో భాగమువచ్చును. కళా అను శబ్దముచే అక్షరమార్గము గ్రహించబడు చున్నది తద్ద్వారా గీతక వర్ధమానాది గతమగు గేయరూపము రాగలదు. కళాశబ్దము వలన సప్తవిధములగు తాళకళలు కూడ రాగలవు. పరివర్తశబ్దముచే సమస్తమైన తాళములయొక్క ఇతి కర్తవ్యత స్వీకరింపబడుచున్నది.

ఈ శ్లోకములో "చ, ఏవ, తథా, ఏవ, చ" అను ఐదు శబ్దములు కలవు. మొదటి చకారముచే తంత్రీ మొదలగునవి, మొదటి ఎవకారముచే నాట్యప్రయోగము, తథాశబ్దముచే అంగాంగిభావ ప్రయోగము, రెండవ ఏవకారముచే నాట్యాంగత, రెండవ చకారముచే పాఠ్యాదినృత్తము స్వీకరించబడుచున్నవి. ఇవన్నియు పూర్వరంగమున కలవనిభావము. గీత, తాల, వాద్య, నృత్త, పాఠ్యములెచట నాట్యాంగములుగా ప్రయోగింపబడునో అది పూర్వరంగమగును.

కావున 'పూర్వరఙ్గ' మనగా రంగముయొక్క పూర్వభాగమని అర్థము చెప్పుకొనరాదు. ఇది మండపమందలి పూర్వభాగము కాదు, నాట్యమునకు పూర్వ భాగముకూడ గాదు. 'పూర్వోరఙ్గః' అని చెప్పికొనవలెను. వైచిత్ర్యకారిగా నృత్తముకూడ ఇచట ప్రవేశించుచున్నది. ధూపవిలేపనాదుల వలె పూర్వరంగవిధి కూడ దేవతాపరితోషణ ఫలము గలది. రంగస్థలము నాట్యరంగము కాకముందు పూర్వరంగమగును. ఆ పూర్వరంగమున చేయవలసిన క్రియాకలాపము నీ అధ్యాయమున చెప్పుచున్నాడు.

యస్మాద్రఙ్గే ప్రయోగోఽయం పూర్వమేవ ప్రయుజ్యతే
తస్మాదయం పూర్వరఙ్గో విజ్ఞేయో ద్విజసత్తమాః.

నాట్యప్రయోగమునకు ముందే చేయబడు ప్రయోగవిశేషమును పూర్వ రంగ విధానమని యందురు.

అస్యాఙ్గానితు కార్యాణి యథావ దనుపూర్వశః
తంత్రీ భాండసమాయోగైః పాఠ్యయోగకృతై స్తథా. ౭
ప్రత్యాహారో ఽవతరణం తథా హ్యారంభఏవచ
ఆశ్రావణా వక్త్రపాణి స్తథాచ పరిఘట్టనా. ౯
సంఘోటనా తతః కార్యా మార్గాసారితమేవచ
జ్యేష్ఠ మధ్య కనిష్ఠాని తథైవా సారితానిచ ౧౦

ఏతానితు బహిర్గీతా న్యంత ర్యవనికాగతైః
ప్రయో క్తృభిః ప్రయోజ్యాని తంత్రీ భాండకృతానిచ. ౧౧

పూర్వరంగవిధిలో వరుసగా చేయవలసినవి, తదంగములు కొన్ని గలవు. పాఠ్యము, తంత్రీభాండములతోను వీనిని నిర్వర్తించవలెను. ప్రత్యాహారము, అవతరణము, అరంభము, ఆశ్రావణము, వక్త్రపాణి, పరిఘట్టన, సంఘోటన, మార్గాసారితము, ఆసారితములు అను తొమ్మిదింటిని అంతర్యవనికాంగములుగా ప్రయోగించవలెను. రంగపీఠమునకు రంగశిరమునకు మధ్య వేయుదానిని యవనిక యందురు. యవనిక అనగా తెర. తెరలోపలకు వచ్చిన నటులచే ప్రత్యాహారాదులు తంత్రీభాండ సమాయుక్తములుగా ప్రయోగింపబడును. ప్రత్యాహారాదులను మున్ముందు నిర్వచింపబోవు చున్నాడు.

తతః సర్వైస్తు కుతపైః సంయుక్తా నీహ కారయేత్
విఘట్య వై యవనికాం నృత్త పాఠ్య కృతానితు. ౧౨
గీతానాం మద్రకాదీనాం యోజ్య మేకంతు గీతకమ్
వర్ధమాన మథాపీహ తాండవం యత్ర యుజ్యతే ౧౩
తత శ్చోత్థాపనం కార్యం పరివర్తనమేవచ
నాంది శుష్కావకృష్టాచ రఙ్గద్వారం తథైవచ ౧౪
చారీచైవ తతః కార్యా మహాచారీ తథైవచ
త్రికం ప్రరోచనాచాపి పూర్వరఙ్గే భవంతి హి ౧౫
ఏతా న్యఙ్గాని కార్యాణి పూర్వరఙ్గవిధౌ ద్విజాః
ఏతేషాం లక్షణమహం వ్యాఖ్యాస్యా మ్యనుపూర్వశః. ౧౬

అంతర్యవని కాంగములను ప్రయోగించిన తర్వాత వాద్యవిశేషముల నన్నిటిని ఒకచో సమావేశ పరుపవలెను. ఆ పై తెరను తొలగించవలెను. నృత్తముతోను, పాఠ్యముతోను మద్రకాది గీతములలో నొక గీతమును ప్రయోగించవలెను. తాండవనృత్యము చేయుచో వర్ధమానక గీతముకూడ యుక్తమే యగుచున్నది. ఆతర్వాత ఉత్థాపనము, పరివర్తనము, అర్థరహితమగు అవకృష్టానాందిలను ప్రయోగించవలెను. పూర్వరంగమున చారీ, మహాచారీ, త్రికము, ప్రరోచనలుకూడాకలవు. పూర్వరంగమున నీ అంగములన్నియు కలవు. వీటి లక్షణములన్నియు వరుసగా వివరించబడు చున్నవి.

కుతపస్యతు విన్యాసః ప్రత్యాహారఇతి స్మృతః
తథావతరణం ప్రోక్తం గాయకానాం నివేశనమ్. ౧౭

కుతపమనగా సంగీతవాద్యముల సమూహమని అర్థము. ఈ వాద్యములను, వాద్యగాండ్రను నియమసహితముగా నివేశింపజేయుటయే ప్రత్యాహారము. నేపధ్యగృహమునుంచి నాట్యగృహపు తూర్పువాకిలివరకుగల ప్రదేశమునకు మధ్యగా తూర్పున కభిముఖుడై మృదంగము వాయించువాడుండును. అతనికి ఎడమ ప్రక్కగా పణవవాద్యగాండ్రిరువు రుందురు. రంగపీఠమునకు దక్షిణదిక్కున ఉత్తరాభిముఖుడై గాయకుడు, ఇతనికి ఎదురుగా ఉత్తరదిక్కున దక్షిణాభిముఖులై గాయకు

రాం(డుందురు. గాయకునకు ఎడమప్రక్కగా వైణికుడు, గాయకురాం(డ కెడవ ప్రక్కగా పిల్లన(గోవులతో నిరువురుందురు. ఈ ఏర్పాటును కుతపవిన్యాస మందురు. శబ్దవిశేషములను పాలించునవి కుతపములు. ఇవి నాట్యభూమికకు ఉజ్జ్వలత నాపాదించునవి.

గాయకులను నివేదింపజేయుటయే అవతరణ మనిపించుకొనును కుతపవిన్యాసమున గాయకులుకూడ వచ్చియే యున్నారు. కాని నాట్యాంగములలో గీతమవశ్యంభావియని చూపుటకే అవతరణమని మరల గ్రహించబడినది. వస్తుతః ప్రత్యాహారావతరణములు రెండు అంగములు కాజాలవు. ప్రత్యాహారము ప్రయోగింపబడినచో అవతరణముకూడ ప్రయుక్తమే యగుచున్నది.

పరిగీతక్రియారంభ ఆరంభఇతి కీర్తితః
ఆతోద్య రఙ్జనార్థంతు భవేదాశ్రావణావిధిః. ౧౮
వాద్యవృత్తి విభాగార్థం వక్త్రపాణి ర్విధీయతే
తంత్ర్యోజః కరణార్థంతు భవేచ్ఛ పరిఘట్టనా ౧౯
తథా పాణివిభాగార్థం భవేత్ సంఘోటనావిధిః
తంత్రీ భాండసమాయోగాన్మార్గాసారిత మిష్యతే ౨౦
కలాపాత విభాగార్థం భవే దాసారితక్రియా
కీర్తినా ద్దేవతానాంచ జ్ఞేయో గీతవిధి స్తథా ౨౧

శారీరస్వరములకు మూలభూతమై గీతమునకు బింబభూతమై, ఈ స్వరములనను సంధించుటకు చేయు ఆలాపము ఆరంభమనబడును. ఈ ఆలాపాదికమును కోలచునట్లు కన్వరచు తాళముతో సకల వాద్యముల నను సంధించుచు, అందరకు వినబడునట్లు చేయునది ఆశ్రావణము. అనగా ఆశ్రావణము ఆతోద్యగానములను రంజింపజేయునది.

వైణవస్వరస్వరూపమును అనుసంధించుటకు దక్షిణాది వృత్తి విభాగమునాశ్రయించుకొని వచ్చునది వక్త్రపాణి. ఇదివాద్య వృత్తులను విభజించునది. వక్త్రపాణిలో ప్రారంభము చేతి(వేళ్ళతో ప్రయోగము జరుగును. వృత్తుల విభాగమందలి శుష్కప్రయోగాను సంధానమువలన పరిఘట్టన సంభవించును. దీనిద్వారా వీణె తీగెలకు దీప్తిమత్త్వము రాగలదు.

వీణావాద్యము నాశ్రయించుకొని అవనద్ధమైనదానివి అనుసంధించుటవలన ప్రహారపంచకయోగముతో చేయబడునది సంఘోటన. శారీరకముగా బయలుదేరి చివరకు పుష్కరవాద్యమువద్దకు వచ్చుట ఇందులో గాననగును. వీణా పుష్కరవాద్యముల సమ్మేళనమును మార్గాసారితమందురు. ప్రకృత్యాదిలక్షణాది గోచరపళమున పుష్కరవాద్యము కలియుటయే మార్గాసారితము.

కలాపాత విభాగమునకై వచ్చునది ఆసారితము, ఆవాపాదులు కళలు. శమ్యాదులు పాతలు. ఈ రెండింటి అనుసంధాన మిచ్చుట కన్పించును.

ఈ విధముగా మొదట ప్రయోగము కాగా, తదంగానుసారము బహిర్గీత విధి కలదు. బహిర్గీతవిధిలో విశేష ధాతువాద్యములు రాగలవు.

ఇక దేవతాస్తుతు లీ సమయమున గలవు కనుక గీతవిధినిగురించి తెలిసికొనవలెను.

యస్మా తుద్థాపయం త్యత్ర ప్రయోగం నాందిపాఠకాః

నాంది పాఠకులు మొట్టమొదట ప్రయోగించు ఉత్థాపనవిధిని గురించి ఇక చెప్పబోవుచున్నాడు. అనగా పాఠ్యము ననుసరించి యుండునదే విధిక్రియ.

పూర్వమేవతు రఙ్గేఽస్మిం స్తస్మా దుత్థాపనం స్మృతమ్. ౨౨
యస్మాచ్చ లోకపాలానాం పరివృత్య చతుర్దిశమ్
వందనాని ప్రకుర్వంతి తస్మాచ్చ పరివర్తనమ్. ౨౩

రంగమున మొట్టమొదటనే ఉత్థాపన విధిని చేయవలెను రంగమున నాలుగు దిక్కులు కలియదిరుగుచు లోకపాలురకు వందనము చేయుదురు గనుక పరివర్తనమనబడు ప్రక్రియ జరుపబడవలెను.

ఆశీర్వచన సంయుక్తా నిత్యం యస్మా త్ప్రయుజ్యతే
దేవ ద్విజ నృపాదీనాం తస్మా న్నాందీతి సంజ్ఞితా. ౨౪

ఎల్లప్పుడు దేవబ్రాహ్మణ నృపాదుల విషయమును తెలుపుచు ఆశీర్వచనముతో కూడి ప్రయోగింపబడునది నాందియనబడును. ఉత్థాపనాదులు వివిధ పాఠ్యస్థలములలో వివిధ విధములుగా ప్రయోగింపబడగలవు. కాని ఏ సందర్భములోనైనను ఒకే ఒక రూపముతో నుండునది నాంది. భారతీవృత్తికి అంగముగా ఈ నాందియే ప్రరోచనగా నిర్దేశింపబడినది.

నాందీ పాదములమధ్య చిత్ర పూర్వరంగము నాల్గవ అధ్యాయములో నిర్వచించబడిన వర్ధమానమును ప్రయోగించవలెను. గీతక ప్రయోగమైన తర్వాత శుద్ధ పూర్వరంగమున, చిత్ర పూర్వరంగమునకూడ వర్ధమానమును ప్రయోగించవలెనని ఇతరుల అభిప్రాయము

అత్ర శుష్కాక్షరై రేవ హ్యావకృష్టా ధ్రువా యతః
తస్మా చ్ఛుష్కావ కృష్టేయం జర్జరశ్లోకదర్శికా ౨౫

శుష్కాక్షరము లనగా అర్థరహితములగు స్వరములని అర్థము బహిర్యవనికాంగముగా నిచట అర్థరహితములగు స్వరములతో అవకృష్ట యనబడు ధ్రువాగానమును చేయవలెను. ఈ శుష్కావ కృష్టయే ధ్వజమును మార్చి చెప్పిన శ్లోకమును చూపునది.

యస్మా దభినయ స్త్వత్ర ప్రథమం హ్యావతార్యతే
రఙ్గద్వార మతో జ్ఞేయం వాగఙ్గాభినయాత్మకమ్. ౨౬

సామాజికుల కెదురుగ తీసికొనిపోబడునది అభినయము ఇది రూపకపి శయుయు. సంక్షేపముగా పాఠ్యముద్వారా రూపకముయొక్క అర్థప్రయోజనాది నిరూపణ

చేయు అభినయమే ప్రదర్శింపబోవు రూపకమునకు ద్వారము వంటిది, కాగా నీ అభినయము రంగద్వారమనబడుచున్నది. ఉత్థాపనాంగమున నాట్యము సామాన్య రూపమున చేయబడును. ఇచట రూపకవిశేషముగా చేయబడును. ఇది వాగభినయాత్మకము, అంగాభినయాత్మకముకూడ.

శృఙ్గారస్య ప్రచరణా చ్చారీ సంప్రకీర్తితా
రౌద్రప్రచరణాచ్చాపి మహాచారీతి కీర్తితా. ౨౭

శృంగార ప్రధానమైన శివపార్వతుల సహచరణము కరణాంగహారములతో ప్రదర్శించబడిన చారీ యనబడును. ఇది లాస్యాత్మకము. కేవలము శివుని త్రిపురదహనాదికమను రౌద్రప్రవృత్తి ఉద్ధతములగు మండలాంగహారములతో ప్రదర్శింపబడిన మహాచారి. ఇది తాండవములోనిది.

విదూషకః సూత్రధారస్తథాలై పారిపార్శ్వకః
యత్ర కుర్వంతి సఙ్జల్పం తచ్చాపి త్రిగతం వాతమ్. ౨౮

విదూషకుడు, సూత్రధారుడు, పారిపార్శ్వకుడు రూపకమందలి ఇతివృత్తము ను సూచించునట్లుగా చేయు సంభాషణను త్రిగతమందురు

ఉపక్షేపేణ కావ్యస్య హేతుయుక్తి సమాశ్రయా
సిద్ధే నామంత్రణా యాతు విజ్ఞేయా సా ప్రరోచనా. ౨౯

త్రిగతమందలి హేతువునుగాని, సంక్షిప్తముగా చెప్పబడిన విషయమునుగాని ఆశ్రయించుకొనిన కావ్యోపక్షేపముచే సామాజికులను సిద్ధమైన అర్థముతో నామంత్రణ చేయుట ప్రరోచన యని పిలువబడును.

ఈ పైన చెప్పబడిన పదియు బహిర్యవనికాంగములు. గీతకవర్ధమానముల నాశ్రయించుకొనిన ధ్రువాగానము మొట్టమొదట చేయబడును. సదాచారమును పాలించుటకై దేవతా వందనము జరుగును సామాజికులను, దేవతలను ప్రసన్నుల నుగా చేసికొనుటకు ఆశీర్వచనము చెప్పబడినది. రాగలవని శంకించిన విఘ్నములను శాంతిపరచుట, సర్వజనాదరమునందు శృంగారవీరముల నభినయించుట, సర్వరంజకమగు హాస్యమునకు మార్గము చూపుట, కావ్యవిశేషమును గురించి కొంత ప్రస్తావించుట, రూపకములో నుద్దిష్టమైన ప్రయోజనమును వివరించుట మొదలగునవి ఈ బహిర్యవనికాంగములలో వచ్చుచున్నవి.

నాట్యారంభమున సలుపబడు గీతకాద్యంగములన్నియు లోకవ్యవహారము ననుసరించియే చెప్పబడినవి ఇం దలౌకిక విషయమేమియు లేదు. కాని నాట్యము రూపముగా రచనాప్రాధాన్యమంది వైచిత్ర్య గుణాన్వితమై కన్పించును. ఈ విశిష్టతద్వారా నాట్యప్రయోగమున కదృష్టసంపద చేకూరుచున్నది.

అంతఃపరం ప్రవక్ష్యామి హ్యాశ్రావణ విధిక్రియామ్
బహిర్గీతవిధౌ సమ్య క్షుత్పత్తిం కారణం తథా. ౩౦

బహిర్గీత విధియందిక ఆ|శ్రావణవిధిని గురించి దాని ఉత్పత్తి కారణములతో విషయమంతయు సమగ్రముగా భరతుడు చెప్పబోవుచున్నాడు.

చిత్ర దక్షిణవృత్తౌతు సప్తరూపే ప్రకీర్తితే
సోపోహనే సనిర్గీతే దేవస్తు త్యభినందితే. ౩౧

నారదాద్యైస్తు గంధర్వైః సభాయాం దేవదానవాః
నిర్గీతం శ్రావితాః సమ్య గ్లయ తాల సమన్వితమ్. ౩౨

గీతము, వాద్యము అను రెండును ప్రధానముగా చిత్రదక్షిణ వృత్తిమార్గములు. ఉపోహన ప్రత్యుపోహనములతోను, వర్ధమాన నిర్గీతముతోను, వాచ్యభూతమగు దేవతాస్తుతితోను యుక్తమైన చిత్రదక్షిణ వృత్తి ప్రయోగించబడిన గీతమును నారదుడు మొదలుగాగల గంధర్వులు సభలో లయతాళాన్వితముగా పాడగా దేవదానవులు వినినారు.

ధ్రుతాదులు లయలు, శమ్యాదివిశిష్టములు తాళములు. చిత్రదక్షిణవృత్తులు ఏడువిధములు. వీటిలక్షణములు ముందు రాబోవు అధ్యాయములలో చెప్పబడగలవు.

తచ్ఛ్రుత్వాతు సుఖం గానం దేవస్తు త్యభినందితమ్
అభవన్ క్షుభితాః సర్వే మాత్సర్యా ద్దైత్య రాక్షసాః. ౩౩

సంప్రధార్యచ తేఽన్యోన్య మిత్యవోచ న్నవస్థితాః
"నిర్గీతంతు సవాదిత్ర మిదం గృహ్ణీమహే వయమ్. ౩౪

సప్తరూపేణ సంతుష్టా దేవాః కర్మానుకీర్తనాత్.
వయం గృహ్ణీమ నిర్గీతం తుష్యామో ఽత్రైవ సర్వదా". ౩౫

తే తత్ర తుష్టా దైత్యాస్తు సాధయంతి పునఃపునః.

దేవతాస్తుతులతో కూడిన ఈ సుఖజనకమైన గానమును విని, దేవతలపైని మాత్సర్యమువలన దైత్యులు రాక్షసులు క్షోభించినవారై అన్యోన్యము కలసి ఈ విధముగా పలికిరి.- "చిత్రదక్షిణవృత్త్యాత్మకమైన సప్తరూపములతో నున్న గీత వాద్యముచే గానము చేయబడిన కర్మానుకీర్తనమునకు దేవతలు సంతుష్టులైనారు. మేము మాత్రము వీణావాద్యముతో గూడిన శుష్కాక్షరగీతమునే స్వీకరించెదము. ఈ నిర్గీతమే మాకెల్లపుడు సంతోషము నొసగగలదు." ఈ నిర్గీతమున సంతుష్టులగు దైత్యులు తమ కార్యము సిద్ధించినట్లు చెప్పుచున్నారు.

దృష్ట్వాప్యపి తతో దేవాః ప్రత్యభాషంత నారదమ్. ౩౬
"ఏతే తుష్యంతి నిర్గీతే దానవాః సహరాక్షసైః
ప్రణశ్యతు ప్రయోగోఽయం కథంవై మన్యతే భవాన్" ౩౭
దేవానాం వచనం శ్రుత్వా నారదో వాక్యమబ్రవీత్
"ధాతువాద్యాశ్రయకృతం నిర్గీతం మాప్రణశ్యతు. ౩౮
కింతూపోహన సంయుక్తం ధాతువాద్య విభూషితమ్
భవిష్యతీదం నిర్గీతం సప్తరూప విధానతః. ౩౯
నిర్గీతే నావబద్ధాశ్చ దైత్య దానవ రాక్షసాః
న క్షోభం న విఘాతంచ కరిష్యంతీహ తోషితాః". ౪౦

> ఏవం నిర్గీతమేతత్తు దైత్యానాం స్పర్ధయా ద్విజాః
> దేవానాం బహుమానేన బహిర్గతమితి స్మృతమ్. ४౧

దైత్యదానవుల సంతోషహేతువును గాంచిన దేవతలు రోషముతో నారదున కిట్లనిరి- "దానవులు, రాక్షసులు కలసి నిర్గీతమునకే సంతోషపడుచున్నారు. ఇట్టి నిర్గీతప్రయోగము నశించుగాక. మీకిందు అభిమానమెందులకున్నది?" దేవతలమాటలను విని నారదుడిట్లు సమాధానమొసగెను- "ధాతువాద్యము నాశ్రయించుకొనియున్న నిర్గీతము నశింపకుండుగాక. ధాతువాద్యముచే సమలంకృతమై ఉపోహనముతో కూడిన నిర్గీతము శాస్త్రీయముగా నేడువిధములుగా నుండగలదు. ఈ నిర్గీతముచే సంతుష్టులైన దైత్య, దానవ, రాక్షసులు, నాట్యాక్షోభములుగాని, నాట్యవిధ్వంసనముగాని చేయజాలరు." ఈ నిర్గీతమును దైత్యస్పర్ధ వహించిన దేవతలను గౌరవించుటకై బహిర్గీతమని పిలతురు

ధాతువాద్యమనగా వీణె. వీణెలోని తీగలను ధాతువులందురు. సప్తభేదలక్షములు గలది ధాతువాద్యము కేవల స్వరాలాపనచే అదృష్టఫలము సంప్రాప్తించుటచే నిర్గీతమును ప్రయోగించి తీరవలెను

> దాతుభి శ్చిత్రవీణాయాం గురు లఘ్వక్షరాన్వితమ్
> వర్ణా లఙ్కార సంయుక్తం ప్రయోక్తవ్యం బుధైరథ. ४౨
> నిర్గీతం గీయతే యస్మా దపదం వర్ణయోజనాత్
> అసూయయాచ దేవానాం బహిర్గీత మిదం స్మృతమ్. ४౩
> నిర్గీతం యన్మయా ప్రోక్తం సప్తరూప సమన్వితమ్
> ఉత్థాపనాదికం యచ్చ తస్య కారణముచ్యతే. ४४

భాండవాద్యమున చెప్పబడు గురులఘువులను రంజింపచేయునట్లుగా నాట్యోపరంజకమగు చిత్రవీణెపై వర్ణాలంకారములతో బాటు ప్రయోగించవలెను. ధ్రువాగానమున చెప్పబడు స్థాయ్యాదివర్ణములు, ప్రసన్నాది అలంకారములను ఇచట యోజింపవలెను. అర్థరహితములగు పదవర్ణములతో పాడబడు ఈ నిర్గీతమును రాక్షసులపై అసూయగల దేవతల సంతోషింపజేయుటకు బహిర్గీతమని పిలుచుచున్నారు. ఆశ్రావణాది నిర్గీతము సప్తరూపములు కలిగియున్నది. బహిర్యవనికాంగమగు ఉత్థాపనాదిక మీ నిర్గీతమునకు ప్రయోజనముగా చెప్పబడగలదు.

> ఆశ్రావణాయాం యుక్తాయాం దైత్యాస్తుష్యంతి నిత్యశః
> వక్త్రపాణౌ కృతేచైవ నిత్యం తుష్యంతి దానవాః. ४౫
> పరిఘట్టనయాతుష్టా యుక్తాయాం రక్షసాం గణాః
> సంఘోటనాక్రియాయాంతు తుష్యంత్యపిచ గుహ్యకాః ४౬
> మార్గాసారిత మాసాద్య తుష్టా యక్షా భవంతిహి.

ఆశ్రావణా ప్రయోగమున దైత్యులు, వక్త్రపాణిని ప్రయోగించిన దానవులు పరిఘట్టనను ప్రయోగించిన రాక్షసగణములు, సంఘోటనావ్యాపారమున గుహ్యకులు, మార్గాసారితమున యక్షులు సంతోషించెదరు.

పురాణవర్ణిత విష్ణువెవరు?

విష్ణువు - చతుర్భుజుడు

పండిత, శ్రీ గోపదేవ్

4

పూర్వపులేఖలలో విష్ణుభగవానుని నామము, వాహనము, అతని యునికి మున్నగు విషయములను గూర్చి యొకింత వివరించి యుంటిమి. ఇక ముందు విష్ణుస్వరూపము, విష్ణువు అవతారములు, విష్ణు శబ్దార్థము మున్నగు విషయములను పాఠకులు చదువగలరు.

పురాణములలో పలుతావులందు విష్ణువు చతుర్భుజుడు - నాలుగు భుజములు కలవాడు - అని వర్ణింపబడియుండుట పురాణవిదుల కపరిచితవిషయము కాదు భాగవతమున గల యీ క్రింది శ్లోకములను తిలకింపుడు.

"కిరీటినం కుండలినం చతుర్భుజం
పీతాంబరం వక్షసి లక్షిత శ్రియమ్" 2-9 15

"తమద్భుతం బాలక మంబుజేక్షణం
చతుర్భుజం శంఖగదాద్యుదాయుధమ్
శ్రీవత్సలక్ష్మం గలశోభికౌస్తుభం
పీతాంబరం సాంద్రపయోదసౌభగమ్"
10-3-9

"మేఘశ్యామ శరీరస్తు పీతవాసా
శ్చతుర్భుజః
శేషశాయీ జగన్నాథో వనమాలా
విభూషితః" దే-భా. 3-2-23

ఈ శ్లోకములన్నియు విష్ణువు వర్ణనకు సంబంధించినవే ఇందు ప్రతిశ్లోకమునను 'చతుర్భుజ' పదము ప్రయోగింపబడి యుండుట పాఠకులు గమనింతురుగాక!

ఇట్టి శ్లోకములు పురాణములలో వందలాదిగ జూడనగును. విష్ణువు నాలుగు భుజములు కలిగి యున్నట్లు వర్ణించుట పురాణకవులకే కాక యాధునిక కవులకును పరిపాటియై యున్నది. విష్ణువేకాక విష్ణుపార్షదులుకూడ చతుర్భుజులనియే వర్ణింపబడిరి. అందువలననే దేవాలయములలో చెక్కబడియుండు శిలావిగ్రహములు చతుర్భుజములు కలిగి యుండుట జూచుచున్నాము

"న తత్ర మాయాకిముతా పరే హరే
రనువ్రతా యత్ర సురాసురార్చితాః" 10.

"శ్యామావదాతాః శతపత్రలోచనాః
పిశంగవస్త్రాః సురుచా సుపేశసః
సర్వే చతుర్బాహవ ఉన్మిషన్మణి
ప్రవేక నిష్కాభరణాః సువర్చసః" భా.2-9.

'విష్ణులోకమున మాయకానీ, మాయావులు కానీ లేరు. దేవాసురులచే పూజితులు, నాలుగు బాహువులు కలవారు, సుందర వస్త్రాభరణములను ధరించిన హరిభక్తులే విరాజిల్లుచుందు'రని పై శ్లోకాభిప్రాయము.

పై శ్లోకాభిప్రాయములను గ్రహించిన తదుపరి విష్ణుభగవానునకు నాలుగు బాహువు లున్నట్లు గ్రహింపనగును. కాని, విష్ణువునకు శిరస్సులు కానీ, నేత్రములుకానీ యధికముగ నున్నట్లెక్కడను వర్ణన కనిపింపదు భుజములతోబాటు శిరస్సు మున్నగు నవయవము లేల యధికముగ నున్నట్లేల వర్ణింపబడవయ్యె? ఇందులకు కారణమేమై యుండును?

విష్ణువునకు బాహువులుమాత్ర మధికముగా నున్నట్లు వర్ణించుటకును, ఇతరావయవములు ముఖ్యముగా శిరోనేత్రాదు లధికముగానున్నట్లు వర్ణింపకుండుటకు ముఖ్యకారణము సూర్యస్వరూపమే. పూర్వపు లేఖలలో సూర్యుడే విష్ణువుగా కల్పింపబడినట్లు పాఠకులు చదివియే యున్నారు.

సూర్యుడుదయించునపుడు అతని కిరణరూపములగు భుజములు నలుదిశలలో వ్యాపించుట ఆబాలగోపాలమునకు ప్రత్యక్షమేకదా! కిరణములు - కరణములు - భుజములు-హస్తములు బాహువులు - నను పదములన్నియు పర్యాయపదములే- సమానార్థకములే-యనుట సాహిత్యవిదు లెరుగని విషయముకాదు.

చతుర్భుజుడను పదము సమస్తము అది వ్యస్తముకాదు. (చతస్రుష దిక్షుభుజాయస్యన

చతుర్భుజః)చతుర్దిక్కులందు భుజములు(కిరణములు) ఎవనికి గలవో వాడు చతుర్భుజుడని చతుర్భుజ శబ్దమునకు విగ్రహము చెప్పనగును ఈః విగ్రహమును బట్టి చతుర్భుజుడనగా సూర్యుడని యర్థమగుచున్నది. అట్లు కాక, (చత్వారో భుజా యస్య స చతుర్భుజః) నాలుగు భుజములు ఎవనికి గలవో యతడు చతుర్భుజుడనియు విగ్రహము చెప్పవచ్చును ఇట్లీ చతుర్భుజశబ్దమునకు రెండు తెరగుల విగ్రహ మొనర్చుటలో 'గమనింపదగిన విశేషత యొండుగలదు.

సూర్యుని స్థానమున విష్ణువును కల్పించిన బుద్ధిమంతులు చతుర్భుజ శబ్దమునకు నాలుగు భుజములు కలవాడని యర్థమును జెప్పి విష్ణువు నాలుగు భుజములు కలిగియున్నట్లు వర్ణింప నారంభించిరి సమాసమునగల విలక్షణతనూతగాగొని వారిట్టి కల్పన జేయుటలో సమర్థులైరి ఇంతేకాక భాగవతభారతాదులలో విష్ణువు అష్టభుజుడు (ఎనిమిది భుజములు కలవాడు), దశభుజుడు (పదిభుజములు గలవాడు) నని వర్ణించుటయు నక్కడక్కడ జూడనగును

"కృతపాదః సుపర్ణాంసే, ప్రలంబాష్ట మహాభుజః చక్రశంఖాసి చర్మేషుధనుః పాశ గదాధరః" భా. 6.4-26

'గరుడుని మూపుపై పాదముల నుంచినవాడు,పొడవైన ఎనిమిదిబాహువులు గలవాడు. చక్రశంఖాదులను ధరించినవాడు.'

"మహామణి వ్రాతకిరీటకుండలమ్
ప్రభాపరిక్షిప్త సహస్రకుండలమ్
ప్రలంబచార్వష్ట భుజం ...
శ్రీవత్సలక్ష్మం వనమాలయావృతమ్"
భా 10-89-56

ఈ శ్లోకమునందును పొడవై యందమైన ఎనిమిది భుజములు కలవాడని స్పష్టముగ విష్ణువు వర్ణింపబడుట చూడనగును ఇక మహాభారతమునందును నిట్టివర్ణన చూడుడు.

"పితామహాదపి వరః శాశ్వతః పురుషోహరిః కృష్ణోజాంబూనదాభో వ్యభ్రే సూర్య ఇవోదితః"

"దశబాహుర్మహాతేజో దేవతారి నిషూదనః శ్రీవత్సాంకో హృషీకేశః సర్వదైవత పూజితః" మ. భా. అ ప 147-23

ఈ శ్లోకములందు విష్ణువు పది భుజములు గలవాడుగ వర్ణింపబడినాడు విష్ణువు సూర్యస్థానమున గల్పింపబడుటచేతనే యిట్లు వర్ణింపబడినాడు ఇంతకుమించిన కారణ మొండును కనబడదు.

సంస్కృతసాహిత్యమున దిక్కులు కొన్నియెడల నాలుగనియు, మరికొన్ని యెడల నెనిమిదియనియు. ఇంక కొన్ని తావులందు దశదిశలనియు వర్ణించుట సాహిత్యవిదుల కపరిచితముకాదు సూర్యకిరణము లన్నిదిక్కులలోను వ్యాపించుట సహజము. కిరణములు బాహువులకు పర్యాయపదముగా నిదివరకే సూచించి యున్నాము. కాగా సూర్యుడు విష్ణువుగా కల్పింపబడినందున కిరణములు బాహాస్థానము నాక్రమించి విష్ణువు అష్టభుజుడు దశబాహువు నగుటలో నాశ్చర్యమేమున్నదిః

ఇట్లు సూర్యస్థానమునకల్పింపబడిన విష్ణువు ఒకచో చతుర్భుజుడుగను, మరియొకచో నష్టబాహువుగను, ఇంకొకయెడ దశబాహువుగను విలక్షణ స్వరూపములు కలవాడై పురాణముల నధిష్ఠించి యున్నాడు. ఇట్టి యాలంకారిక వర్ణనలలోగల యథార్థస్వరూపమును గుర్తింపజాలక భారతీయులు కల్పిత విష్ణుదేవుని సృష్టికి కర్తగాను, ధర్తగాను భావించి తమ గృహములలో విష్ణువు ప్రతికృతులంబెట్టి పూజింపనారంభించిరి. అనేక దేవాలయములు నిర్మించియందు చతుర్భుజుడు, అష్టభుజుడు, దశభుజుడునగు విష్ణు విగ్రహములను బ్రతిష్ఠింపజేసి వానిని బూజించుచున్నారు.

కౌతన్త్రవ్యాకరణం
[లఘువృత్తి సహితం]
శతావధానులు. శ్రీ శ్రీనివాస సోదరులు

౧

సంస్కృతం రానందుకు తన రాణిచేత గేలిచేయబడిన మొట్టమొదటి ఆంధ్ర సాతవాహన రాజుకు ఆరునెలల్లో సంస్కృతం నేర్పటంకోసం అమాత్యుడైన సర్వ వర్మ, కార్తికేయప్రసాదంవల్ల సంపాదించిన సులభమైన వ్యాకరణ మిది. తమ పూర్వుడు సంస్కృతాధ్యేతలకు చేసిన ఈ మహోపకారం మరచిపోయిన ఆంధ్రుల కీ కృతిని అంకితం చేస్తున్నాము. ఏ కొద్దిమందయినా దీనివల్ల లాభంపొందితే మా కృషి సఫల మనుకుంటాము.

ప్రథమాధ్యాయము - ప్రథమ పాదము:

౧. సిద్ధో వర్ణసమామ్నాయః

వర్ణసమామ్నాయమంటే వర్ణాల పారక్రమం. అది లోకంలో ప్రసిద్ధమయ్యే వున్నది. దాన్ని వేరేవిధంగా ఉపదేశించ నక్కరలేదు. వాడుకలో వున్న వర్ణమాల యిది: అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ అం అః క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ.

౨. తత్ర చతుర్దశాదౌ స్వరాః.

అందులో (వర్ణసమామ్నాయంలో) మొదటి పద్నాలుగూ స్వరాలు. అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ.

౩. దశ సమానాః.

స్వరాలలో మొదటి పదింటికి సమానా అని పేరు. అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ

౪. తేషాం ద్వౌద్వౌ అన్యోన్యస్య సవర్ణౌ.

సమానాల్లో రెండేసి వర్ణాలు ఒకదాని కొకటి సవర్ణాలు. 'అ' కు 'ఆ', 'ఆ' కు 'అ', 'అ' కు 'అ'; 'ఆ' కు 'ఆ' సవర్ణాలు. ఇలాగే 'ఇఈ' మొదలైనవాటి విషయంలోనూ గ్రహించవచ్చు.

౫. పూర్వో హ్రస్వః

సమానాక్షరాలు ఐదుజంటలలోనూ ప్రతిజంటలోనూ మొదటిఅక్షరం హ్రస్వం. 'అ' హ్రస్వం. అలాగే ఇ, ఉ, ఋ, ఌ హ్రస్వాలు.

౬. పరో దీర్ఘః.

సమానాల జంటలలో ప్రతిదానిలోనూ రెండో అక్షరం దీర్ఘం. ఆ ఈ ఊ ౠ ౡ దీర్ఘాలు.

౭. స్వరోఽవర్ణవర్జో నామీ.

అవర్ణంకాని యితరస్వరానికి నామి అని పేరు. ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ. నాములు.

౮. ఏకారాదీని సంధ్యక్షరాణి.

ఏ ఐ ఓ ఔలకు సంధ్యక్షరా లని పేరు.

౯. కాదీని వ్యంజనాని.

'క' మొదలు 'హ' వరకూ వున్న వర్ణాలు వ్యంజనాలు. క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ. వీటిలో అకారం ఉచ్చారణసౌకర్యంకోసం చేర్చబడింది. అసలు వ్యంజనాలు- క్ ఖ్ గ్ ఘ్ ఙ్ మొ.

౧౦. తే వర్గాః పంచపంచ పంచ.

'క' నుండి 'మ' వరకు వున్న వర్ణాలు ఐదేసి కలసి ఒకవర్గమై, ఐదువర్గాలుగా వున్నాయి. కఖగఘఙ, చఛజఝఞ, టఠడఢణ, తథదధన; పఫబభమ.

౧౧. వర్గాణాం ప్రథమద్వితీయాః.

శషసా శ్చాఘోషాః.

ప్రతివర్గంలోనూ మొదటి రెండు వర్ణాలూ శ ష స లూ అఘోషాలు. క ఖ చ ఛ ట ఠ త థ ప ఫ, శ ష స.

౧౨. ఘోషవంతో౽న్యే.

తక్కిన వ్యంజనాలు ఘోషవత్తులు. గ ఘ ఙ జ ఝ ఞ డ ఢ ణ ద ధ న బ భ మ య ర ల వ హ

౧౩. అనునాసికా ఙఞణనమాః

ఙ ఞ ణ న మ- అనునాసికాలు.

౧౪. అన్తస్థా యరలవాః.

యరలవ- అంతస్థాలు.

౧౫. ఉష్మాణః శషసహాః.

శ ష స హ- ఉష్మాలు.

౧౬. అః ఇతి విసర్జనీయః.

అః అనేచోట అకారం ఉచ్చారణసౌకర్యంకోసం చేర్చబడి[illegible]. దానితరువాత వున్న రెండు బిందువులకు విసర్జనీయ మని పేరు.

౧౭ ✕క ఇతి జిహ్వామూలీయః.

ఇక్కడ 'క' ఉచ్చారణసౌకర్యంకోసం చేర్చబడింది, ✕ - ఈగుర్తు క ఖ ల ముందు వచ్చే విసర్జనీయానికి వేరే రూపం. దీనికి జిహ్వామూలీయ మని పేరు.

౧౮. ౘప ఇత్యుపధ్మానీయః.

ఇక్కడ 'ప' ఉచ్చారణసౌకర్యంకోసం చే[illegible]బడింది ౘ - ఈగుర్తు ప ఫ ల ముందువుండే విసర్జనీయానికి వేరేరూపం. దీనికి ఉపధ్మానీయ మని పేరు.

౧౯. అం ఇత్యనుస్వారః

ఇక్కడ 'అ' ఉచ్చారణకోసం చేర్చబడింది. దానితరువాత వున్న బిందువుకు అనుస్వార మని పేరు.

౨౦. పూర్వపరయో రర్థోపలబ్ధౌ పదమ్.

పూర్వాంశమూ పరాంశమూ కలసి అర్థమిచ్చినప్పుడుపదం ఏర్పడుతుంది. పూర్వాంశమంటే ప్రకృతి- మూలశబ్దం. పరాంశమంటే విభక్తిప్రత్యయం. 'రామ' ప్రకృతి. దీనికి 'ఇన' అనేవిభక్తిప్రత్యయం చేరితే 'రామేణ' అని రామునిచేత అని అర్థమిచ్చే పదం ఏర్పడుతున్నది. ఆలాగే'అద్' అనే ప్రకృతికి 'తి' అనే విభక్తిప్రత్యయంచేరి 'అత్తి'అని 'తినుచున్నాడు' అని అర్థమిచ్చే పదంఏర్పడుతున్నది.

౨౧ వ్యంజన మస్వరం పరం వర్ణం నయేత్.

స్వరంలేని వ్యంజనం తరువాతవర్ణంతో కలుస్తుంది. 'తద్,గచ్ఛతి' అన్నచోట స్వరంలేని 'ద్' అనే వర్ణం తరువాత వున్న 'గ' తో కలిసిపోయి 'ద్గ' అయి 'తద్గచ్ఛతి' అని వ్రాయబడుతుంది.

౨౨. అనతిక్రమయన్ విశ్లేషయేత్.

కలిసివున్న వర్ణాలను వరసతప్పకుండా విడదియ్యాలి. 'కార్త్స్న్యము' అన్న పదంలో 'ర్త్స్న్య' ను 'ర్ త్ స్ న్ య్అ' అని క్రమం తప్పకుండా విడదియ్యాలి.

౨౩. లోకోపచారా ద్గ్రహణసిద్ధిః.

లోకోపచారం అంటే లోకవ్యవహారం. ప్రయోగవిజ్ఞానం లోకవ్యవహారంనుండి గ్రహించబడుతుంది. అయితే వైదికశబ్దాలు మాత్రం బహుశ్రుతులయిన పెద్దల ఉపదేశాన్నుంచి యథాతథంగా గ్రహించాలి

ఇతి కాతన్త్రవ్యాకరణే

ప్రథమస్యాధ్యాయస్య ప్రథమః పాదః.

అనుబంధం

వర్ణోత్పత్తిస్థానాలు

అ, ఆ, కవర్గం, హ, ః—కంఠం.

ఇ, ఈ, చవర్గం, య, శ—తాలువులు (దౌడలు)

ఋ, ౠ, టవర్గం, ర, ష—మూర్ధం (శిరస్సు)

ఌ, ౡ, తవర్గం, ల, స—దంతాలు.

ఉ, ఊ, పవర్గం, ఉప-ఓష్ఠాలు (పెదవులు)

ఏ, ఐ—కంఠతాలువు.

ఓ, ఔ—కంఠోష్ఠం.

వ—దంతోష్ఠం

ం—నాసిక (ముక్కు)

ఙ ఞ ణ న మ—వానివాని స్థానాలే కాక నాసిక కూడా.

ఇది శ్రీ శ్రీనివాససోదరకృతమైన కాతన్త్ర వ్యాకరణ లఘువృత్తిలో ప్రథమాధ్యాయంలో ప్రథమపాదం

ప్రథమాధ్యాయము — ద్వితీయ పాదము

౧. సమానః సవర్ణే దీర్ఘీభవతి, పరశ్చ లోపమ్.

సవర్ణం పరమైనప్పుడు సమానస్వరం దీర్ఘమవుతుంది. పరమైన స్వరం లోపిస్తుంది హ్రస్వమైన స్వరం దీర్ఘమవుతుంది దీర్ఘమైన స్వరానికి మార్పేమీ రాదని గ్రహించాలి. దండ + అగ్రమ్- దండాగ్రమ్. సా + అస్తి - సాస్తి. అత్ర + ఆగతః - అత్రాగతః సా + ఆగతా - సాగతా. ఇలాగే- దధి + ఇదమ్ - దధీదమ్ నదీ + ఇహ - నదీహ. మధు + ఉదకమ్ - మధూదకమ్. వధూ + ఊహః - వధూహః. పితృ + ఋషభః - పితౄషభః. కౢ + ఌకారః - కౣకారః.

౨. అవర్ణ ఇవర్ణే ఏ.

ఏదైనా స్వరాన్ని వర్ణశబ్దంతో కలిపి చెప్పినప్పుడు దాన్ని, దాని సవర్ణాన్ని కూడా గ్రహించాలి. కారశబ్దంతోగాని తకారంతోగాని కలిపి చెబితే ఆ చెప్పిన స్వరం మాత్రమే గ్రహించాలి. 'అ' వర్ణమందే 'అఆ' లను గ్రహించాలి. అకారమన్నా అత్ అన్నా 'అ' ను మాత్రమే గ్రహించాలి. ఇలాగే అంతటానూ. 'ఇఈ' లు పరమైనప్పుడు 'అఆ' లు 'ఏ' గా మారుతాయి,* పరవర్ణం లోపిస్తుంది. తవ + ఇదమ్ - తవేదమ్. మమ + ఈహా - మహేహా సా + ఇయమ్ - సేయమ్ రాజా + ఈడ్యః - రాజేడ్యః

౩ ఉవర్ణే ఓ.

'ఉఊ' లు పరమైనప్పుడు 'అఆ' లు ఓ గా మారుతాయి; పరవర్ణం లోపిస్తుంది. అత్ర + ఉపస్థితః - అత్రోపస్థితః. తవ + ఊహనమ్ — తవోహనమ్. సా + ఉన్నతా - సోన్నతా. రాజా + ఊర్జితః - రాజోర్జితః.

౪. ఋవర్ణే అర్.

'ఋౠ' లు పరమైనప్పుడు 'అఆ' లు 'అర్' గా మారుతాయి, పరవర్ణం లోపిస్తుంది. అత్ర + ఋషిః - అత్రర్షిః. మహా + ఋతుః మహర్త్షః ఇహ + ౠకారః - ఇహార్కారః ఏషా + ౠకారేణ - ఏషర్కారేణ.

౫. ఌవర్ణే అల్

'ఌౡ' లు పరమైనప్పుడు 'అఆ' లు 'అల్' గా మారుతాయి, పరవర్ణం లోపిస్తుంది తవ + ఌకారః - తవల్కారః. సా + ఌకారేణ - సల్కారేణ. అత్ర + ౡకారః - అత్రల్కారః. ఏషా + ౡకారేణ - ఏషల్కారేణ.

---

* 'అఆ'లు 'ఏ గా మారుతాయి అంటే 'అఆ' లకు బదులు 'ఏ' వస్తుందన్నమాట. ఇలాగే అంతటా గ్రహించాలి.

౬. ఏకారే ఐ, ఐకారే చ.

'ఏ,ఐ' లు పరమైనప్పుడు 'అఆ' లు 'ఐ' గా మారుతాయి, పరవర్ణం లోపిస్తుంది. తవ + ఏషా - తవైషా. ఇహ + ఐన్ద్రీ - ఇహైన్ద్రీ. గఙ్గా + ఏషా - గఙ్గైషా. లబ్ధా + ఐశ్వర్యేణ - లబ్ధైశ్వర్యేణ.

౭. ఓకారే ఔ, ఔకారే చ.

'ఓఔ' లు పరమైనప్పుడు 'అఆ' లు 'ఔ' గా మారుతాయి, పరవర్ణం లోపిస్తుంది తవ + ఓదనమ్ - తవౌదనమ్. తస్య + ఔరసః - తస్యౌరసః. సా + ఓష్ఠేన - సౌష్ఠేన. గఙ్గా + ఔత్కృష్ట్యమ్ - గఙ్గౌత్కృష్ట్యమ్

౮. ఇవర్ణో య మసవర్ణే, నచ పరో లోప్యః

సవర్ణంకాని స్వరం పరమైనప్పుడు 'ఇ ఈ' లు 'య' కారంగా మారుతాయి, పరవర్ణం లోపించదు. దధి + అత్ర – దధ్యత్ర నదీ + ఏషా - నద్యేషా.

౯ వ మువర్ణః.

సవర్ణంకాని స్వరం పరమైనప్పుడు 'ఉఊ' లు 'వ' కారంగా మారుతాయి, పరవర్ణం లోపించదు. మధు + అత్ర - మధ్వత్ర. వధూ + ఆసనమ్ - వధ్వాసనమ్.

౧౦. ర మృవర్ణః.

సవర్ణంకాని స్వరం పరమైనప్పుడు 'ఋ ౠ' లు రేఫం (రకారం) గా మారుతాయి పరవర్ణం లోపించదు. కర్తృ + అస్తి – కర్త్రస్తి. పితృ+ఆజ్ఞా - పిత్రాజ్ఞా, కౄ + అర్థః - క్రర్థః.

౧౧. ల మ్లువర్ణః

సవర్ణంకాని స్వరం పరమైనపుడు 'ఌౡ' లు 'ల' కారంగా మారుతాయి, పరవర్ణం లోపించదు. ఌ + అనుబంధః - లనుబంధః ౡ + ఆకృతిః - లాకృతిః.

౧౨. ఏ అయ్.

స్వరం పరమైనప్పుడు 'ఏ' కారం అయ్ గా మారుతుంది. పరవర్ణం లోపించదు. తే + ఆగతాః - తయాగతాః.

౧౩. ఐ ఆయ్.

స్వరం పరమైనప్పుడు 'ఐ'కారం 'ఆయ్' గా మారుతుంది.పరవర్ణం లోపించదు. తస్మై + ఉక్తమ్ - తస్మాయుక్తమ్.

౧౪. ఓ అవ్

స్వరం పరమైనప్పుడు 'ఓ' కారం 'అవ్' గా మారుతుంది. పరవర్ణం లోపించదు. వటో + ఏహి - వటవేహి.

౧౫. ఔ ఆవ్.

స్వరం పరమైనప్పుడు 'ఔ' కారం 'ఆవ్' గా మారుతుంది. పరవర్ణం లోపించదు గతౌ + ఇతి - గతావితి.

౧౬ అయాదీనామ్ య-వ-లోపః

పదాన్తే నవా, లోపే తు ప్రకృతిః.

పదాంతమందున్న 'ఏఐఓఔ' లకు బదులుగా వచ్చిన 'అయ్, ఆయ్, అవ్, ఆవ్' ల యకారమూ వకారమూ లోపించవచ్చు, లోపించకపోవచ్చు. లోపించినప్పుడు మళ్ళా పూర్వపరస్వరాలనుబట్టివేరే మార్పు రాదు తే + ఆగతాః – త ఆగతా, తయాగతాః 'త + ఆగతాః' అన్నచోట మరల 'తాగతాః' అనే రూపం రాదు ఇలాగే ఇతరత్ర కూడాను. తస్మై + అవోచత్ - తస్మా అవోచత్, తస్మాయవోచ్త్. వటో + ఏహి - వట ఏహి, వటవేహి. తౌ + ఆయాతౌ - తా ఆయాతౌ। తావాయాతౌ ఈ లోపవిధి పదాంతంలో వున్నవాటికి మాత్రమే వర్తిస్తుంది పదమధ్యంలో వున్నవాటికి వర్తించదన్నమాట. నే + అనమ్ - నయనమ్. నై + అకః - నాయకః భో + అతి - భవతి గౌ + ఔ - గావౌ. అంతేగాని 'నఅనమ్, నాఅకః' ఇత్యాది రూపాలు రావు.

౧౭. ఏదోత్పరః౦ పదాన్తే లోప మకారః.

పదాంతమందున్న 'ఏ, ఓ' లకు పరమైన 'అ' కారం లోపిస్తుంది. తే + అవదన్

తేవదః. వటో + అత్ర - వటోత్ర అంటే పదాంతమందున్న 'ఏఓ' లకు 'అ' కారం పరమైనప్పుడు పై ౧౨, ౧౪ సూత్రాలు వర్తించ వన్నమాట. అందువల్ల తే + అవదన్ అన్నప్పుడు 'తయవదన్' అనీ, 'వటో + అత్ర' అన్నప్పుడు 'వటవత్ర' అనీ రూపాలు రావు ఈ సూత్రం లో "పదాంతమందున్న అనటంచేత పదమధ్యంలో వున్న 'ఏ, ఓ' లకు 'అ' కారం పరమైనప్పుడు ఈ సూత్రం వర్తించదు. 'నే + అనమ్' అన్నప్పుడు 'నేనమ్' అనిగాని, 'భో + అతి' అన్నప్పుడు 'భోతి' అనిగాని రూపాలు ఏర్పడ వన్నమాట. 'నయనమ్, భవతిః అనే రూపాలే ఏర్పడుతాయి. ఈ సూత్రం ప్రకారం లోపించిన అకారానికి బదులు ఽ - ఈ గుర్తు వ్రాస్తారు. దీనికి అవగ్రహమని పేరు అవగ్రహ మున్నచోట అకారం లోపించిందని తెలుస్తుంది తే + అత్ర - తేఽత్ర. విష్ణో + అవ - విష్ణోఽవ.

౧౮ న వ్యంజనే స్వరాః సంధేయాః

స్వరాలకు వ్యంజనాలు పరమైనప్పుడు ఏమీ మార్పురాదు. అంటే పైని చెప్పిన సూత్రాలన్నీ స్వరాలకు స్వరాలు పరమైనప్పుడే అమలులోకి వస్తాయన్నమాట ఈ సంగతి పైసూత్రాలవల్లనే తెలుస్తున్నా స్పష్టతకోసం ఈ సూత్రం చెప్పబడింది దీనివల్ల 'అత్ర + కార్యం' అన్నచోట 'అ' కారానికి స్థానసామ్యంచేత 'క' కారం సవర్ణం గనుక ఈపాదంలోని మొదటిసూత్రంవల్ల 'అత్రాకార్యమ్' అనే రూపం వస్తుందేమో అనే మాదిరి శంకలకు తావుండదు.

ఇతి కాతన్త్రవ్యాకరణే ప్రథమస్యాధ్యాయస్య ద్వితీయః పాదః.

ఇది శ్రీశ్రీనివాససోదరకృత లఘువృత్తిసహితమైన కాతన్త్రవ్యాకరణం లో ప్రథమాధ్యాయంలో ద్వితీయపాదం.

ప్రథమాధ్యాయము - తృతీయపాదము

౧. ఓదంతా అ ఇ ఉ ఆ నిపాతాః స్వరే ప్రకృత్యా.

ఓకారాంతాలయిన నిపాతాలూ 'అ, ఇ, ఉ, ఆ' అనే నిపాతాలూ స్వరం పరమైనప్పుడు మార్పుచెందకుండా ఉంటాయి. అహో, అథో, నో ఇత్యాదులు ఓకారాంత నిపాతాలు అహో + ఆశ్చర్యమ్ - అహో ఆశ్చర్యమ్ అథో + ఏవమ్ - అథో ఏవమ్. నో + అత్ర - నో అత్ర అ + అపేహి - - అ అపేహి. ఇ + ఇంద్ర - ఇ ఇంద్ర ఉ + ఉత్తిష్ఠ - ఉ ఉత్తిష్ఠ ఆ + ఏవఖలు - ఆ ఏవంఖలు.

౨. ద్వివచన మనౌ.

ఔకారాంతంకాని ద్వివచన రూపానికి స్వరం పరమైనప్పుడు ఏమీ మార్పురాదు. అగ్నీ + ఏతౌ - అగ్నీ ఏతౌ. వటూ + ఇమౌ - వటూ ఇమౌ. శాలే + ఏతే - శాలే ఏతే

౩. బహువచన మమీ

బహువచనమైన 'అమీ' అనే పదం చివరి స్వరానికి స్వరం పరమైనప్పుడు ఏమీ మార్పు రాదు. అమీ + అశ్వాః - అమీ అశ్వాః.

౪. అనుపదిష్టాశ్చ.

వర్ణసమామ్నాయంలో 'అఆ' అని యీ మాదిరి హ్రస్వదీర్ఘాలుమాత్రమే ఉపదేశించబడినవి లోకంలో దూరానున్నవాళ్ళను పిలిచేటప్పుడూ పాడేటప్పుడూ ఏడ్చేటప్పుడూ ఇటువంటి సందర్భాలలో స్వరాలు దీర్ఘాలకంటే పొడుగ్గా ఉచ్చరించబడుతూంటాయి. వాటికి ప్లుతాలని పేరు లోకప్రసిద్ధం. అటువంటి ప్లుతస్వరానికి స్వరం పరమైనప్పుడున్నా ఏమీ మార్పు రాదు దేవదత్త౩ + అత్ర + ఆగచ్ఛ - దేవదత్త అత్రాగచ్ఛ ఇక్కడ మూడంకె ప్లుతానికి గుర్తుగా వాడుతారు.

ఇతి కాతన్త్రవ్యాకరణే ప్రథమ స్యాధ్యాయస్య తృతీయః పాదః.

ఇది శ్రీనివాససోదరకృత లఘువృత్తి సహితమైన కాతన్త్రవ్యాకరణంలో ప్రథమాధ్యాయంలో తృతీయపాదం.

పంచవటి

శ్రీ కే. వేం. నృ. అప్పారావు

౩

ఇరుదరులన్ మహీజ తతి నింపులు గుల్కుచు నేత్రపర్వమౌ
విరిగమి స్వచ్ఛనీరముల బింబితమౌటను జిత్రవస్త్రయై
సరసిజ పాణియున్ సలిలసక్త గజావళి సేవ్యమానయౌ
సరిత చెలంగె నెంతయు వసంతమునన్ గమలాలయాకృతిన్.

గ్రీష్మంబందు ననేక వేణికయు శుష్కీభూతయే యయ్యెరో
చిష్మ్రత్త్వంబును గోలుపోక స్థిరయై చిన్ముద్రతో లోచనా
ర్చిష్మచ్ఛస్త్రిని యర్ధదేహమున వే చేరన్ స్వదేహార్ధమున్
భీష్మంబైన తపోఽగ్ని వేల్చు గిరిజా నీలాలకన్ బోలెఁదాన్.

అలరుల్ వేణి ధరించి యామునిని నొయ్యారంపుఁ బూఁబోడిగా
జలపూరంబు తటంబు లందొరయు వర్షావేళఁ జూలాలుగా
సలిలంబింకఁగఁ దోఁచు ద్వీపళిశుకోత్సంగాప్తి బాలెంతగాఁ
దలఁపుల్ రేపె మహీజకున్ హృదిసి నుత్కంఠాంకురం బంటఁగన్.

అమలిన భక్తి చిత్తమున హత్తఁగఁ గార్తికమాసమందు ని
త్యము మహిజాతపత్రపుటికావళినింగుదితైలదీపముల్
సమతనమర్చి తజ్జలములన్ విడువన్ నిసివేళ గౌతమీ
సుమహితగాత్రి మించెనహో! చుక్కలహారము దాల్చు స్వర్ణదిన్.

ఘనవిజనాటవిన్ జనకు గాదిలిపట్టియు నాడుతోడు తే
క నవయుచున్ సమీపగత గౌతమినే చెలిగా వరించెఁదాఁ
జనవున నన్నదీమణియు సమ్మతి సేయఁగఁబోలు నెయ్యమున్
గననగు నిత్యమిర్వురి ముఖాముఖి మౌనవచః ప్రసంగముల్.

తెలినీటన్ బసుపాడఁగా జనకపుత్రీ రత్నమయ్యేటిలో
గళదఘ్నంబుగ డిగ్గి యచ్చటు వివిక్తంబయ్యె లజ్జాళుతన్
నిలువన్ బ్రేమతొలంకు నన్నదియుఁ దన్నీరేజ వద్గాత్రమున్
లలితంబైన తరంగ హస్తములచే రాపాడి పూతంబగున్.

స్నానమొనర్చి యంబుకలశంబును నించి మహీజ యెన్నడున్
దానివి చేసియుండని కతంబున నెత్తఁగలేక తొట్రిలన్
బూనిక నాత్మతోయములఁ బూర్ణఘటంబె లఘుత్వమొందు న
ట్లూని, యొసంగు నత్తటిని యుర్విజకెప్డుఁ గరావలంబమున్.

అతత నిత్యకృత్యముల వ్యాపకతన్ బవల్లెల్లఁగ్లాంతయై
రాతిరి శయ్యఁజేరి రఘురాముఁడు రమ్యభుజోపధానమున్
ప్రీతినమర్ప నిద్రఁగను పృథ్విజకానది పుల్లహల్లక
స్ఫీత సుగంధపూర్ణ మృదుశీతలవాయువు లంపుసేవకై.

వేకువ వేళలందు నరవిచ్చిన తామరపూల గంధముల్
సోకిన వాతపోతముల క్షోణిజ పర్ణ గృహంబులోనికిన్
ప్రాకఁగఁజేసి యత్తటిని రాముని మెల్లగ మేలుకొల్పుఁడాన్
స్తోకమె యయ్యు స్నేహమది తోయమునందిడ విస్తరిల్లదే!

అనితర లభ్యమౌనటుల నచ్చపుఁ బ్రేముడినించు గౌతమిన్
గని జనకాత్మజాత కుతుకంబుమనంబున నిండఁగాంతుతో
నను నిటు "నాథ! మైత్రియను నంబువులన్ దలమున్క కానటుల్
పొనరుచు నీసరిత్తు దొలిపుట్టువు చుట్టమటంచు నెంచెదన్".

అరుణ

శ్రీ అమరేంద్ర

1

ఆరిపోయింది. తప తప కొట్టుకుంటున్న దీపపువెలుగు చీకటిలో కలిసిపోయింది చీకటి. అంతటా చీకటి. కన్ను పొడుచుకున్నా తెన్ను కనరాని కారుచీకటి.

దిక్కులేని దయిపోయింది అరుణ. అభాగిని అరుణ. ఇక అరుణ ఈ లోకంలో ఏకాకి. తల్లిలేదు, తండ్రిలేడు, అన్నలులేరు, తమ్ములు లేరు. అత్తవారివైపునా ఎవరూలేరు. ఇక తనకెవరు దిక్కు? ఇక తనేవిధంగా బతకాలి? ఇక తనకి బతుకులో ఏమి ఆనందం వుంది. ఏ ఆశతో తానికజీవితంలో ముందడుగు వేయాలి?

ఆమెభర్త ఎంతోకాలం నుంచీ క్షయవ్యాధి గుప్పెట్లో గిలగిల తన్నుకుని ఈ మధ్యనే ప్రాణం విడిచాడు అసహాయస్థితిలో అరుణని అనాధని చేసిపోతున్నాననే బాధతో అతని ప్రాణం ఎంత క్షోభపడి వుంటుందో అంతర్యామికే తెలియాలి. అరుణ చేతులు తన గుండెల మీద వేసుకుని మూసుకుపోతున్న కనురెప్పలను పైకెత్తి జాలిగాచూస్తూ ఏదోచెప్పబోయి మాట పెగిలిరాక "అరుణా" అంటూ ప్రాణం విడిచాడు.

క్షయరోగి తాను చనిపోవటమే కాక బతికి వున్నవాళ్ళని కూడా సగం చంపి మరీ పోతాడట! భర్తకి నిద్రాహారాలు లేకుండా సేవ చేయటం వల్ల అరుణ ఎంతో కృశించి పోయింది. భర్త వైద్యంకోసం తన నగలన్నీ అమ్మివేసింది. భర్త పోయేనాటికి ఆమె మెళ్ళో మంగళసూత్రం కూడా అమ్మివేయ వలసి వచ్చింది.

ఇక తనకెవరు అండ? అరుణకి బతుకంతా దారుణమైన కారడవిగా కనబడింది. దరీ తెన్నూలేని విషాదంతో అరుణ తల్లడిల్లింది. ఇరుగు పొరుగువారి సానుభూతితో కొన్నాళ్ల గడిచింది. ఇకముందు గడవటమెల్లాగో తెలియక అరుణ కరుణలేనివిధి గుండెని కన్నీటితో కరిగించాలనుకున్నది.

ఇంతలో ఒకనాడు తెల్లవారేసరికీ అరుణ గుడిసె వాకిటముందు ఎవరిదో బండివచ్చి ఆగింది. దిక్కులేని తన వాకిటిముందు దిగి తలుపు తట్టింది ఎవరా అని అరుణ ఆశ్చర్య పోయింది. ఆ వచ్చిన వ్యక్తిని ఎంతోసేపటి దాకా పోల్చుకోలేక బెదురుచూపులు చూస్తూ నిలబడిపోయింది. "ఎంతకష్టం వచ్చిందే చెల్లీ" అని ఆ వచ్చిన వ్యక్తి అరుణని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. ఆ కంఠస్వరం వినేసరికీ అరుణకి తన శైశవ కాలంనాటి స్మృతులెన్నో తలపుకు వచ్చినయ్ "అక్కా ఎన్నాళ్ళకి కనబడ్డావే" అని ఆ వచ్చిన వ్యక్తిని గట్టిగా కౌగిలించుకుని ఒక్కశోకం పెట్టింది అరుణ.

అరుణకి వచ్చిన ఆపదలువిని జాలిపుట్టింది దుర్గకి దుర్గా అరుణా చిన్నప్పుడు ఒకఊళ్ళోనే పుట్టి పెరిగారు. ఒకే బళ్ళో చదువుకున్నారు. అంతేకాకుండా వారిద్దరూ (కొంచెం దూరపు బంధువులు. చిన్నప్పుడు అరుణ దుర్గని అక్కా అని పిలిచేది) అన్నదమ్ముల బిడ్డలు

చిన్నవయసులోనే అరుణకీ దుర్గకీ పెళ్ళిళ్ళయిపోయినయ్. అత్తవారిళ్లకి వెళ్ళారు. అప్పటినుంచీ ఒకళ్ళనొకళ్ళు చూచుకోలేదు. ఉత్తరాలుకూడా రాసుకోలేదు అరుణ అత్తవారు ఎంత బీదవారో దుర్గ అత్తవారు అంత ధనవంతులు. కాని జీవితంలో ఇద్దరూకష్టాన్నే అనుభవించారు. ఇద్దరి జీవితాలలోనూ సుఖం చేరలేని ఎండమావిగానే కనిపించింది.

ఆనాడంతా దుర్గా అరుణా ఒకళ్ళ కష్టసుఖాలొకరితో చెప్పుకుంటూ క్షణంలాగా గడిపి వేశారు. మరిచిపోయిన శైశవ దినాలు మరలి వచ్చినట్లనిపించింది.

అరుణని తనీతో రమ్మని దుర్గ ఎంతో బతిమాలుకున్నది. తన ఇంట్లో వచ్చి తనతోపాటు

ఉండమని ఎంతో నచ్చజెప్పింది. "ఈ నిర్భాగ్యురాలిని నీ ఇంటికెందుకు ఆహ్వానిస్తావే అక్కా-" అని అరుణ కన్నీళ్ళతో అన్నది. "ఈ దీనురాలి భారమంతా నువ్వు వహిస్తావా?" అని ఎంతో జాలిగొలిపేట్లు అడిగింది. ఏస్తానసేదాకా దుర్గ వదలిపెట్టలేదు. చేతులో చెయ్యివేయించుకుంది. "ఈఅభాగ్యురాలిని ఇంత ఆప్యాయంగా రమ్మనేవా రింకెవరున్నారే అక్కా-"అని అరుణ దుర్గ ఒడిలో తలవాల్చి వలవలఏడ్చింది. దుర్గ తన చీరకొంగుతో అరుణ కన్నీళ్లు తుడిచి "తెల్లారిపొద్దున్నే ప్రయాణం" అంది. అరుణ సరేనని తల తిప్పింది.

2

ఆ ఇంట్లో అడుగుపెట్టిన క్షణమే పిన్నీ అంటూ దుర్గ పిల్లలంతావచ్చి చుట్టేసుకున్నారు. ఆ క్షణంలోనే అరుణకి తాను జీవితంలో ఒక కొత్తరంగంలో అడుగుపెడుతున్నట్లు తోచింది. ఇకముందు లోకనాటకంలో తానొక కొత్త పాత్రను ధరించబోతున్నట్లు గ్రహించింది

ఆ మధ్యాహ్నం దుర్గ తన గదిలో నిద్ర పోతోంది. అరుణ సావిట్లోకూచొని పిల్లల తాటాకు బొమ్మలకి పరికిణీ చొక్కా-లు సింగారిస్తూ వాళ్ళ ఆటపాటల్లో కలిసిపోతోంది. తను జీవితంలో అనుభవించిన దుఃఖమంతా క్షణంసేపు మటుమాయమైపోయి తన చిన్ననాటి అమాయకమైన ఆనందమూ సౌఖ్యమూ స్ఫురణకు వచ్చినవి. ఆ స్మృతిలో అరుణ పరవశమైపోతున్న తరుణంలో ప్రశాంతమైన కంఠస్వరంతో "అరుణా" అని పిలుపు వినబడింది. అరుణ చరాలునలేచి నిలబడింది. పరిచయంలేని ఆ వ్యక్తి పలకరింపుకు సిగ్గుతో తలవంచుకుంది. ఆ వ్యక్తి మళ్ళీ "అరుణా ఈ ఇల్లు నీ ఇల్లే అనుకోవాలి. ఈ పిల్లలు నీ పిల్లలే అనుకోవాలి మా ఇంట్లో నువ్వు మాఅందరిలో ఒకతెవై పోయి మాతోపాటుగా వుండాలి" అన్నాడు. అరుణ సిగ్గుని పారదోలుతూ ఆ వ్యక్తికేసి చూసింది. అతని ముఖంలో వయసుకి మించిన ముసలితనం గోచరిస్తోంది అతని తల ఎన్నోకష్టాలు మోసి నెరిసిపోయింది. అతని రూపమంతా ఏదో మోయలేని బరువుతో కృంగిపోతున్నట్లుంది. చూచీ చూడటంతోనే అతనిమీద ఎందుకో చెప్పలేని జాలి తెలియని సానుభూతి కలిగి అరుణ మనసు కరిగిపోయింది. మౌనంగా ఇద్దరూ నిలబడ్డారు. ఆడుకుంటున్న లలిత పరిగెత్తుకొచ్చి "నాన్నా! పిన్ని చాలా మంచిది నాన్నా! చక్క-టి బొమ్మలు చేసిపెడుతుంది నాన్నా!" అంటూ అరుణచేతికి బొమ్మలు చేసిపెట్టమని ఇంకొన్ని పచ్చి తాటాకులు అందించింది. ఇంకోవైపు నుంచి కృష్ణుడు పరిగెత్తుకొచ్చి "పిన్నీ! మరే నాకు బొంగరం చేసిపెట్టవూ? నాన్నా పిన్ని బొంగరం ఎంత బాగా చేస్తుందో తెలుసూ? భలే గుక్క-పట్టి గిర్రున తిరుగుతుంది" అంటూ అరుణకి చెఱువులోంచి తెచ్చిన తడిమట్టి ముద్దలు అందించాడు వచ్చి వారంరోజులయినా కాలేదు అప్పుడే తన పిల్లలు అరుణచుట్టూ ఎల్లా అల్లుకుపోతున్నారో చూసేసరికీ రామారావుకి ఆశ్చర్యంవేసింది. తల్లిదగ్గరలేని చనువు పిన్నిదగ్గర పిల్లలు సంపాదించటం చూసి చకితుడై పోయాడు. "అరుణా నువ్వు మాఇంట్లో అడుగుపెట్టిన క్షణమే-" అని వాక్యం ముగించకమునుపే దుర్గ నిద్రలేచి వచ్చింది. "వెధవ పిల్లలు ఒకటే కాకిగోల, క్షణంసేపు కన్ను మలగనీయరు. పోండి ఇంట్లోంచి. పీడ విరగడ అవుతుంది. వెధవ అల్లరీ మీరూను" అని అరుస్తూవచ్చింది. తల్లి కంఠం వినబడగానే పిల్లలు బెదరిపోయి అక్క-డినుంచి పరిగెత్తారు. "పిల్లలు ఆమాత్రం అల్లరిచెయ్యరా?" అన్నాడు రామారావు. దుర్గ మండిపడి" కోపం చెయ్యటానికి బదులు వాళ్ళని వెనక వేసుకువస్తున్నారా? ఎక్క-డా చూడలేదు బాబూ ఇల్లాటి తండ్రిని. వాళ్ళవిషయం మనసుకే పట్టించుకోరు. వాళ్ళు అల్లరికోతులైపోతే మీకేం, ఎందుకూ కొరగాక అడుక్కు-తింటే మీకేం? మీ పుస్తకాలూ, మీ కథలూ, మీ చుట్టలూ ఇవేకాని మీకింకో గొడవ మనసుకి పడుతుందీ? అన్నిటికీ నిమ్మకి నీరెత్తినట్లు కూచోటంలో మీ

తరవాతనే. ఇంతకీ ఏమిటి మీరనేది? నాపిల్లల్ని నేను సరయిన దోవలో పెట్టుకోటానికి వీల్లేదా? మీలాగే నేనూ వాళ్లని గాలికి వదిలేస్తే ఏమయి పోతారు? అంత ఇంటి విషయాలు మనసుకి పట్టించుకోనివాళ్ళకి సంసారమెందుకే అరుణా? హాయిగా ఏ మఠంలోనో ముక్కు మూసు కూర్చోరాదూ" అని ఒక్క వాగ్వర్షం కురి పించింది.

దుర్గ ధోరణిచూసి అరుణ బెదరిపోయింది. గుండెలు దడదడలాడినయ్. ఆ క్షణం దుర్గలో కాళీ స్వరూపం గోచరించింది. అరుణ ఏదో అనబోయి మాటలురాక ఆగిపోయింది

రామారావు మౌనంగా అక్కడినుంచి వెళ్ళి పోయాడు. వెళ్ళిపోయేటప్పుడు ఒకసారి దుర్గ వైపుకు, ఒకసారి అరుణవైపుకూ చూపు సారించాడు రెండు విభిన్నమైన, విరుద్ధమైన ప్రపంచాలు వారిరువురిలోనూ అతనికి కనిపించి నయ్. ఇన్ని సంవత్సరాలూ దుర్గతో కాపురం చేశాడు దానికి ఫలితంగా జీవితంలో బాధా, ఆవేదనా, ఆశాంతీ, ఆనందం అందని ఎండ మావి. కాని అరుణ అడుగుపెట్టిన ఈవారం రోజులలోనూ ఇన్ని సంవత్సరాల నుంచీ అలుముకున్న దుఃఖాన్ని పటాపంచలు చేసే శాంతీ సౌఖ్యమూ ఇంట్లో చిందులు తొక్కు తున్నవి. వెళ్ళిపోయేటప్పుడు అరుణకేసిచూసిన మూగ చూపులో ఎంత కృతజ్ఞతను వెల్లడించు కున్నాడో ఎవరుచెప్పగలరు?

అతను వెళ్ళిపోతూ తమ ఇరువురికేసి చూడటం అరుణ గమనించలేదు. కాని ఈ వారం రోజులూ భర్తనీ అరుణనీ వెయ్యి కళ్ళతో కనిపెడుతున్న దుర్గ గమనించింది. గమనించిన క్షణమే ఎన్నో వింత ఊహలతో కంపించింది. రామారావు గదిలోకి వెళ్ళిపోయే దాకా అరుణ అటువైపుకే చూస్తూవుండటం కూడా దుర్గ కనిపెట్టింది. అతనికేసి అరుణ చూసినచూపులో సానుభూతి తప్ప మరే భావమూ లేకపోయినా దుర్గమాత్రం ఆ చూపు లకు విచిత్రమైన వ్యాఖ్యానాలు మనసులో చేసుకోసాగింది,

రాబోయే తుపానుకు సూచనలైన చీకటి మబ్బులు మొదటిసారిగా దుర్గ మనసులో కమ్ముకుంటున్నయ్. ఈ సంగతి లేశమైనా అరుణ కనిపెట్టలేకపోయింది. చిన్ననాటి చెలి మినీ చనువునూ ఆసరా చేసుకుని "అక్కా నీకు గుర్తున్నదీ ఒకనాడు మనం ఏమను కున్నామో! మన బడిపక్కనే ఒక కుమ్మరి వుండేవాడు. వాడు వాడి భార్యా పిల్లలూ ఏంతో ఆనందంగా అన్యోన్యంగా బతికేవాళ్ళు. బడికి ఎదురుగా ఇంకో కుటుంబం వుండేది ఆభార్యా భర్తలు రోజూ కీచులాడుకునేవాళ్లు. ఒకనాడు సావిత్రీ నువ్వూ నేనూ, శారదా దాగుడుమూత లాడుకుని చివరికి ఇళ్ళకి వెళ్ళిపోయేప్పుడు అందరం ఒకమాట అనుకున్నాం గుర్తున్నదీ? మనందరం ఆ కుమ్మరి కుటుంబంలాగా హాయిగా కాలం వెళ్ళదీయాలని శపథం చేశాముకదూ?" అన్నది.

మొదట దుర్గకి కోపం వచ్చింది. అరుణ తనకీవిధంగా హితబోధ చేయటమెందుకా అని కాని చిన్ననాటి విషయాలు తలపుకురాగానే దుర్గకోపం పోయింది. మనసు కరిగింది. కళ్లు తడిసినయ్."ఎప్పటెప్పటి సంగతులోగుర్తుంచు కుంటావే అరుణా." అని కాసేపు ఆనాటి సంగ తులన్నీ తలపోయసాగింది. "అరుణా! నాకు మాత్రం ప్రతిదానికీ పోటాట పెట్టుకోవాలని వుంటుందిటే? నాకుమాత్రం సుఖంగాసంసారం చేయాలని వుండదా? నాకుమాత్రం అయిన దానికీ కానిదానికీ వారితో జగడమాడటం సంబరమా యేమిటి? కాని నీకు తెలియదే అరుణా, మీబావ అదో తీరుమనిషి. వారితో కాపురంచేయటం ఎంతకష్టమోనీకేంతెలుసు?"

"అక్కా నన్ను పూర్తిగా చెప్పనీ. ఆనాటి శపథంలో ఇంకేమని అన్నామో చెప్పనా? మన భర్తలు ఎటువంటివారయినా సరే మనం వారిని గౌరవించాలనీ వారితో ఎన్నడూ పోట్లాడకూడ దనీ. పాపం ఆ మధ్య శారద కనిపించి ఏం చెప్పిందనుకున్నావ్. దానిభర్త తాగివచ్చి దాన్ని తాట ఊడేట్లుకొడుతాడుట. పాపం సావిత్రికి మూడోసంబంధపు ముసలిమొగుడు దొరికాడుట.

ముక్కోపి కూడానట. పాపం వాళ్ళిద్దరికీ అనాడు మనం నలుగురంచేసిన ఒప్పందం ఎప్పుడూ గుర్తుకొస్తుందట."

దుర్గ ఎంతోసేపు మౌనంగా కూర్చున్నది. అరుణ ఇంకేమీ మాట్లాడలేదు. చివరికి లేచి వెళ్ళిపోతూ దుర్గ అన్నది "అరుణా, వారితో పోట్లాడకూడదని నాకూ తెలుసు కాని అదంతా నా తప్పేననికాబోలు నీ అభిప్రాయం. అవునుమరి. వారు ఏదిచేసినా చెల్లిపోతుంది. నేను పల్లెత్తుమాట అంటే తప్పు. వారు కవిత్వాల్లోనూ, పుస్తకాల్లోనూ మునిగితేలుతూ మేము ఇంట్లో ఉంటున్నామో, తింటున్నామో, ఏదీ అక్కర్లేకుండా వారి ధోరణిలో వారుండటంలో తప్పులేదు. నేను ఒక్కత్తెనే సంసారం ఈదలేక నోరెత్తిఒక్కమాట అంటే నీలాటి స్నేహితురాలికూ్కడా తప్పుగా కనిపిస్తుంది. అవును లోకంతీరేఇది."

అరుణ సమాధానం ఇవ్వకముందే దుర్గ అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది. ఈవిధంగా తాను ఎందుకు కల్పించుకుని మాట్లాడానా అని అరుణ ఎంతో పశ్చాత్తాపపడింది. తన మాటలవల్ల దుర్గకు కష్టం కలిగిందని అరుణ ఎంతో బాధపడింది. తనని ఆపదలోకాపాడి అండగా నిలచిన దుర్గ మనస్సుని తానెందుకు కష్టపెట్టాలి? కాని తను అన్నమాటల్లో తప్పేమయినావుందా? అయినా తనవంటి దిక్కులేని దానికి లోకంలో ఇంకోరి విషయాల్లో జోక్యం కల్పించుకొనేందుకు అధికారమేముంది? చిన్ననాటి స్నేహాన్ని ఆసరా చేసుకుని దుర్గకి తాను మంచి చెప్పబోవటం సాహసంకాదా?

పరిపరివిధాల ఆలోచనలలో అరుణమనసు గిరగిర తిరిగింది. చివరకి అరుణ నిశ్చయించుకున్నది ఇకముందెన్నడూ అంత చనువుగా దుర్గతో మాట్లాడకూడదని ఆ ఇంట్లో తను ఎల్లా మెలగాలో ఆలోచించుకుంటూ అక్కడే కూర్చుండిపోయింది.

3

లోకంలో ప్రతి విషయంలోనూ పురుషుల వైపే పక్షపాతం! కాకపోతే యేమిటిమరి? దుర్గనెత్తిన నోరుపెట్టుకున్నదే అందరికీ కనబడుతుంది. ఆమె అరుపులే అందరికీ వినబడతయ్ ఆమెని గయ్యాళి అనటానికి అందరికీ నోరువస్తుంది. కాని దీనికి రామారావు ఎంతవరకు బాధ్యుడు? అని ఎవరూ ప్రశ్నించరు. అంతా రామారావుని పొగడేవారే అతను శాంతమూర్తి. తన ధోరణిలో తానుంటాడు. కాని ఇంకోళ్ళ జోలికిరాడు. ఇంట్లో ఉంటాడన్న మాటేకాని ఒక్కనాడయినా అతను బిగ్గరగా మాట్లాడి యెరుగడు అతనిలో అందరికీ మంచి గుణాలే కనబడతయ్. అదేం దురదృష్టమో కాని అందరికీ దుర్గలో దుర్గుణాలే కనబడతయ్.

నిజానికి, రామారావు ఎంత మంచివాడో దుర్గకూడా అంత మంచిదే. రామారావులో ఒక్క చెడ్డగుణం లేదనుకోవటం ఎంత పొరపాటో దుర్గలో అన్నీ చెడ్డగుణాలే ఉన్నవనుకోవటం అంతే.

దుర్గలో అన్ని మంచిగుణాలనీ అడుగుకునెట్టే చెడ్డగుణ మొకటుంది. అదేమిటంటే అసహనం. కాస్త కష్టంవస్తే సహించలేదు. గొంతు చించుకుని తనబాధని లోకానికంతకీ చాటిస్తేకాని ఆమెకి సంతృప్తిలేదు.

రామారావులో అన్ని మంచిగుణాల చాటునా ఒక గొప్పలోపం మరుగుపడివుంది. అది ఇతరుల చూపులకి అందకపోవచ్చును. కాని అతనితో ఇన్ని సంవత్సరాలు కాపురంచేసి అతని తత్వాన్ని అర్థం చేసుకుని, అతనితో వేగుతున్న దుర్గ దృష్టికి అందకుండా ఎల్లావుంటుంది?

అదేమిటంటే ఇంటినీ, ఇల్లాలినీ, పిల్లలనీ, ఇంటి గొడవలనీ మనసుకి పట్టించుకోక, ఎప్పుడూ తన గొడవలోతాను పడికొట్టుకుంటూ వుండటం. అటువంటి భావలోకవిహారులు లోకానికి చాలా సాధువులుగా సరసులుగా కనబడవచ్చును కాని అటువంటివారితో

అనుక్షణం కాపురంచేయటం ఎంత కష్టమో వారి భార్యలకే తెలుసు. అటువంటివారిని మాటి మాటికీ వీపుమీద చరిచి, వారికి ఈ లోకాన్నీ ఈ లోకంలోని బాధ్యతలనీ గుర్తుచేస్తూ వుండటం ఎంత దుర్ఘటమో!

అయినప్పటికీ, ఒకటిమాత్రం చెప్పక తప్పదు అవసరమైనదానికంటె వెయ్యిరెట్లు తన సంసారపుగుట్టును గొంతు చించుకుని దుర్గ లోకానికి చాటిస్తుంది అందుకనే అందరికీ దుర్గ చులకన. తను దుర్గ మాటలవల్లా చేతలవల్లా ఎంత బాధపడుతున్నప్పటికీ రామారావు ఆప్తమిత్రులకి కూడ ఆ విషయం నోరువిప్పి చెప్పుకోలేదు అందువల్లనే అతనిమీద లోకానికి సానుభూతి

గుండెలమీద కొండల బరువును మూగగా మోసేవారిని చూసి జాలి పడనిదెవరు? అందువల్లనే చూసినక్షణమే అరుణ జాలినీ సానుభూతినీ, రామారావే దొంగిలించాడు. దుర్గ తన సన్నిహితురాలుకదా, తనకి ఇంట్లో ఆశ్రయమిచ్చిందికదా, అయినప్పటికీ - అరుణ రామారావు మీదనే సానుభూతి ఎందుకుచూపాలి? దీనికి కారణం వివేచనలేని పక్షపాతమనటానికి వీలులేదు. అతనివైపు పక్షపాతం వహించటానికి అరుణకి అవసరమేమున్నది? ఏమో తెలియదు. కాని దుర్గ తన భర్తమీదికి దండెత్తినప్పుడు అప్రయత్నంగా అరుణ మనసు రామారావు పక్షాన నిలబడేది. ఈ సంగతి కనిపెట్టటానికి దుర్గకి ఎక్కువకాలం పట్టలేదు ఎక్కడా దిక్కులేక అల్లాడుతూన్న అరుణని తాను ఆదరించి ఇంటికి తీసుకవచ్చింది చిన్ననాటి స్నేహంకూడా వుందికదా అయినప్పటికీ అరుణకి తనమీద సానుభూతి ఎందుకు లేకపోవాలి? తను ఆడిన ప్రతిమాటా చేసిన ప్రతిపనీ అరుణకి తప్పుగా ఎందుకుతోచాలి? ఇతరులందరి దృష్టిలోలాగే అరుణ దృష్టికికూడా తన భర్త నిర్దోషిగా ఎందుకు కనబడాలి? దీనికంతటికీ దుర్గకి ఒక్కటేకారణం కనబడుతోంది ఆ కారణం దినదినమూ బలపడుతోంది. అరుణతో మునుపటిలాగే మాట్లాడలేకపోతోంది. అరుణ తనకేదో అపచారంచేస్తున్నట్లనిపించేది.

అరుణ స్వభావం ఎంతో అమాయకమయింది తనలాగే అందరూ సరళంగానూ స్వచ్ఛంగానూ వుంటారని భావించేది. దుర్గ మనసులో జరుగుతున్న సంఘర్షణని అరుణ కనిపెట్టలేకపోయింది. తనతో దుర్గ మునుపటిలాగా చనువుగా మనసిచ్చి మాట్లాడటంలేదనీ, దానికేదో కారణం వుంటుందనీ అరుణ తలపోయలేదు. తనుమాత్రం దుర్గని మనసారా "అక్కా" అని పలకరించేది.

అరుణకి దినమంతా లలితతోనూ కృష్ణుడితోనూ సరిపోయేది వాళ్ళకి ఏది కావలసినా ముందు పిన్ని దగ్గరకి వచ్చి దరఖాస్తు పెట్టుకునేవాళ్లు తల్లిని అడగటమంటే ఇద్దరికీ భయమే. అరుణే వాళ్ళకి పలకలూ, పుస్తకాలూ, గోళీలూ, బిళ్ళలూ, గాలిపటాలూ, సమస్తమూ సంపాదించిపెట్టేది. పిల్లల తరపున వకాల్తు పుచ్చుకుని అక్కగారి దగ్గరినుంచి వాళ్ళకి కావలసినవన్నీ సంపాదించి తెచ్చేది అల్లాగే ఒకనాడు కృష్ణుడు పిన్ని దగ్గరికివచ్చి గాలిపటానికి దారంకోసం మారాం చేయటం మొదలుపెట్టాడు. లలిత బొమ్మలపెళ్ళికి పల్లకీ కావాలని వచ్చి పిన్నికి విన్నవించుకుంది. వాళ్ళని అక్కడే వుండమనిచెప్పి తాను దుర్గ గదిలోకి వెళ్ళింది. దుర్గ నేలమీద జుట్టు విరబోసుకుని పడుకుంది. అరుణ అక్కా అని పదిసార్లు పిలిచినా పలకలేదు. చివరికి అరుణ దుర్గని చేతులతో తట్టిలేపి "ఇదేమిటి అక్కా? కిందపడుకొన్నావ్?" అని అడిగింది. "నేనెక్కడ పడుకుంటే ఎవరికేం కావాలి? నాకంటె ఈ ఇంట్లో దాసీది నయం" అని నోటికి తోచినట్లన్నది. అరుణకి అర్థం కాలేదు "అదేమిటే అక్కా? నీకేం తక్కువయింది చెప్పు?" మారు చెప్పకుండా దుర్గ వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టింది. "కారణం చెప్పవే అక్కా; బావ ఏమైనా అన్నారా?" దుర్గ మరీ బిగ్గరగా ఏడవటం మొదలుపెట్టింది. ఏమీ తోచక అరుణ గదిబైటికి నడిచింది. దుర్గ రపీమని తలుపు వేసుకుంది (సశేషము)

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[చిత్ర ప్రదీప ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౧౦

ఆత్మ యిచ్ఛాదికంబగు నట్టి జ్ఞాన
గుణము లొదవుట చేతఁ జేతనుఁడనఁబడు,
కర్మములు చేయుట వలనఁ గర్తయయి,సు
ఖాదు లనుభవింపగ భోక్తయనఁగఁ బరగు.

ఎట్లు కర్మవశంబున నీశరీర
మందు నొక్కొకవేళ సుఖాదులొదవు,
నట్లె లోకాంతరమున దేహంబు కలుగ
కర్మ మనుసరించియుఁ గోరిక లటఁ గలుగు,

అంతటను నిండియుండెడు నాత్మ కిట్లు
గౌణముగ రాక పోకలు గలుగవచ్చు,
అందులకు ఫల సహిత కర్మాళిఁ జెప్పు
గ్రంథమె ప్రమాణమని ప్రభాకరుఁడు నొడివె.

గాఢ నిద్రలో స్పష్టము గాని జ్ఞాన
మయ మయిన యట్టి యానందమయమె ఆ ప్ర
భాకరాదుల కాత్మయౌ, నట్టి యాత్మ
కట్టి జ్ఞానాదికములె గుణాదు లగును.

భాట్టు లాత్మదైనట్టి యస్పష్టమైన
యట్టి జ్ఞానస్వరూపము నరసి యరసి
ఆత్మ జ్ఞానాత్మకమ్ము జడాత్మకమ్ము
నంద్రు, నిద్రనుండియు లేచి నట్టివేళ
నే సుఖముగ నిద్రించితి వేఱుయెఱుఁగ
ననెడు స్మృతి బట్టి జ్ఞానమయమని యంద్రు.

నిదురనుండియు మేల్కాంచి నిద్రయందు
తన యనుభవమున్ స్మరియించి, తత్సమయము
నందు జడమయి నిద్రించినాడ నంచు
ననుకొనును, నిద్రలో జడత్వానుభవము
లేనిదటు స్మరియింపఁగ లేదు గాన
ఆత్మ జడరూపమని భాట్టు లనుచునంద్రు.

ఆత్మకెప్పుడు నాశ మటంచులేదు
ఉండుచోఁ జూచు వాడొకఁడుండ వలదె?
ఆత్మ నిదురయందును నుండుననియె శ్రుతియు
భాస్కరుండు తా మేఘము పట్టినపుడు
వెలుఁగఁబోక, పట్టనియప్డు వెలుఁగునట్లు
ఆత్మ చిదచిత్స్వరూప మౌనంద్రువారు

ఆత్మ నిరవయవుండైన యట్టికత్తన
జ్ఞానపున్ స్వరూపుండు నజ్ఞానపున్ స్వ
రూపుఁడగుటయుఁ గలుగమి రూఢిగాన
ఆత్మ చిద్రూపుఁడని సాంఖ్యు లనెడివారు.

మూల ప్రకృతియె యజ్ఞానము నగుచుండు
అదియె త్రిగుణాత్మకము వికారాత్మకంబు
పురుషు భోగ మోక్షంబులు పొందు కొఱకు
అది ప్రవర్తించునని సాంఖ్యులనుచు నుంద్రు.

ప్రకృతి పురుష భేదమెఱుంగఁ బడమి చేత
జీవుఁడా బంధమోక్షముంజెందు చుండె,
నంచు తార్కికాదులును వాదించు నట్లె
సాంఖ్యులును గూడ బంధ మోక్షములు చెప్పు
కొఱకు నాత్మభేదము నొప్పు కొనుచు నుంద్రు

అమ్మహాతత్త్వమున కంటె నన్యమైన
దని యగోచరమని ప్రకృతిని గుఱించి
శ్రుతియు ఘోషించుఁ దత్పురుషుండె దేని
తోడ సంబంధమును లేని వాఁడటంచు
ఆశ్రుతియె చెప్పునని సాంఖ్యులనుచు నుంద్రు.

ఆత్మ సన్నిధి నటియించు నట్టి ప్రకృతి
కీశ్వరుఁడు నియామకుడని యెంత్రు యోగు
లీశ్వరుఁడు జీవు కంటె నుత్కృష్టుఁ డనియు
ఆశ్రుతియె చెప్పు ననియోగులనెడు వారు.

ప్రకృతియన గుణత్రయ సమవస్థ యనియు
ఆప్రకృతిని జీవతతిని ఆ గుణత్ర
యమును నియమించు నీశ్వరుఁడనెడు నాతఁ
డుండెనని శ్రుతియనె నని యోగు లంద్రు.

అట్టి యీశ్వరు విషయము నందుఁదమ మ
తములు స్థాపించు కొఱకయి తమదు తమదు
యుక్తులను జూపికొంచు నెట్లో పలు విధ
ములుగ వాదించుకొనుచుండఁ బూనుచుంద్రు

పంచ క్లేశాలతో కర్మ ఫలముతోడ
గర్మముల తోడ నంటక నిర్మలుఁడగు
జీవువలె నసంగుండును జిత్స్వరూపుఁ
డీశుఁడని పతంజలి వచియించి యుండె

అట్లసంగుండు చిద్రూపుఁ డయ్యు నీశ్వ
రుండు పురుషోత్తముండయి యుండుకతన

సర్వమును నియమింపఁగఁ జాలియుండు
అట్లు కాదేని జీవునియందు బంధ
మోక్షములు నియమము లేక పోవ వచ్చు
నని పతంజలి మత మిది యరయనగును.

ఈశ్వరు వలని భయముచే నెల్ల యవియు
నియమమును దప్పవనియు నా నిగమ మనియె,
కర్మఫలములు నంటని కారణమున
ఈశు డనియామకు డసంగుడె యయి యుండు.

జీవులు నసంగు లగుట చేత వాస్త
వముగ కర్మముల్ క్లేశముల్ వారి కేమి
లే వయిన నట్టి జ్ఞానము లేని కతన
నుండు క్లేశ కర్మము లంచు యోగి మతము.

ఈశ్వరున కసంగత్వము నెప్పుడుండు
అప్పుడు నియామకత్వ మటంచు నుండ
దనియు నిచ్ఛ జ్ఞానము యత్నమను గుణమ్ము
లుండనగు నని తార్కికు లొప్పికొంద్రు.

ఈ గుణత్రయ మంటచే నీశ్వరుండు
పురుషు లందుత్తమత్త్వము బొందియుండె,
సత్య సంకల్పుఁడంచును సత్యకాముఁ
డంచు శ్రుతు లీశ్వరుని గుఱియించి తెల్పు.

తార్కికులు చెప్పు నట్టి విధంబు గాగ
ఆ గుణము లీశ్వరునకు నిత్యంబులైన
నీశుచే నట్టి సృష్టియు నెపుడు జరుగు
చుండవలయు నట్లు జరుగు చుండనట్టి
కారణంబుచేత హిరణ్యగర్భుఁ డొకఁడె
యీశుఁడగును, అంతర్యామి యీశుఁడేమి
కాడనియు. మాయయె యుపాధి గాగనుండు
నాత్మయె హిరణ్య గర్భు డౌననియు, లోక
మందు హైరణ్యగర్భులు ననుచున్నారు.

ఆ హిరణ్య గర్భ మహత్త్వ మధికముగను
పలుకఁ బడియెను నుద్గీత బ్రాహ్మణమున
ఆతనికి లింగ దేహము నంటియున్న
కర్మములు లేమి జీవత కలుగదేమి.

యథార్థము - అయథార్థము

బెర్ట్రండ్ రసెల్

అనువాదం జి. ఎస్. ఎన్.

౨

గతసంచిక తరువాయి

డెస్డెమోనా కాషియోయెడల ననురాగము గల్గియున్నదను వేఱొక విషయమున కతని విశ్వాసము సంబంధించియున్నదని చెప్పుటకద్దు కాని డెస్డెమోనా కాషియోయెడల ననురాగప్రసక్తియే లేనపుడు - అట్టి విషయ మొకటి కలదని యనుకొనుట యంత సులభముకాదు కావున ఒక విషయమునకు మనస్సు ననుసంధానపరచుటలో విశ్వాసమను పదము సువ్యక్తము కాదు. అందుచే దానిని నిర్వచించుటకు మనము వేఱొకమార్గము ననుసరింపవలయును.

సంబంధములనగా ఎల్లప్పుడు రెండు పదముల నడుమనే యుండునవి సామాన్యముగా ననుకొనుట కలదు. కాని ఇది యెల్లప్పుడును కుదురునదికాదు కొన్ని సంబంధములకు మూడు పదములుగూడ నవసరము మఱికొన్నిటికి నాలుగు కావలసివచ్చును అవసరమునుబట్టి వానియాధిక్యమును గ్రహింపవలయును. 'మధ్య' అను సంబంధమునే ఉదాహరణముగా దీసికొందము. ఆ సంబంధమును సరిగా వ్యక్తము చేయవలెనన్న అథమము మూడు పదములైనను ఉండవలెను. యార్క్ అను పట్టణము లండన్‌కును ఎడింబరోకును మధ్య ఉన్నది. ప్రపంచములో లండను, ఎడింబరో అను రెండే ప్రదేశములున్నచో ఒక ప్రదేశమునకు, మరియొక ప్రదేశమునకు మధ్య నేమియు నుండుటకు వీలులేదు. అట్లే అసూయను వ్యక్తము చేయవలయుననిన అథమము ముగ్గురు వ్యక్తులైననుండవలయును. కావున అథమము మూడు పదములో వ్యక్తులో లేనిదే ఒక సంబంధము వ్యక్తముకాదు. A B C ని D కిచ్చి వివాహము చేయవలెనని కోరుచున్నాడు. ఈ వాక్యములో నాల్గు పదము లొక సంబంధమును వ్యక్తము చేయుచున్నవి. ఇందులో A,B,C,D అను నలుగురకును ప్రసక్తిగలదు. ఈ సంబంధమును వ్యక్తముచేయుట కథమము ఇన్ని పదములైన నుండవలెను, ఇట్టి యుదాహరణములను కొల్లలుగా నీయవచ్చును కాని సంబంధములు వ్యక్తము చేయుటకు రెంటికంటె నెక్కువపదము లావశ్యకమని వేఱు చెప్పనక్కఱలేదు

నిర్ధారణ చేయుటలోగాని విశ్వసించుటలోగాని ఇమిడియున్న సంబంధము - అయథార్థతకు వందు తగిన యవకాశమును కల్పింపవలయునన్నచో నది రెండు పదములను గాని అనేక పదముల ననుసంధానముచేయు సంబంధమై యుండవలయును. డెస్డెమోనా కాషియోయెడల ననురక్తయై యున్నదని ఒథెల్లో విశ్వసించునపుడు, అతడు కేషియోయెడల డెస్డెమోనా అనురాగమను విషయమునుగాని, లేక డెస్డెమోనా కేషియో యెడల ననురక్తయై యున్నదను విషయమును గాని తన మనస్సులో నుంచుకొనగూడదు. అట్లైనచో, మనస్సులపై నేవిధముగను నాధారపడని వాస్తవమగు నయథార్థత నంగీకరింపవలసి వచ్చును. ఇట్టివాదము తార్కికముగా త్రోసివుచ్చుటకు వీలులేనిదైనను, మన కంగీకారము కాదు నిర్ణయమును (Judgment) మనస్సును, దానికి ననుబంధించి యున్న విషయము అన్నియును విడివిడిగా ప్రవర్తించు సంబంధముగా భావించినచో, నయథార్థతకు తగిన కారణకల్పన చేయగల్గినవారమగుదుము. అనగా డెస్డెమోనా, అనురాగము, కేషియో - అను నీమూడును ఒథెల్లో - డెస్డెమోనా కాషియోయెడల ననురక్తయై యున్నదని నమ్మినపుడేర్పడు సంబంధములోని పదములై యుండవలెను కావున నీసంబంధము నాల్గు పదములలో వ్యక్తమైనదని చెప్పవచ్చును ఏలనన ఒథెల్లో సంబంధమును వ్యక్తముచేయు పదములలో నొకటియై యుండవలెను అది నాలుగుపదముల సంబంధమని మనము చెప్పుచున్నామనగా, ఒథెల్లో డెస్డెమోనా యెడల నొకానొక సంబంధమును గలిగియున్నాడనియును, అనురాగము, కేషియోలపట్ల గూడ నదేసంబంధము గలిగియున్నాడనియును, మనము వ్యాఖ్యానించుట లేదు విశ్వసించుటకాక మరి యేయితర సంబంధ విషయమునవైనను నట్లు వ్యాఖ్యానింప వీలగును కాని యీ విషయమున నట్లు వీలులేదు. కాని విశ్వసించుట యనునది పై మూడు పదములలో ప్రతి దానికిని విడిగా సంబంధించి యుండదు కాని వాని యన్నింటికిని సమష్టిగా సంబంధించినదై విశ్వసించుటలో నిమిడియున్న సంబంధమును వ్యక్తము చేయుటకు ఒకే యుదాహరణగలదు. ఈ ఒక్క ఉదాహరణము నాల్గు పదములను ఒక్కచో కలుపును. కావున విశ్వసించుటయను సంబంధము, ఒథెల్లో, డెస్డెమోనా, అను నాల్గు పదములను ఒక్క సంకీర్ణమగునవయవి (Complex whole) గా నేకీకరించుచున్నది.

విశ్వాసమనగా నిర్ణయమనగా - ఒక మనస్సును దానికి నతిరిక్తమగు ననేక విషయములకు ననుసంధించు విశ్వసనరూపమగు సంబంధము లేక నిర్ణయరూపమగు సంబంధము. విశ్వాసమను వ్యాపారము లేక నిర్ణయమను వ్యాపారము ఒకానొక ప్రత్యేకమగ్గు సన్నివేశమున విశ్వసనరూపమగు లేక నిర్ణయరూపమగు సంబంధమును వ్యక్తముచేయు కొన్ని పదముల నడుమగల నొక సంఘటనము.

యథార్థమగు నిర్ణయమనగా నేమో, తద్వ్యతిరిక్తమగు నిర్ణయమేదో యను విషయమై వివేచనము చేయుటకు ప్రస్తుతము మనకు వీలు చిక్కినది. ఈ సందర్భములో మనము కొన్ని నిర్వచనములను పరిశీలించిచూతము. ప్రతినిర్ణయ వ్యాపారమునందును, నిర్ణయముచేయు వ్యక్తికి సంబంధించిన మనస్సొకటి యుండును, దేనికి సంబంధించి నిర్ణయము జరుగునో ఆపదములుగూడ నుండును. ఈనిర్ణయ వ్యాపారమున నిర్ణయించు మనస్సును విషయి (Subject) యనియును, తదితర పదములను విషయములనియును వ్యవహరింపనగును. ఉదాహరణకు, డెస్డెమోనా కాషియోయెడల ననురక్తయై యున్నదని ఒథెల్లో నిర్ణయించునపుడు, ఒథెల్లో విషయి. డెస్డెమోనా, అనురాగము కాషియో అను పదములు విషయములు. ఈ విషయియును, విషయమును నా నిర్ణయమున కంగములగుచున్నవి నా నిర్ణయ సంబంధమునకొక యుద్దేశ్యము, ఒక మార్గము కలదని కొంత పరిశీలనచేసిన పిమ్మట తెలియగలదు అనగా నాసంబంధము విషయముల నొక వ్యవస్థగా నిక్షేపించుచున్నదన్నమాట. దానిని వాక్యములలోని పదముల క్రమమును బట్టి మనము తెలియజేయవచ్చును విభక్త్యాదివికారముల ప్రాధాన్యముగల భాషలో, ఒకే విషయమును విభక్తిప్రత్యయములచే ప్రథమా, ద్వితీయా విభక్తుల నడుమగల వ్యత్యాసముచే వ్యక్తముచేయ వీలుకలదు. కాషియో డెస్డెమోనా యెడల ననురాగము కలిగియున్నాడని ఒథెల్లో భావించినాడనుకొందము. ఈ నిర్ణయము పై నిర్ణయమునకు విభిన్నమైనది ఈ రెండింటిలోని అంగములకును వ్యత్యాసములేదు. కాని నిర్ణయసంబంధము అంగములను వేఱొకక్రమములో విన్యసించుటచే పైరెండు నిర్ణయములకును వ్యత్యాసమేర్పడుచున్నది అట్లే డెస్డెమోనా ఒథెల్లో యెడల ననురక్తయై యున్నదని కాషియో నిర్ణయించుచో, అప్పుడును నిర్ణయాంగములు సమానమే. కాని క్రమముమాత్రము భిన్నము. కావున సంబంధము లే యుద్దేశ్యము ననుసరించి ప్రవర్తించుచున్నదో, ఆయుద్దేశ్యమే క్రమమును నిర్ణయించును

విశ్వసించుట లేక నిర్ణయించుట యను సంబంధమును విశదీకరించునపుడది, విషయిని, విషయములను ఒక్క సంకీర్ణమగు నవయవిగా నేకీకరించుట యని పూర్వము చెప్పియుంటిమి. ఈ విషయమున, నిర్ణయించుట యనునది తదితర సంబంధములవంటిదే. ఏమియును వ్యత్యాసములేదు. ఒక సంబంధము, రెండు మూడు పదముల నడుమ ప్రవర్తించునపుడు, అది యాపదముల నొక్క సంకీర్ణమగు నవయవిగా నేకీకరించును. సంబంధముచే నేకీకరింపబడిన పదములే ఒకప్పుడు అసంకీర్ణముగను, ఒకప్పుడు సంకీర్ణముగను ఉండవచ్చును. కాని ఏకీకరణమువలన నేర్పడిన యవయవిమాత్రము తప్పక సంకీర్ణమైనదై యుండవలెను కొన్ని పదముల ననుసంధించు సంబంధమున్నచోటెల్ల, ఆపదముల సంయోగమువలన నేర్పడిన ఒకానొక సంకీర్ణవిషయము కాననగును. అట్లే ఒక సంకీర్ణ విషయమున్నపుడెల్ల, దాని యంగములను అనుసంధించు సంబంధముండును విశ్వసించుటయను వ్యాపారము ప్రవర్తించునపుడు, అందొక సంకీర్ణత గలదు. ఈవ్యాపారములో విశ్వసించుట సమైక్యపఱచుసంబంధము విశ్వసించుసంబంధము ఉద్దేశ్యము ననుసరించి, విషయము లాక్రమములో కూర్పబడును, డెస్డెమోనా కాషియో యెడల ననురక్తయై యున్నదని ఒథెల్లో విశ్వసించుచున్నాడను దానిని మనము పరామర్శించినపుడు మనకు తెలియవచ్చినట్లు, విషయములలో, అనురాగము కల్గియుండుట (ఈయుదాహరణము ననుసరించి) యనునది యొకటియై యుండవలెను. కాని విశ్వసించుట యను వ్యాపారములో జరుగునట్లు, ఈ సంబంధము విషయవిషయులతో గూడుకొనిన సంకీర్ణావయవి యైక్యము నుత్పన్నముచేయు సంబంధముకాదు విశ్వసించుట యను వ్యాపారములో జరుగునట్లు అనురాగము గల్గియుండుట యను సంబంధము, విషయములలో నొకటి అది కట్టడములో నిటుకరాయిగాని సిమెంటుకాదు సిమెంటు విశ్వసించుట యను వ్యాపారము. ఆ విశ్వాసము యథార్థమైనదైనపుడు, ఇంకొక సంకీర్ణమగు నైక్యము గన్పట్టును అందు పూర్వము విశ్వాసవిషయములలో నొకటై యుండిన సంబంధము తదితర విషయముల ననుసంధించును అనగా డెస్డెమోనా కాషియోయెడల ననురక్తయై యున్నదని. ఒథెల్లో యథార్థముగనే విశ్వసించుచో. కేషియోయెడల డెస్డెమోనా యనురాగము అనురూపములో నొకానొక సంకీర్ణమగు నైక్యముండనే యున్నది అది కేవలము విశ్వాసవిషయములతో గూడుకొని యుండును. ఆ విశ్వాసమునకు జెందిన తదితర విషయములను అనుసంధించు సిమెంటుగా ప్రస్తుతము వర్తించు విషయములలో నొకటి యగు

సంబంధముతో గూడిన విశ్వాసములో నెట్టి క్రమములో నుండునో, ఈవిశ్వాస విషయములు గూడ నట్టి క్రమములోనే యుండును అట్లు కాక ఒక విశ్వాసము యథార్థమైనచో, విశ్వాస విషయములతో నూతనమే గూడుకొనిన సంకీర్ణమగునైక్యము ఉండదు. డ్డ[illegible]ానా కేషియోయెడల ననురక్తయై యున్నదన్న సంగతిని ఒథెల్లో అయథార్థముగా విశ్వసించుచో కేషియో యెడల డెస్డెమోనా అనురాగము వంటి సంకీర్ణమగు నైక్యమనునది యుండదు.

కావున ఒక విశ్వాసము దానికిననుబద్ధమైన ఒకానొక సంకీర్ణవిషయమునకు ననుగుణముగా నున్నప్పుడు యథార్థమైన దగును అట్లు లేనపు డయథార్థమగును. విశ్వాసవిషయములు రెండు పదము లనియును, ఒక సంబంధమును కలసియుండుననియును, ఆ పదములు. విశ్వసించుటకు సంబంధించిన ప్రధానోద్దేశ్యముచే నొకానొక క్రమములో విన్యసింపబడుననియును, స్పష్టతకొఱకు భావింతము పిమ్మట ఆక్రమములోని రెండు పదములును సంబంధముచే నొక సంకీర్ణమగు నవయవిగా నేకీకరణ చేయబడినప్పుడు, ఆ విశ్వాసమును యథార్థమనవచ్చును లేనిచో నయథార్థమగును ఇంతవఱకును మనము వెదకులాడుచున్న సత్యనిర్వచనమునకు ఇప్పుడు మార్గము గోచరించినది విశ్వసించుటగాని నిర్ణయించుటగాని ఒకానొక సంకీర్ణమగునవయవి అందులో నిర్ణయముచేయు మనస్సు, విశ్వసించుమనస్సు అవయవము (భాగము) మిగిలిన యంగములు, విశ్వాసములో నున్న క్రమములో, సంకీర్ణమగు నవయవిగా నేర్పడుచో, అప్పుడు విశ్వాసము యథార్థమగును, లేనిచో నయథార్థమగును.

కావున, సత్యాసత్యములు, విశ్వాసములకు సంబంధించిన ధర్మములైనను, నవి యొక విధముగా బాహ్య ధర్మములై యున్నవి ఏలన ఒక విశ్వాసము యథార్థమగునా కాదా యన్నది, విశ్వాసముపైనగాని విశ్వసించు మనస్సుపైనగాని ఆధారపడి యుండదు మరి విశ్వాస విషయములపై (object of belief) నాధారపడి యుండును విశ్వసించు మనస్సు, విశ్వాస విషయములతో గూడుకొన ఒక యనుగుణమగు సంకీర్ణావయవి యున్నప్పుడే యథార్థమగును కావున నీయానుగుణ్యమే విశ్వాసమునకు సంబంధించిన సత్యాసత్యములను నిర్ణయించును ఆయానుగుణ్యము లేనపు డయథార్థమగును. కావున విశ్వాసముల యునికి మనస్సులమీద నాధారపడి యున్నవనియును యాథార్థ్యము మాత్రము, మనస్సులపై నాధారపడి యుండవను నీ రెండును సిద్ధాంతమైనట్లు భావింపవచ్చును.

మన వాదము నీక్రింది విధముగ నిక్షేపింపవచ్చును. డెస్డెమోనా కాషియోయెడల ననురక్తయై యున్నదని ఒథెల్లో విశ్వసించునపుడు, డెస్డెమోనాను, కాషియోను విషయసూచకములగు పదములనియును, అనురాగము గల్గియుండుటను విషయ-సంబంధమనియును వ్యవహరింతము అట్లుకాక, కాషియోయెడల డెస్డెమోనా అనురాగరూపమున విషయసంబంధముచే ననుసంధింపబడిన విషయసూచకములగు పదములతో గూడుకొనిన సంకీర్ణావయవి యొకటి యున్నచో. నా సంకీర్ణావయవని, విశ్వాసమునకు ననుగుణమగు యథార్థ విషయమని చెప్పనగును. కావున నొక విశ్వాసమొక యథార్థవిషయమునకు ననుగుణముగా నున్నప్పుడు యథార్థమగును. అట్టి యనుగుణమైన యథార్థవిషయము లేనప్పుడు ఆవిశ్వాసము అయథార్థమగును.

కావున వ్యక్తుల మనస్సులనుబట్టి సత్యాసత్యములను నిర్ణయింపవీలులేదని తెలియనగును. వ్యక్తులమనస్సులలో విశ్వాసములు పుట్టుటకు వీలున్నది కాని విశ్వాసముల యునికికి మనస్సు లాధారమైనంత మాత్రమున, వాని నిజానిజములకు అవి నిర్ణాయకములు కాజాలవు కాని విశ్వసించు వ్యక్తికి అందుబాటులో నున్న భవిష్యద్విషయములకు సంబంధించిన ప్రత్యేక సందర్భములో - ముఖ్యముగా రైలుబండ్ల నందుకొనుటవంటి విషయములలో - విశ్వాసించు మనస్సునకు సత్యాసత్య నిర్ణయము చేయుటలో భాగము లేకపోలేదు కావున ఒక విశ్వాసము యథార్థమగునా కాదా యన్నది, దానికి నాధారభూతమగు వస్తుస్థితి (fact) పై నాధారపడియుండును ఈ వస్తుస్థితికి విశ్వాసముగల వ్యక్తి మనస్సునకును అసాధారణ పరిస్థితులలో తప్ప సామాన్యముగా సంబంధముండదు.

సత్యాసత్యములనే యర్థములో మనము వ్యవహరింపనగునో నిర్ణయించుకొనిన పిమ్మట ఒక విశ్వాసము యథార్థమనిగాని అయథార్థమనిగాని తెలిసికొనుటకు మార్గము లేవో మనము సమాలోచింపవలసియున్నది తరువాతి యధ్యాయమున దీనినిగూర్చి పర్యాలోచింతము.

ఎప్పుడు మానవతభావము వికసించును?

శ్రీ "కౌటిల్యుడు"

మనము భారతజాతీయ వాదులము. మనలను మనమే పరిపాలించు కొను చున్నాము. మన పారిపాలన మనకే చిక్కులను కల్పించుచున్నది. ఈచిక్కులు పరులచే కల్పించబడలేదు. వీటిని మనకు మనమే కల్పించుకొనుచున్నాము.

పరుల పరిపాలనా సాంగత్యము వలన మన మనస్సులలో అనేక విషయములు అంతర్లీనమైయున్నవి. అవి మనకు తెలియకనే, మనపై పెత్తనము చేయు చున్నవి. అవి యివి: పరభావదాస్యము, పరభాషాదాస్యము. పరపరిపాలన తొలగించుకొనినను, పరభావదాస్యము, పరభాషాదాస్యము, మనము తొలగించుకొనలేకపోవుచున్నాము.

స్వభావమనునది, పరభావమనునది యేదియో మనకు తెలియదు. స్వభాష యనునది పరభాషయనునది యేదియో మనకు తెలియదు. మనము మన భావమునకు, పరభావమునకు తారతమ్యము గమనించలేక పోవుచున్నాము. మనము మనభాషకు, పరభాషకు వ్యత్యాసము వివరించలేక పోవుచున్నాము. మనకు యేది హితవును కలిగించునో, యేది అహితవును కలిగించునో, గమనించి ప్రయోజనాపేక్షతో స్థిరసంకల్పులమై, విజ్ఞతతో వ్యవహారజ్ఞానమును వ్యక్తము చేయలేక పోవుచున్నాము

మనము భారతీయులమే. ప్రపంచము లోని జనాభాలో మనము ఒక ఖండములో నివసించియున్న వారిలో ఒక గణనీయమైన సంఖ్యాప్రమాణము కలిగి యున్న వారమేనని తెలిసికూడ వ్యక్తత కలిగి వ్యవహరించలేక పోవుచున్నాము.

ఆంగ్లేయుల సామ్రాజ్యములో స్వాములుగా కొన్ని దశాబ్దములపాటు కలసిమెలసి జీవించడమువలననూ, వారి పరిపాలనా పాటవములో మెలగడము వలననూ, ఆంగ్లభాషాప్రాభవ ప్రాబల్యములు మనపైబడుట వలననూ, మనమీ స్థితిలో నున్నామని యెరిగి యుండికూడ వాటినుంచి విడివడలేక పోవుచున్నాము.

ప్రపంచమనగనే ఆంగ్లేయులు మనకు ప్రత్యక్షముగా కనిపించుచున్నారు. మనము మనభావములను ఆంగ్లేయుల భాషలోనే వ్రాసుకొనిన గౌరవము వచ్చునను కొనుచున్నాము. మనమింత వరకు ఆంగ్లేయుల భావనలు, ఆంగ్లేయుల భాషాప్రాభవములలో మనకు మనము శిక్షణ నిచ్చుకొనినందువలననే, మనమిలా నడచుకొనుచున్నాము ఆంగ్లేయులనినంతనే మనకు తెలియని సన్నిహిత సంబంధము యేదో మనకుండినటుల భావించుకొని దానినుంచి తప్పించుకొనుటకు ప్రయత్నమైననూ చేయలేకపోవుచున్నాము. ఇది మనకీనాడు యెన్నో చిక్కులను కల్పించు చున్నది. మనమీచిక్కులను పరిష్కరించుకొనవలెనన్నచో మన మార్గమేదో మనము సుస్పష్టముగా నిర్వచించుకొనవలయును.

అణ్వస్త్ర శాస్త్రమును రష్యనులు వారిభాషలోనే నేర్చుకొని యుండిరి. ఈనాడు అణ్వస్త్ర శాస్త్రపరిశోధనా

జ్ఞానములో రష్యావారు సిద్ధహస్తులని ఆంగ్లేయ శాస్త్రజ్ఞులే అంగీకరించుచున్నారు. ఇది మనకు తెలుసు. ఇంతే కాదు. జర్మనులు, చైనీయులు, జపానువారు, ఫ్రెంచివారు యింకా తదితరులు వారి వారి మాతృభాషలలోనే శాస్త్ర విజ్ఞాన సముపార్జన చేసుకొనుచున్నారు. అందరూ తమతమ ఆత్మగౌరవములను కాపాడుకొనుటకు ప్రయత్నించుచునే యున్నారు. ఒక్క ఆంగ్లేయ సామ్రాజ్య భావదాస్యములో మెలగినవారికి మాత్రమే యీ గతి పట్టినది. ఇది సద్గతి యని కొందరనుచున్నారు. కాదు దుర్గతి యని మరికొందరనుచున్నారు. ఇది యే గతిమో తెలియనివారెందరో యున్నారు. ఇది యీనాటి మన వ్యవహారజ్ఞానమునకు తార్కాణము. ఇది స్వతంత్ర భావమో, పరతంత్రభావమో మరి యే భావమో పెద్దలైనవారు పరిశీలనచేసి మనకు వివేకోదయము కలిగించిన యెడల మన మీ భావదాస్యమునుండి, భాషాదాస్యమునుండి బయట పడవచ్చును. మన కెందరో త్యాగమూర్తులు పుట్టినందు వలన స్వపరిపాలన వచ్చినది. మరల మరల అటులనే పుట్టినగాని మన కీ అవ్యవస్థ తొలగదనిపించుచున్నది.

మనకు విశ్వవిద్యాలయము లున్నవి. విద్యాలయము లనునవి యున్నవి. ఇవి అన్నియూ ఆంగ్లేయ విద్యాపద్ధతులనే అనుసరించుచున్నవి ఏటేటా కొన్ని వేల మంది విద్యార్థులు ఆంగ్లేయ భాషాభావముల ప్రాబల్యములలో తయారవుచున్నారు. తయారు చేయువారు, తయారగువారు ఆంగ్లేయ భాషాభావ దాస్యములను వెదజల్లుటకే తోడ్పడుచున్నారు. ఇది ఒక సమస్య. ఈ సమస్యను పరిష్కరించవలె నని మనము ప్రయత్నించుచున్నామా?

విద్యాబోధన మన మన మాతృభాషలలో జరుపుకొనుటకు మన మంగీకరించలేక పోవుచున్నాము. మన విద్యలకు ఒక ప్రమాణపద్ధతిని నిర్ణయించలేక పోవుచున్నాము ఇది యంతయూ ఆంగ్లేయుల భావదాస్య ప్రభావమేనని మనము తెలిసికొనవలయును. మన మీ భావదాస్యమునుండి, భాషాదాస్యమునుండి బయలుపడ ప్రయత్నించగలమా? ఎన్నటికీ ప్రయత్నించలేమనే మన విధానము మనకు చెప్పుచున్నది.

స్వజాతీయ భాషలో స్వధర్మ విద్యా ప్రమాణములను నిర్ణయించుటకు మన మింకనూ పూనుకొనలేదు. పైగా ఆంగ్లేయ విద్యావిధానమును ఎందువలన సంస్కరించవలయునో, ఎందువలన స్వజాతీయ విద్యావిధానమును రూపొందించుకొనవలయునో మనము గుర్తించలేదు.

మన, మన, నిత్య వార్తాప్రసారము, వార్తాప్రకటన, ప్రచారము, విద్యాబోధన ఆంగ్లేయుల ప్రమాణపద్ధతినే అనుకరించబడుచున్నవి. మనకున్నదంతయూ అనుకరణప్రభావమేనని మన ఆచరణమార్గము స్పష్టము చేయుచున్నది.

మన దేశములోని రాజకీయ పార్టీలన్నియు జాతీయతనే గుర్తించుచున్నామనుచున్నవి. ఆచరణలో ఆంగ్లేయ భావదాస్యముననే మెలగుచున్నవి. మన పార్టీ విధానములు, మన ప్రచారములు మన పార్టీ తీర్మానములు అన్నియూ

ఆంగ్లేయములే. ఈ ఆంగ్లేయ వాసనా ప్రభావము మన బ్రతుకులలో మనకు తప్పనిసరియని తోచుచున్నది.

మన దేశములోని పెద్దలందరూ ఆంగ్లేయుల విధానము మనకు తప్పదను చున్నారు. మంచి యేదియైన నేమి యనుచున్నారు. మనకు ఏది సంకుచిత జాతీయవాదమో, ఏది విశాలమైన జాతీయవాదమో తెలియకనే యున్నది. మనకా సంకుచిత జాతీయవాదము వలదనుచున్నారు, అయిన విశ్వశ్రేయస్కరమైనభావ మేదియైననూ ఎచ్చటిదైననూ మనకు సమానమేనని పెద్దపెద్ద వ్యాఖ్యానములు వినిపించుచున్నారు. ఇదియే మన బానిసభావమునకు చిహ్నము.

అనుశ్రుతముగా మనకొక జాతీయ విద్య యున్నది. మనకొక జాతీయభాష యున్నది. అది యిది యని నిర్ధారణచేసి చెప్పగల విద్యాసంపన్నులు కావలెను. స్వతంత్ర పరిపాలనార్థ్మాత మనకెందుకో వివరించిన దేశభక్తులైన విద్యాధికులవలె వీరునూ మనకు కావలెను. తాము పవిత్రమని నమ్మిన భారతజాతీయ విద్యను, భారత జాతీయభాషను జంకుగొంకులు లేని రీతిలో తెలియజెప్పగల విద్యా సంపన్నులు మనకెందరో కావలయును. ఒకనాడు యీ సమస్య పరిష్కరించబడి మన యీ చిక్కులను తీర్చిదిద్దగల వివేకవంతులైన విద్యాధికులు మనకు లభించగలరనే విశ్వాసముతో జాతీయవిద్య, జాతీయభాష యిదియేనని నొక్కి చెప్పగల ధైర్యశాలురు కావలెను.

మన జాతీయభాష సంస్కృతము మన జాతీయ విద్య సంస్కృతములో నున్నది మన భాషను మనము గౌరవించి మననము చేయవలయును మన జాతీయవిద్యను మనము తెలుసుకొని మన దేశీయులకు దీనిలోని విశేషప్రాముఖ్యను వివరించి చెప్పవలయును. ఇందుకు చాల సాహసము కావలయును. ఈ కార్యము సామాన్యుల వలన సాధించబడునని చెప్పలేము.

సంస్కృతభాష మన జాతీయభాష యని నిరూపించబడువరకు నిద్రించని స్థిర చిత్తులైన శీలముగల వ్యక్తులు కావలయును. సంస్కృత భాషలోనే మన జాతీయ విద్యావిధానము యెలా రూపొందించబడి యున్నదో వివరించి చెప్పగల విశేష ప్రజ్ఞావిజ్ఞానములు గల విద్యావంతులు కావలయును. ప్రాచ్య, పాశ్చాత్య విద్యావిధానములను తరచి,వివేచించి యొందువలన సంస్కృతము మన జాతీయభాషగా గుర్తించవలయునో, యెందువలన మనము సంస్కృత విద్యనే జాతీయవిద్యగా రూపొందించుకొన వలయునో వివరించి చెప్పగల పండితులు కావలయును. స్వజాతీయాభిమానము, స్వభాషాభిమానము, స్వరాష్ట్రాభిమానము, స్వతంత్రతాభిమానమువిశ్వశ్రేయమనే భావమునకు యెలా విరుద్ధములు కావో విపులీకరించి చెప్పగల నేర్పరులు కావలయును. ఏనాడు యివి అన్నియూ మనకు సమకూరునో, ఆనాడే భాషాభావ దాస్యముల ప్రాభవముల నుండి బయటపడి స్వజాతీయ భాషాభిమానము స్వజాతీయ విద్యాభిమానము స్వజాతీయ ధర్మాభిమానాలు మనలో ప్రభవించి మన పురోగమనమునకు తోడ్పడి మనలోని మానవతా భావము వికసించుటకు దోహదము చేయును.

బిరుదప్రదానము

శ్రీ అయితం కాశీవరప్రసాదరాయకవి

౩

తరణి వచ్చువఱకుఁ దారకేశ్వరు కాంతి ప్రభువు వచ్చువఱకు బంటు రీవి
తండ్రి వచ్చువఱకుఁ దనయుని దంభంబు పట్టవలదు తప్పు; భర్త వీవు.

తప్పొనరించితి నొప్పితి నొప్పినిఁ బడినాఁడ సార్వ్య నొప్పించుటచేఁ
సిప్పనికిఁ క్షంతవ్యుఁడ నప్పావినుమీ! కథలను నాధునికములన్.

అగతికంబైన సాహిత్య జగతినేఁడు
అంబువుల వెల్తియైన ఘటంబు సుమ్ము
నిక్కనీల్గుచు నెగురుచు వెక్కిరించు
కుకవి లోకాల్ప జీవన ఘోషమిద్ది.

నేటి కవులయందు నిస్సారశేముషి
పెక్కుచోట్ల నెగడి పిక్కటిలుట
బిరుదు లేకయున్నఁ బిఱుదులు బలియవు
పిఱుదు బలియకున్న విలువలేదు.

వ్యాసవాల్మీక కాళిదాసాది సుకవి
జాలమైనను తమకును చాలవండ్రు
వారి దారినిఁ 'బోకుండువాఁడనేని
యశము నాకేడ! అనుకొంటినయ్య సైఁపు.

నన్నయ తిక్కనాది కవినాథు లొసంగిన శక్తి సంపదన్
గన్నకవుల్ కృతఘ్నులయి కాదనియందురు తత్పథంబులన్
తన్నియమప్రకారములఁ దద్గుణభంగులి; నట్టి నేటి యూ
పన్నతఁ దెన్ను వీడిచను పన్నగ మట్టుల దారిఁ దప్పితిన్.

ధరణి ధరాశ్రయంబిచట దారిని దప్పిన భోగిపంక్తికే
కరము శరణ్యమయ్యె నటు గాదను నట్టి కవీంద్రుఁ డాత్మ వా
క్పరమశతార మెత్తగల భద్రరమా బలశాలిగాఁడు భూ
ధరతతి హేమమీదు సుపథంబుల సత్కవి చక్రవర్తికిన్.

తెలుఁగెలుఁగియు సుకవుల క
న్నొలుఁగఁ గ నశ్వర మెఱుఁగని భూపకసభలన్
నెలు బిరుదములుగల కవినని
చెలుఁగున్యాచంగఁ దప్పుఁ జేసితిఁ దండ్రీ.

బిచ్చమిచ్చెను వాజ్మయ పృథివి యందు
జేదకవులకుఁ గవిరాజ వితతులెల్ల
వారి శక్తులు మావాక్య పాటవములు
హస్తిమశకాంతరములంచు స్వాంత మెఱుఁగు.

కండల్పెంచగఁ దల్లి పాలు కడువేడ్కం ద్రాగియుం గ్రూరుఁడై
దండిం గుండెలు గ్రుద్దు పాపినంయితిన్ దాక్షిణ్యముం బూనినా
యండన్వాజ్మయ దుగ్ధభాండమిడి స్వర్గాస్థానముం గొన్న యు
ద్దండ ప్రాభవ పూర్వ సత్కవులచేతం నేను హింసించుటన్.

బిరుదమందినఁగాని ధరణీశ సభలందు
బ్రహ్మకేనియు గౌరవంబు లేదు
పదవియుండిన గాని ప్రస్తుత జగతిలో
వాల్మీకి కేనియు వసతిలేదు
ధనమున్న నేగాని జననధారుణిఁ గూడ
వ్యాసునికైనను వ్యాప్తి లేదు
స్తుతి చేసిననుగాని గతిలేని యీ భువి
నీ కేనియును గాని నిల్వఁగాదు

తొలుత బిరుదంబు గలుగ నావలను బదవి
ధనము సర్వంబుఁ గలిగెడు దారియగుటఁ
దలచినాఁడను బిరుద విధానమిందు
దోసమున్నది; యొప్పితి దోసిలొగ్గి.

కౌటిల్యార్థశాస్త్రమ్

ఆంధ్ర వివరణము

శ్రీ విడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి

వాటివలన గలుగుహాని,ఇవి శత్రువులకున్న యెడల తాను చేయదగిన పని మొదలగునవి యిందుగలవు. (3) పురుష వ్యసనవర్గము, కామక్రోధాదులచే గలుగు వాక్పారుష్యము దండపారుష్యము, వేట, పానము,స్త్రీ వ్యసనము మొదలగు వాటివలన గలుగు ననర్థములు, తారతమ్యము మొదలగునవి యిందు విమర్శింపబడినవి. (4) పీడనవర్గము, స్తంభవర్గము, కోశసంగవర్గము అను 3 విషయములు ఒక అధ్యాయమునందే చూపబడినవి.అగ్నిభయము, జలభయము, రోగము, దుర్భిక్షము మొదలగునవి దైవికముగ పీడించునవి ఇవిగాక రాజకీయోద్యోగులు ప్రజలను, ప్రజలలో బలవంతులు దుర్బలులను పీడింతురు. ఇట్లు రాజ్యమునందలి ఏ విషయములందు ఎవరెవరు ఎట్లు ఇతరులను పీడించునదియు, పీడనవర్గము వివరింపబడినది. స్తంభింపచేయుట అనగా అడ్డు తగులుట స్తంభనము. దీనిని చేయువారు స్తంభవర్గము. ధనాగారమునుండి ధనమును వ్యయముచేయుటకు కారణమైనవారు కోశసంగవర్గము. వారిందు సూచింపబడిరి. (5) బలవ్యసనవర్గము, మిత్రవ్యసనవర్గము ఐదవ అధ్యాయమున గలవు. సైనికులకు గలుగు చిక్కులు, వాటిని నివారించుట, మిత్రులకు గలుగు చిక్కులు, వాటికి ప్రతీకారము ఇందు వివరింపబడినవి. ఇది వ్యసనాధికారికమగు ఎనిమిదవ యధికరణము.

మూ. శక్తి దేశకాల బలాబలజ్ఞానం । యాత్రాకాలాః । బలోపాదానకాలాః । సన్నాహగుణాః । ప్రతిబల కర్మ । పశ్చాత్కోపచింతా । బాహ్యాభ్యంతర ప్రకృతి కోపప్రతీకారః । క్షయవ్యయలాభ విపరిమర్శః । బాహ్యాభ్యంతరాశ్చాపదః దూష్యశత్రు సంయుక్తాః అర్థానర్థ సంశయయుక్తాః । తాసాముపాయ వికల్ప జాస్సిద్ధయః। ఇత్యభియాస్యత్కర్మనవమమధికరణం॥

తొమ్మిదవ యధికరణమున అభియాస్యత్కర్మ వివరింపబడినది. అభియాస్యత్తు అనగా పరదేశముపై దండెత్తువాడు. అట్టివాడు చేయదగిన పనులు ఇందు గలవు. (1) శక్తిదేశ, కాలబల అబలజ్ఞానం, యాత్రాకాలము, సేన, ధనము ప్రభుశక్తిలోనివి.మంత్రశక్తి, ఉత్సాహశక్తి ఈ మూడు శక్తులయొక్క వివరము తారతమ్యము ప్రాధాన్యము, ఏదేశము యుద్ధము చేయుటకు యుద్ధమునకు వెళ్లుటకు తగినది ఏకాలము యోగ్యము. తనయొక్క శత్రువుయొక్క బలాధిక్యము, దౌర్బల్యము వీటి నెరింగి చేయదగినపని. యుద్ధ యాత్రాసమయము ఇందు వివరింపబడినవి. (2) సేనలోని భేదములు ఆయా సేనలను సేకరించు కాలములు ఒక్కొక్కసేనచే యుద్ధయాత్ర చేయుటవలననగు ప్రయోజనములు, ఏ యే శత్రుబలములకు తన బలములో ఎట్టి బలముల నుపయోగింపవలయును? ఈ విషయము లిందు వివరింపబడినవి, (3) కార్యమైన పిమ్మట కోపము సంబంధించిన విచారణము ఆంతరంగికులపై కోపము, వెలుపలివారిపై కోపము వాటి ప్రతీకారము ఎవరియందు ఎపుడు ఎట్లు ఆగ్రహము చూపవలెనో ఆ విషయము వివరింపబడినది. (4) క్షయమనగా నేమి? వ్యయమనగానేమి? ఆ క్షయవ్యయములు గలుగుటకు కారణములు. వాటి నివారణోపాయములు లాభము గలుగుటకు కారణములు, వాటి యుపాయములు వివరింపబడినవి. (5) బాహ్యములు ఆభ్యంతరములగు నాపదలు, సంధివిగ్రహాది నిర్ణయములను సంరక్షింపకపోవుటచే

పరరాష్ట్రీయులవలనను స్వరాష్ట్రీయులవలనను గలుగు ఆపదలు, ఆ ఆపదలు గలుగు కారణములు నివారణోపాయములుగలవు. (6) దూష్య శత్రుసంబంధులు. దుష్టమైన ప్రవర్తనగలవారు అనగా సహజముగాపరాపకారమే ప్రధానకృత్యముగ గలవారు దూష్యులు. విరోధముగలవారై అపకారముచేయు సంకల్పము గలవారు శత్రువులు. ఈ దూష్యులతోడను శత్రువులతోడను కలసినవారు దూష్య శత్రుసంబంధులు. వారిని గనుగొని నిగ్రహించుట యిందుగలదు. (7) ప్రయోజనముగలకార్యములు. అనర్థకరములగు కార్యములు, సంశయముగల కార్యములు ఆ కార్యముల భేదములు, ఆ కార్యములకు ఉపాయముచేతను గలుగు సిద్ధులు, వికల్పముచే గలుగు సిద్ధులను ఇందు వివరింపబడినవి. ఇట్లు 7 ప్రకరములుగల అభియాస్యత్కర్మ యను తొమ్మిదవ యధికరణము

మూ॥ స్కంధావారనివేశః । స్కంధావార ప్రయాణం । బలవ్యసనావస్కంద కాల రక్షణం । కూటయుద్ధ వికల్పాః । స్వసైన్యోత్సాహనం । స్వబలాన్య బలవ్యాయోగః । యుద్ధభూమయః । పత్త్యశ్వరధ హస్తికర్మాణి । పక్షకక్షోరస్యానాం బలాగ్రతో వ్యూహ విభాగః । సారఫల్గు బల విభాగః । పత్త్యశ్వరధ హస్తియుద్ధాని । దండభోగ మండలాసంహత వ్యూహనం। తస్య ప్రతివ్యూహస్థాపనం । ఇతి సాంగ్రామికం దశమమధికరణం.

పదియవ యధికరణము సాంగ్రామికము. అందు ప్రకరణము స్కంధావార నివేశము. యుద్ధసమయములందు కాల్బలము, అశ్వికదళము మొదలగు ఆయా బలములను వేరు వేరుగ నుంచవలసిన తీరు. యుద్ధపరికరములను భద్రపరచు విధానము, వారి వారికి చేయవలసిన రక్షణోపాయములు మొదలగు విషయము లిందు గలవు (2) స్కంధావార ప్రయాణము, బలవ్యసనావస్కంద కాలరక్షణము. సైన్యమును యుద్ధమునకై నడిపించునపుడు సైన్యమునందలి బలములను కాపాడుకొనవలెను. సైన్యమునకు గలుగు చిక్కులను రాకుండ రక్షించవలెను. ఏవైపునుండియైనను శత్రువులవలన పీడ గలుగకుండ చూడవలెను. పర్వతాది కాలికకష్టములు గలుగకుండ చూడవలెను. ఇవి మొదలగు విషయములు ఇందు వివరింపబడినవి (3) కూటయుద్ధ వికల్పములు. తన సైన్యమును ప్రోత్సహించుట, తన బలముపట్లను శత్రుబలముపట్లను గలుగ చేయవలసిన యభిప్రాయములు, వాటి మార్గములు, న్యాయమును విడచి మాయికముగ యుద్ధముచేయు సమయములు, అట్టి యుద్ధములుచేయు పద్ధతులు విపులముగ వివరింపబడినవి. న్యాయమును విడచిచేయు యుద్ధములే కూటయుద్ధములు. (4) యుద్ధప్రదేశములు, రధములు, ఏనుగులు, గుఱ్ఱములు కాల్బలములు చేయదగిన పనులు (5) వ్యూహనిర్మాణము అందు అగ్రభాగమందు పార్శ్వమునందు భుజస్థానములందు జఘనస్థానమందు ఉరస్స్థానమందును సేనా విభాగవిన్యాస పద్ధతులు హీనబలమును అధికబలమును విభజించుట, అశ్వయుద్ధము గజయుద్ధము, పదాతియుద్ధము (6) దండవ్యూహము, భోగవ్యూహము, మండలవ్యూహము మొదలగు వ్యూహములుగ సేనలనుంచుట, శత్రువులు ఏర్పరచిన వ్యూహమునకు ప్రతి వ్యూహమును స్థాపించుట - మొదలగు నుపాయము లిందుగలవు. ఇది సాంగ్రామికమను పదియవ యధికరణము.

మూ॥ భేదోపదానాని. ఉపాంశుదండః. ఇతి సంఘవృత్తమేకాదశ మధికరణం.

(1) భేదము అనగా బ్రద్దలుచేయుట, అనగా విడదీయుట. సామదాన భేదదండములలో భేదోపాయము మూడవది. అట్టి భేదోపాయమును ప్రయోగించుటకు ఆధారములు, భేదోపాయ ప్రయోగపద్ధతి రహస్యముగ శిక్షించుట (గుప్తముగ సంహరించుట) ఒక ప్రకరణమే గలది పదునొకండవ యధికరణము

మూ॥ దూతకర్మ । మంత్రయుద్ధమ్ । సేనాముఖ్యవధః । మండల ప్రోత్సాహనం ।

శస్త్రాగ్ని రసప్రణిధయః , వీవ ధాసార ప్రసారవధః । యోగాతిసంధానమ్ , దండాతిసంధానమ్ , ఏకవిజయః॥ ఇత్యాబలీయసం ద్వాదశ మధికరణమ్.

పంద్రెండవ యధికరణము ఆబలీయసమనునది. బలవంతునితో విరోధము గలుగునెడ చేయవలసిన కార్యక్రమము ఇందుగలదు. (1) దూతకర్మలు. దుర్బలుడగు ప్రభువు నమ్రుడై యుండి దూతద్వారా చేయింపదగిన సంధిప్రయత్నము లిందు వివరింపబడినవి.(2) మంత్రయుద్ధము సంధిప్రయత్నము కొనసాగనిచో చెప్పదగిన వాక్యములు కొన్ని ఉపాయములు ఇందు గలవు. ఇది వాక్యయుద్ధమనియు మంత్రయుద్ధమనియు నిర్దేశింపబడినది. (3) సేనా ముఖ్యవధ, మండలప్రోత్సాహనమున్ను శత్రుసేనలో ముఖ్యుడగు వానిని సంహరించుటకును, శత్రువుయొక్క రాజకీయ బృందమును తిరుగుబాటు చేయుటకై ప్రోత్సహించుటకున్ను ఉపాయము లిందుగలవు. (4) శస్త్రములచేతను అగ్నిచేతను రసవిషాదులచేతను సంహరించు ఉపాయములును, ఆహార పశుగ్రాసాదులలో రసవిషాదికము చేర్చి సంహరించుట కుపాయములును ఇందుగలవు (5) యోగాతిసంధానము. రసవిషాది యోగములచే సంహరించుట, దండాతిసంధానము, ప్రచ్ఛన్నముగ ఆయుధాదులచే సంహరించుట, ఏకవిజయము - తానొకడే అనేక వేషములతో భయపెట్టుట కుపాయములును ఇందుగలవు. ఇది ఆ బలీయసమను పంద్రెండవ యధికరణము.

మూ॥ ఉపజాపః । యోగవామనం । అపసర్ప ప్రణిధిః , పర్యుపాసనకర్మ । అవమర్దః । లబ్ధప్రశమనం । ఇతిదుర్గలంభోపాయస్త్రయోదశ మధికరణం.

దుర్గలంభోపాయమను పదమూడవ యధికరణమున ఐదు ప్రకరణములు గలవు. (1) ఉపజాపము. రాజకీయులను తన పక్షమున జేరునట్లు ఆకర్షించుట కుపాయములు. ఇది భేదోపాయము (2) యోగవామనము. యోగశక్తులవంటి శక్తులుగల మహాయోగివలె నటించుచు మారువేషముతో శత్రుపక్షీయుల నాకర్షించుట. (3) అపసర్పప్రణిధి దొంగలవలె అడవులందు సంచరించుచు రాత్రులందు ప్రభుపక్షీయుల వచ్చి చేరి హాని కలుగజేయుట మొదలగు రహస్య కృత్యములచే, మారువేషములచే కార్యసాధనము చేయుట ఇందు వివరింపబడినది. (4) పర్యుపాసనకర్మ, అవమర్దము. మిత్రునివలె చేరి మైత్రితోనున్నట్లు నటించుచు పీడించు ప్రకారము లిందుగలవు. (5) లబ్ధప్రశమనము స్వాధీనమైన దేశమును తనయందు ప్రేమగల దానినిగ చేసికొనుట. ఇది దుర్గలంభోపాయమను పదమూడవ యధికరణము.

మూ॥ పరఘాతప్రయోగః , ప్రలంభనం । స్వబలోపఘాత ప్రతీకారః । ఇత్యౌపనిషదికం చతుర్దశ మధికరణం.

ఔపనిషదికమను పదునాల్గవ యధికరణమున విషాదుల నుపయోగించు విధానము వివరింపబడినది. (1) పరఘాతప్రయోగము, ఇతరులను చంపుటకై ప్రయోగములు (2) ప్రలంభనమునందు అద్భుతమును గలుగజేయుట. మోసగించుటకై ఆశ్చర్యమును గలుగచేయుట (3) ప్రలంభనమునందు భైషజ్య మంత్రయోగము, మోసమునందు మంత్రములను ఔషధములను ఉపయోగించుట. (4) స్వబలోపఘాత ప్రతీకారము. తన సేనలందు శత్రువు లుపయోగించిన విషాది ప్రయోగములకు ప్రతిక్రియ. ఇది ఔపనిషదికమను పదునాల్గవ యధికరణము.

మూ॥ తంత్రయుక్తయః తంత్రయుక్తిరిరి పంచ
దశ మధికరణం.

తంత్రమనగా శాస్త్రము ఈ శాస్త్రము నందలి పారిభాషికశబ్ద నిర్వచనము ఇందు సంగ్రహముగగలదు.

మూ॥ శాస్త్రసముద్దేశః పంచదశాధికరణాని
సపంచాశ దధ్యాయశతం స్సాశీతి ప్రకరణ
శతం షట్ శ్లోకసహస్రాణీతి॥

శ్లో॥ సుఖగ్రహణ విజ్ఞేయం తత్త్వార్థ
పదనిశ్చితమ్
కౌటిల్యేన కృతం శాస్త్రం విముక్తగ్రంధ
విస్తరమ్॥

ఇతి కౌటిలీయే అర్థశాస్త్రే వినయాధికారికే ప్రథమాధికరణే రాజవృత్తౌ ప్రథమోధ్యాయః॥

శాస్త్రసముద్దేశము 15 అధికరణములు, 150 అధ్యాయములు, 180 ప్రకరణములు 6 వేల శ్లోకములు గలది.

సుఖముగా గ్రహింపదగినది, సుఖముగ తెలియదగినది, యధార్థమైన (నిస్సందిగ్ధమైన) పదములచే నిశ్చయింపబడినదగు శాస్త్రము గ్రంథవిస్తరము లేకుండ సంగ్రహముగ కౌటిల్యునిచే చేయబడినది. ఇది కౌటిల్యుని అర్థశాస్త్రమునందు రాజవర్తనమగు వినయాధికారిక మను ప్రథమాధికరణమందు ప్రథమాధ్యాయము.

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు, వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు : నవభారతి
విజయవాడ-2

గోవిందరామాయణము

విశ్వామిత్ర శరణాగతి

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

దేశకాలజ్ఞు లౌవారు దేశికునకు
సమయమించుక మించకే శత్రురాక
తెలియఁజేయుము నీ యజ్ఞ దీక్షఁ బ్రోవ
ననిరి వినయమ్ము ముఖసీమలందుఁ బ్రబల.

బాలురు పల్కుమాటలు విభాసుర తీవ్రదృశాప్రచారముల్
లీలఁగ నా మునుల్ గని భళీయని వారల సంగరోత్సవ
శ్రీలను మెచ్చుచున్బదులు సెప్పిరిటుల్కుశికాత్మజన్మునిన్
బాలన సేయఁ జెల్లును జుమా యిదియే మొదలాఱు రాత్రులన్.

అతఁడు హుతాగ్నిహోత్రుఁడు నిజాత్మ సమర్పణ యోగమూని సం
తత ముని యయ్యెఁ బల్కఁడు నితాంతము మీరలె గావఁగా వలె
న్బతితులు రాక్షసద్వయము బల్మిని యజ్ఞము పాడుసేయఁగా
జతపడివచ్చి న ద్దురము సల్పిన వారణసేసి వారలన్.

మౌనుల పల్కులన్ విని సమాహిత చిత్తులు రామలక్ష్మణుల్
బూనిరి విండ్లు రేల్పవలు పూనికతోఁ గను మూయకుండ య
జ్ఞానలకుండ మున్మునిని నాశ్రయభూమిని గాపు కాచుచున్
ధ్యానపరాత్ముఁడైన కుశికాత్మజు జన్నము సాఁగుచుండఁగన్.

ప్రారంభమ్మొనరించి యాసరయు తీరంబందు నాత్మార్పణన్
ప్రారబ్ధమ్ము నశింప నీషణముల న్వారించి త్రోవన్భయా
కార స్తాటకయన్ మహాప్రకృతినిన్ ఖండింపఁగా జేసి యా
త్మారి ప్రాక్తన షట్కవాసనల నిత్యం బగ్నిలో వ్రేల్చెడిన్.

తొలినాఁడు స్త్రీ విద్య లలితరాముని కిడి
        దారేషణంబును దాఁటునాఁడు
మలినాఁడు నిజ ధనమా రాము నిడి మౌని
        తతికి ధనేషణ దాఁటునాఁడు

మూఁడవనాఁడు స్త్రీ మొలియింపఁగాఁ జేఁసి
 తనయేషణమ్మునుఁ దాటునాఁడు
నాలవనాఁడు ప్రాణ ప్రదానములిచ్చి
 తాతకు కామంబు దాఁటునాఁడు

పూని క్రోధమ్ము లోభమ్ము మోహములను
మదముమాత్సర్య వాసనల్ మంటఁగలుపఁ
గ్రమముగా నైదు దినములు గాధిసుతుఁడు
యజ్ఞవేది మహోజ్జ్వల మయ్యెనల్లె.

పూవుల కమ్మతావి పరిపూత మొనర్చెడి యాశ్రమస్థలిన్
దీవెనలిచ్చి ఋత్విజులు దీర్తురు సద్విధులెల్ల నిత్యమున్
పావనమూర్తి కౌశికుఁడు పాసినవాడు సమస్త ధర్మముల్
దైవమె పో శరణ్యుఁడని తగ్జితుఁడాయె సమస్త ధర్మముల్.

ఆఱవనాఁడు నేఁడు వికృతాత్ములు యజ్ఞపు విఘ్నకార లి
ట్లూరక యుందురంచుఁ దలఁపూనఁగరాదు హతాజ్జవంబుగన్
గాటియవెట్టఁ జూచెద ఱొకానొక వేళ సుమిత్రపుత్ర యీ
వారము గాచినన్ విజయవంతుఁడు సిద్ధుఁడు కౌశికుండగున్.

అచ్చపు భక్తిని గురునెడ నెచ్చరికను జేయు రాముఁడిటుగన్ దమ్మున్
జెచ్చెఱ రాక్షసులెందఱో వచ్చిరి సవనాగ్ని రుధిర పాతము సేయన్.

ఘోర ప్రావృషమేఘ వేగగతి నిర్ఘోషమ్ముతో మింటిపై
మారీచుండు సుబాహుఁడున్ దమచమూ మాయన్ప్రతిష్ఠించుచున్
బోరన్జొచ్చిరి రక్తవర్ణమున సంపూర్ణాహుతిం బావకుం
డౌరౌరా యని మిన్నుముట్టెఁద్రుటిలో నాకాశ మల్లాడెడిన్.

ధారాపాతము గాఁగ వేదిపయి రక్తంబడ్డు, రాముండహో
క్రూరా! నిల్వుము నిల్వుమీ యనుచు నాక్రోశించి మారీచుపైఁ
బాఱన్గొట్టఁగ మానవాస్త్రమున నప్పాపాత్ము ఢస్త్రమ్ముచే
బాణాన్వేషితయోజనమ్ము మునిఁగె న్వారాశి నిశ్చేష్టుఁడై.

అరరే లక్ష్మణ మానవాస్త్రమదె ప్రాణాపాయముం గూర్ప కా
సురునిన్ వార్నిధి ముంచి వీడెనుదయన్ సుశ్లోక్య మయ్యస్త్ర మం
చరి వీరుండు సుబాహు నిగ్గనుచు నయ్యాగ్నేయ దివ్యాస్త్రమున్
గురిగాఁ గొట్టగ నప్డె రక్కసుఁడు బల్ క్రూరుండు గూలెన్భువిన్.

తక్కుమఖ విఘ్నకారులఁ దటిమితటిమి
మడియఁ జేసె వాయవ్యాస్త్ర మహిమచేత
దశరథేయుఁడు బాలుండు తండ్రియాన
మునులు దివిజులు లోకముల్ మురియునట్లు.

రారా రామనృపాల బాలసుకుమారా! వీర! నీ లీలతో
రౌరా యేరికెఱుంగ శక్యమగురా; రా జీవనేత్రా! కరం
బీరా ముద్దిడరార కౌఁగిలిడరా యే సర్వమర్పించితిన్
జేరందీయుమురా త్వదీయ పదముల్సేవించు ధన్యుండరా.

అనుచన్వీడి సమాధి సిద్ధుఁడయి రామాలింగనం బొంది, మో
మును మోమున్ గలవేసి మైనిమురుచున్ ముద్దాడుచున్ రామునిన్
దనయంకంబునఁ జేర్చి మైపులకతో ధన్యోస్మి ధన్యోస్మి యం
చనె నానంద సుధామయుండయిన విశ్వామిత్రుఁ డప్పట్టునన్.

గురునాజ్ఞన్నెరవేర్చి తీ విపుడు లోకుల్మెచ్చ సార్థక్యముల్
వరల న్సిద్ధతపోవనమ్మిఁక ముని వ్రాతమ్ము జేజేలనన్
బరగన్దిక్కులు శాంతివంతమయి బీభత్సంబు వోవ న్దయా
కర యవ్యాజ కృపన్ననున్ మనిపి తింకన్ నాకు లోటున్నదే.

కడుపారంగని పెంచి సన్నిహితయౌ కౌసల్య ధన్యాత్మయో,
యడవింద్రిమ్మరఁ జేసి సద్గురుఁడునై యాత్మార్పణంబూని భ
క్తుఁడు శిష్యుండునునై తరింపగల సిద్ధుండీ మునీంద్రుండు ధ
న్యుఁడో వీరల్హరిఁ గౌగిలింపఁగల పూజ్యుల్సంత తానందులై.

వనితారత్నము కోసలాత్మజయు విశ్వామిత్రుఁడున్ ధన్యులౌ
టను రామున్నరవేష కేశవుని నీడన్గొంత సేపుండి యీ
కనులన్గాంచుచు ముచ్చటల్సలిపి వాక్మాధుర్యముం గ్రోలుచున్
జనవుంగొంటిమి వీనిఁ గౌగిలి బిగించనోచితుమే యెన్నడేన్.

లేరిక శాత్రవుల్మిగులు వేదిఁక జన్నముకౌశికుం డహం
కారము నద్దిఁద్రోసి మమకారము జంపి సమస్త ధర్మ సం
హారము సేసె వేరితరులంచని రాముని రక్షనొంది యే
కోరిక లేనినాడు సమకూరదె యుత్తమమోక్ష సిద్ధియున్.

యమనియమాది వేద్యుఁడు మహాత్ముఁడుగూడఁ దరింపలేఁడు కా
మ్యములను వీడి నిత్యశరణార్థుఁడు గాకయె యుత్తరా
ఘముదరిజానిపోయి హరికాపున దవ్వులకేఁగ పూర్వ పా
పము నశియింపఁ గౌశికుఁడు పావనుఁడై జ్వలియించె సిద్ధుఁడై.

రాచకొమారు వీరు రఘురాము మఖారులఁ జంపదెచ్చి లో
దాచక వైరము న్నదతి తాటక జంపఁగఁజేసి నేఁడు మా
రీచు వధింపుమంచతని ఱేని సుతున్మని గోరలేదు య
జ్ఞాచరణమ్ము నన్యమత మబ్బి పరాశ్రయ సిద్ధిఁబొందుటన్.

మునితతి కడు ముచ్చటగాఁ దనివోవక యజ్ఞరీతి తలఁచుచు నిటుగా
గనుచు న్విశ్వామిత్రుని ఘనవర్ణునిఁ గాంచి కల్యాణమనున్.

అంతటఁ దథాస్తటంచని యవని యెల్ల
మాఱుమ్రోగెను రాఘుని మహిమఁ గాంచి
సహన మిసుమంత లేక నిశాసతీశుఁ
ఖిల్వఁబోయెన యను రీతి వెడలెనంత.

విరుద్ధద్రవ్యము

(ANTI – MATTER)

శ్రీ వసంతరావు వేంకటరావు


ప్రకృతిని పరిశీలిస్తూన్నకొద్దీ క్రొత్త విషయాలు బయల్పడుతునే ఉన్నాయి. ద్రవ్యనిర్మాణ సందర్భంలో వెలువడుతూన్న విషయపరంపర దానికి తార్కాణం. ద్రవ్యమెట్లున్నదీ అను ప్రశ్న ప్రాచీనవేదాంతులను బాధించింది. ప్రాయోగిక విధానాలకు ప్రాముఖ్యంలేని ఆ కాలంలో కేవలం యుక్తియుక్తంగా మాత్రమే ఆ ప్రశ్నను సాధింపపూనుకొన్నారు. భారతీయులు, గ్రీకులు, రోమనులు మొదలైన వివిధదేశ తాత్త్వికులు, ఎవరిబుద్ధికి తోచినట్లు వారు, ద్రవ్య నిర్మాణంగురించి చర్చించి కొన్ని ప్రతిపాదనలు చేసేరు. నాటినుండి పరమాణుభావంమాత్రం ప్రతిపాదితమై యుంది. ద్రవ్యమంతా పరమాణువుల మయమనీ, ద్రవ్యంలో పరమాణువే సూక్ష్మతమమైన కణమనీ, అది కరినమైనదనీ, బ్రద్దలుకాదనీ భావించేవారు. కాని, ఆ భావాల సత్యాన్ని నిరూపించడానికి వారెట్టి ప్రయత్నాలూ చేసినట్లు కనిపించదు.


గత రెండు శతాబ్దాలలో అనేక శాస్త్రాలనుండి వెలువడిన జ్ఞానాన్ని పురస్కరించుకొని పరమాణువుయొక్క స్వరూప స్వభావాలను నిర్ణయించగల అవకాశం కలిగింది. పరమాణువు దృఢమైన ద్రవ్యఖండంగాదు. దానికొక ప్రత్యేక నిర్మాణముంది. గ్రహపరివేష్టితుడైన సూర్యునివలె పరమాణువును ఈనాడూహించుకొంటున్నారు. పరమాణునిర్మాణంలో పాల్గొనే ప్రాథమిక కణాలు మూడు రకాలు. అవి ప్రోటాను ఎలక్ట్రాను, న్యూట్రాను. వీటిలో ధనావేశంగల కణం ప్రోటాను, ఋణావేశంగలది ఎలక్ట్రాను, ఆవేశమేలేని తటస్థమైన కణం న్యూట్రాను విద్యుదావేశంలో ప్రోటాను ఎలక్ట్రాను సమానమే కాని, బరువులో మాత్రం ఎలక్ట్రానునకు సుమారు 1850 రెట్లుంది ప్రోటాను. న్యూట్రానుకూడ ప్రోటానంత బరువున్న కణమే ప్రతి పరమాణువులోను ప్రోటానులు, న్యూట్రానులు చేరి సూర్యమండలంలో సూర్యునివలె మధ్యనున్నాయి. అదే కేంద్రకం(nucleus). బరువంతా కేంద్రకంలోనే ఉంది. దానిచుట్టూ గ్రహాలవలె తిరుగుచున్నాయి ఎలక్ట్రానులు. ప్రతిపరమాణువు తటస్థమైన కణం, అందుచేత కేంద్రకంలో ఎన్ని ప్రోటానులుంటే అన్ని ఎలక్ట్రానులు దానిచుట్టూ కక్ష్యల (orbits) లో తిరుగుతున్నట్లు భావన అన్నిటిలో స్వల్పమైనది ఉదజని పరమాణువు. దానిలో ఒక్క ప్రోటాను కేంద్రకమైయుండగా దానిచుట్టూ ఒక్క ఎలక్ట్రాను తిరుగుతూంది. ఇవి మన మెరిగిన పరమాణువుల లక్షణాలు.

ప్రకృతియొక్క సారళ్యంలోను సౌష్ఠవంలోను విజ్ఞానికి అపారమైనవిశ్వాసముంది విజ్ఞాని చేతిలో గణితం అనే శక్తిమంతమైన పనిముట్టు ఉంది. ఒకే ఆవేశంగల ఎలక్ట్రాను ప్రోటానుల బరువులలో ఎందుకంత వ్యత్యాసముండాలను ప్రశ్న బయలుదేరింది. సుఘటితమైన ప్రకృతిలో ఇట్టి వ్యత్యాసానికి తావులేదు. అందుచేత, గణితాన్ని వినియోగించి ఈప్రశ్నకు సమాధానాన్ని అర్ధించేడు. అప్పుడు, ఎలక్ట్రానంత బరువున్న ధనకణం, ప్రోటానంత బరువున్న ఋణకణం కూడా ప్రకృతిలో ఉండితీరాలని తెలియవచ్చింది; వాటికై తీవ్రమైన శోధన ప్రారంభించేరు. 1932 లో ఒక కణం బయల్పడింది. అది ఎలక్ట్రానుకి విరుద్ధమైన కణం దానిని "పోసిట్రాను" అన్నారు. ఎలక్ట్రానుయొక్క ప్రతిరూపమే పోసిట్రాను. ఎలాక్ట్రానుకి ఋణావేశముంటే పోసిట్రానుకి ధనావేశముంది అంతకంటె వాటిలో ఇంకెట్టి వ్యత్యాసము లేదు అదేవిధంగా ప్రోటానంత బరువుండి

ఋణావేశంగల కణం, 'విరుద్ధప్రోటాను' (**Antiproton**) దానిని 1955 లో పరిశోధనాగారంలో చేస్తూన్న ప్రయోగాలలో గుర్తించేరు. దానినే విజ్ఞాని మాక్స్‌బోర్న్ 'నెగట్రాను' అన్నాడు.

సామాన్య ద్రవ్యపరమాణువైన ఉదజనిలో ఒక ప్రోటాను కేంద్రకం; దానిచుట్టూ ఒక్క ఎలక్ట్రాను తిరుగుతుందని గమనించేము. విరుద్ధ కణాలతో ఏర్పడిన "విరుద్ధఉదజని" (**anti hydrogen**) పరమాణువునైతే ముండవచ్చు. అట్టి పరమాణువులో విరుద్ధప్రోటాను కేంద్రకంకాగా, దానిచుట్టూ పోసిట్రాను తిరుగుతుంటుంది. చిత్రం ౧ లో సామాన్య ద్రవ్యం, విరుద్ధద్రవ్యం - ఉదజని పరమాణువులుమాత్రమే చూపబడ్డాయి. విరుద్ధద్రవ్యం విశ్వంలో నుండవచ్చును. కాని అది సామాన్యద్రవ్యం దగ్గరికి వచ్చినప్పుడు ఆ రెండు ద్రవ్యఖండాలు నాశనమై శక్తి జనిస్తుంది.





న్యూట్రాను తటస్థమైన కణంకదా, దానికి కూడా విరుద్ధమైన ప్రతికణం ఉండవచ్చునని విజ్ఞానులు భావిస్తున్నారు. ఋణావేశానికి విరుద్ధమైన ధనావేశమంటే అర్థమౌతుంది. కాని తటస్థకణ విషయంలో విరుద్ధకణాన్ని ఊహించుకొనే మార్గమొక్కటే ఉంది. ఆ వైరుధ్యం న్యూట్రానుయొక్క ఆత్మభ్రమణ దిశలో గోచరించాలి. విశ్వంలో ప్రతి ఖగోళమూ, ప్రతి పరమాణువూ తనలో తను ఆత్మభ్రమణం చేస్తూంది. అదొక ధర్మం. అట్టితరి కొన్ని న్యూట్రానులు సవ్యంగా ఆత్మభ్రమణం చేస్తూంటే మరికొన్ని అపసవ్యంగా ఆత్మభ్రమణం చేయవచ్చును. అట్టి విరుద్ధ కణాలు చిత్రం ౨ లో చూపబడ్డాయి. ఒకటి న్యూట్రానైతే రెండవది విరుద్ధ న్యూట్రాను అవుతుంది. ఆ రెండు కణాలు ఒకదానినొకటి సమీపించినప్పుడు, ఢీకొని, నాశనమై శక్తిగా మారిపోతాయి.

నక్షత్రాలలోనున్న మూలపదార్థాలను గుర్తించడానికి నక్షత్రకాంతియొక్క వర్ణపటం (**Spectrum**) సహాయపడుతుంది.

మండుతూన్న ప్రతి మూలతత్వమూ దానికి ప్రత్యేకమైన రేఖలను వర్ణపటంలో కలిగిస్తుంది. ఉదాహరణకు; ఉదజని యొక్క వర్ణపటంలో కొన్ని రేఖలు కొన్ని ప్రత్యేకస్థానాలలో నుంటాయి. ఉదజని పరమాణు కేంద్రకం చుట్టూ తిరుగుతూన్న ఎలక్ట్రాను ఒక కక్ష్యనుండి వేరొక కక్ష్యకు గెంతడమే వర్ణపటరేఖలు కలుగడానికి కారణమని విజ్ఞానులు చెప్తారు. ఆకాశ కుహరాలలో ఏప్రదేశంలోనైనా విరుద్ధద్రవ్యముంటే, విరుద్ధ ఉదజని పరమాణువులో నున్న విరుద్ధప్రోటాను చుట్టూ తిరుగుతూన్న పోసిట్రాను కక్ష్యలలో గెంతడంవల్ల విరుద్ధ ఉదజనియొక్క వర్ణపటం ఏర్పడుతుంది. ఆ వర్ణపటరేఖలు కూడా సామాన్య ఉదజని వర్ణపట రేఖల వలెనే ఉంటాయి. ఆ రెండింటికి ఎట్టి వ్యత్యాసముండదు. అందుచేత, వర్ణపటమాపనంవల్ల ఏది ద్రవ్యమో ఏది విరుద్ధద్రవ్యమో నిర్ణయించే అవకాశంలేదు.

ఏరెండు విరుద్ధకణాలు దగ్గరగా వచ్చినప్పటికీ అది క్షణంలో విస్ఫోటంచెంది శక్తిగా మారిపోతాయి. అందుచేతనే మన సమీపంలో పోసిట్రానులుగాని, విరుద్ధప్రోటానులుగాని విడిగా కనిపించవు. పోసిట్రానులు కాస్మిక్ కిరణాలలో జనిస్తాయి. విరుద్ధ ప్రోటానుల జననాన్ని బలమైనయంత్రాలలో గుర్తించేరు. కాని, పోసిట్రానులు విరుద్ధ ప్రోటానులు ఎందుకు కరవైపోయినాయో చెప్పలేము. విరుద్ధద్రవ్యాన్ని గుర్తించడానికి ఒకే మార్గముంది. విరుద్ధద్రవ్యంతో ఏర్పడిన నక్షత్రాలు ఆకాశంలో ఎక్కడైనా ఉండి, అవి ఎప్పుడైనాసామాన్య నక్షత్రాల సమీపానికి రావడం సంభవిస్తే ద్రవ్యం శక్తిగా మారిపోయి ఊహాతీతమైన స్ఫోటం కలుగుతుంది. అట్టి సందర్భాలనుపరిశీలించాలి.

మన పరిశోధనాగారాలలోనే విరుద్ధ ప్రోటానులను పోసిట్రానులను అనుకూలంగా సమ్మేళనం చేసినట్లైతే విరుద్ధ ఉదజని జనిస్తుంది. దానిని సామాన్య ఉదజనితో కలిపినప్పుడు ద్రవ్యం శక్తిగా పరివర్తన మొందుతుంది. విరుద్ధకణాలేకాక, విరుద్ధ న్యూట్రాను ఏ ప్రోటానుతోగాని సంయోగించినప్పటికి ద్రవ్యనాశనమే సంభవిస్తుంది. అందుచేత విరుద్ధకణాలను భద్రపరచడం కష్టతరమని చెప్ప నక్కరలేదు.మునుముందు మన పరిశోధనాగారాలలోనే విరుద్ధద్రవ్యాన్ని సృష్టించ గలరేమో. అసాధ్యమనుకొన్న 5 మిలియను డిగ్రీల తాపక్రమాన్ని 'జీటా' అను యంత్రంలో సృష్టించ కలిగేరు. అంతతాపక్రమానికి ద్రవ్యం భస్మమైపోవాలి. కాని, అయస్కాంతబలరేఖలతో ఏర్పరచిన అదృశ్య పాత్రలో ఆ విపరీత తాపక్రమాన్ని బంధించేరు.

విరుద్ధ ద్రవ్యాన్నే మనం సృష్టించ కలిగిగిన నాడు విధ్వంసక సామర్థ్యం సహస్రాధికంగా పెరుగుతుంది. పరమాణుబాంబులో యురేనియం పరమాణువులను భగ్నంచేసి అపారమైన శక్తి విడిపిస్తున్నారు. ద్రవ్యంతో విరుద్ధ ద్రవ్యాన్ని కలిపిన మాత్రాన అంతకెక్కుడుశక్తి జనిస్తుంది. ఉదజని విరుద్ధ ఉదజని వేర్వేరుగా నుంచిన బాంబులో ఆ రెండిటిని దగ్గరకు తేగానే విస్ఫోటం కలిగి, పరమాణు బాంబుకి వేయిరెట్లు నాశక సామర్థ్యంగల శక్తి విడివడుతుంది. ఈవిరుద్ధ ద్రవ్యం గురించి యోచించినకొద్దీ శరీరాన్ని పులకరింపజేయు విషయాలు బయల్పడుతునే ఉంటాయి. కాని, సహజీవన భావానికి వశమౌతున్న మానవుడు నిర్మాణాత్మకంగా శక్తిని వినియోగిస్తాడని ఆశించగలం.

ఆర్యుల యాదినివాసము

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

ఆర్యులుపైనుండి భారతదేశమునకు వచ్చినారను సిద్ధాంతము సత్యదూరమగుటయే కాక శ్రుతిస్మృతీతిహాస పురాణసంస్కృతికి ప్రభలాఘాతమగుటచే దీనిని విమర్శించుచు బహుపత్రికలలో నేను వ్యాసములను రచించుట సంభవించినది. ఈవిషయముపై శ్రద్ధగలవారు గమనింపదగిన మరికొన్ని యంశముల నీ వ్యాసమున పొందుపఱచుచున్నాను.

మేధావులనేకులార్యులుపైనుండి వచ్చినారను సిద్ధాంతమును ఖండింపవలసిన యావశ్యకతను గుర్తించిరి. శ్రీ స్వామి వివేకానందులు **"East and west"** అను గ్రంథములో నీ సిద్ధాంతమును నిరసించిరి. సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసులు, అలహాబాదు విశ్వవిద్యాలయమునకు ఒకప్పుడు వైస్‌చాన్సలర్‌గా నుండిన శ్రీ గంగానాథఝా బ్రహ్మర్షిదేశము ఆర్యుల జన్మభూమియని నిరూపించియున్నారు. శ్రీ డి. ఎస్. త్రివేది దేవికానదీతీరమును ఆర్యుల జన్మభూమిగా నిర్దేశించిరి. ఉత్తరప్రదేశ ముఖ్యమంత్రి డాక్టర్ సంపూర్ణానంద 'ఆర్యోంకా ఆది దేశ్' అను గ్రంథములో భారతీయవాదమును బహుప్రమాణములచే నిరూపించిరి. ఆంధ్రులలో శ్రీ నడింపల్లి జగన్నాధరావుగారు ఆంధ్ర మహాసామ్రాజ్యము. **The Age of the Mahabharata war** అను గ్రంథములలో భారతదేశ సిద్ధాంతమును సమర్థించిరి. శ్రీకోట వెంకటాచలముగారు బ్రహ్మాండ సృష్టివిజ్ఞానము మున్నగు ననేక గ్రంధములలో భారత సిద్ధాంతమే సరియైనదని నిరూపించిరి. శ్రీ రాజా వెంకట రంగయ్యప్పారావుగారు (నూజివీడు) **History of Aryans from the creation, Ancient History of Bharata varsha** అను గ్రంథములలో భారతవాదమునే సమర్థించిరి; ఇటీవల శ్రీ కోపల్లి శివకామేశ్వరరావుగారు భాషాసాదృశ్య శాస్త్ర దృష్టితో-భారతేతర సిద్ధాంతమును ఖండించుచు, భారత సిద్ధాంతమును సమర్థించుచు **The Aryan Home** అను గ్రంధమును రచించిరి.

ఈరీతిగా ఆనాటికానాడు విమర్శలు జరుగుచున్న కొలదియు భారతదేశమే యార్యుల యాదినివాసమను సిద్ధాంతము బలపడుచున్నది. కాని 150 సంవత్సరముల క్రిందట కొందరు పాశ్చాత్యులు ప్రతిపాదించిన సిద్ధాంతమే విశేషముగా నేడు విద్యార్థుల పాఠ్యపుస్తకములలో ప్రసిద్ధముగా కన్పట్టుచున్నది. ఈ పరిస్థితి మారిననాడే యిటీవలి పరిశోధకుల కృషికి సార్థక్యము గల్గును

ప్రపంచములోని యితర ప్రదేశములు ప్రాణిజీవనమునకు అననుకూలమైన వాతావరణముతోనున్న అతి ప్రాచీనకాలములో కూడ భారతదేశము జీవనానుకూల వాతావరణముతో నొప్పారుచుండెనని వైజ్ఞానికులభిప్రాయపడిరి. మొదటి యార్యుడే యననేల? మొదటి మానవుడే యిట జనించెననుట కిది గొప్పయాధారము.

భూగర్భ శాస్త్రములో అజోయిక్ యుగము. పాలియో అజోయిక్ యుగము అను రెండు యుగములు అతిప్రాచీనకాలమునకు చెందినవి కలవు. అపుడు ప్రపంచమంతయు అత్యుష్ణ వాతావరణముతో నిండియుండుటచే ప్రాణులు జీవించుట యసంభవముగా నుండెను. అపుడొక్క భారతదేశముమాత్రమే నతిశీతోష్ణస్థితి విలసితమై ప్రాణివాసయోగ్యముగా నుండెను ఉత్తరధ్రువప్రాంతము భారత దేశముకంటె తరువాతనే యట్టి వాతావరణమును గల్గియుండెనని మిడిల్‌కాట్ అను శాస్త్రజ్ఞుడు తన **Manual of the Geology of India** అను గ్రంధములో వ్రాసియున్నాడు (పీఠిక 32

వ పుట) బ్లాఫోర్డ్ అను విద్వాంసుడును అట్లే నుడివెను.

అజోయిక్ యుగములో నివసించిన జంతువుల చిహ్నములు భారతదేశములోలభించినవి అంత ప్రాచీనమైన జంతు శిథిలభాగములు ప్రపంచములో వారి యే ప్రాంతమునను లభింపలేదు కావున భారతదేశమే మొదటిప్రాణి నివాసదేశమని డా బల్డామ్ అను శాస్త్రవేత్త నిర్ణయించి యున్నాడు పంజాబులోని లవణ శ్రేణిలో (Salt Range) నీ చిహ్నములు లభించినవి.

జలప్రళయమునకు అవ్యవధాన పూర్వ కాలములో ఉత్తరధ్రువప్రాంతమున ప్రాణి కోటి నివసించి యుండవచ్చును కాని యంతకు పూర్వమే గడచిన అజోయిక్, పాలయో అజోయిక్ యుగములలోనే, భారతదేశములో ప్రాణులు నివసించినవని శాస్త్రవేత్తలు నిస్సంశయముగ చాటుచుండుటచే భారత దేశమే మొదటి వాసయోగ్య ప్రదేశమని చెప్పవలసి యున్నది

అంత ప్రాచీనకాలమున ప్రి కాం బ్రి యన్ యుగములో నిపుడు భారతదేశమున్న ప్రదేశము భూభాగముగనే యుండెనా లేక సముద్రముగా నుండెనా యను శంకను కొందరు శాస్త్ర పరిశోధకులు లేవదీసిరి ఆరావళీపర్వత శ్రేణియును, పంజాబు ప్రాంతమును అప్పుడుండినట్లు నిర్ధారణమగుచున్నదని చిరకాల పరిశోధనానంతరము మిడిల్ కాట్ మున్నగువారు తెలిపి యున్నారు కావున భారతదేశమే ప్రాచీనతమమైన ప్రాణినివాసయోగ్య ప్రదేశముగా నుండెననుటకు సంపూర్ణావకాశము కలదు. ప్రొఫెసర్ రైస్ ఈభావమును వెల్లడించియున్నాడు. అమెరికన్ భూగర్భ శాస్త్రవేత్తయైన డానాతన (Manual of Geology) అను గ్రంథములో (83వ పుట) భారతదేశమునకు ఆది నుండియు గల యీ వాసయోగ్య పరిస్థితిని నిరూపించి యున్నాడు

భారతీయ గ్రంథములలోకూడ ఇచటనే సృష్టి ప్రారంభమాయెనని కలదు సరస్వతీ నదీతీరముననే ప్రాణిసృష్టి ప్రారంభమాయెనని ఋగ్వేద ద్వితీయ మండలములోని 41 వ సూక్తములోని 61 వ ఋక్కువలన తెలియుచున్నది అందు సరస్వతీనది జీవనహేతువుగా పఠింపబడుటయే కాక ఋ గే 2.41.16 శ్లో నామ మాతలలో శ్రేష్ఠురాలుగా (అంబితమే) సంబోధింపబడినది.

ఆర్యులు పైనుండి భారతదేశమునకువచ్చినారను సిద్ధాంతమునకు, వేదములకు పాశ్చాత్యులు నిర్ణయించిన కాలమునకును సన్నిహిత సంబంధముకలదు. గ్రీకు నాగరకతకును, ఇతర యూరప్దేశముల నాగరకతకును వయస్సు అనువారు నిర్ణయించుకొనిరి వేదములు క్రీ పూ 2000 ప్రాంతములో రచింపబడెననియు అంతకుకొలదిగ పూర్వమే ఆర్యులు భారతదేశమునకు వచ్చిరనియు సిద్ధాంతీకరింపబడుట వారికి అనుకూలము. అట్లుకాక వేదములు 10 వేల సంవత్సరములక్రిందటనే యుండెననుచో నా తర్వాత చిరకాలమునకు భారతదేశమునుండి యార్యులు ప్రపంచములోని యితరప్రాంతములకేగి గ్రీసు మున్నగు చోట్ల తమ నాగరకతను నెలకొల్పిరని వారంగీకరింపవలసి యుండును ఇటీవలన జరిగిన పరిశోధనలు వారికనుకూలముగా నడువలేదు.

శ్రీ అవినాశచంద్రదాసుగారు ఋగ్వేదములో దక్షిణసముద్ర ప్రసక్తి గలదని కొన్ని మంత్రములను చూపినారు. సప్తసింధులో ఆర్యులు ఋగ్వేదమును గానముచేయునపుడు వారికి దక్షిణముగా సముద్రముండెనని వారు తేల్చినారు కాని ప్రస్తుతము పంజాబు ప్రాంతమునకు దక్షిణముగా సముద్రము లేదు. పాశ్చాత్యుల భూగర్భశాస్త్రము ననుసరించి 20 వేల సంవత్సరముల క్రిందట పంజాబుకు దక్షిణముగా రాజపుతానా యెడారిప్రాంతము సముద్రగర్భితముగా నుండి యుండవలయునని సిద్ధాంతీకరింపబడినది 20 వేల సంవత్సరములకంటె

పూర్వమే కాని తరువాత దక్షిణసముద్రము లేదు కావున వేదముగ్వేదభాగములలో దక్షిణ సముద్ర ప్రశంస కలదో యవి 20 వేల సంవత్సరములకు పూర్వమే రచింపబడి యుండవలయునని అవినాశచంద్రదాసు నిర్ణయించెను. (కలకత్తా విశ్వవిద్యాలయముచే ప్రచురింపబడిన (Rigvedic india) అను ఎ సి. దాస్‌గారి గ్రంథము చూడదగును)

ఋగ్వేదమింత ప్రాచీనమగుచో ఆర్యులు 20 వేల సంవత్సరములకు పూర్వమే భారతదేశమునకు వచ్చి యున్నచో, క్రీ పూ. 1000 సంవత్సరముల ప్రాంతమునకు నిర్దేశింపబడిన గ్రీకునాగరకత ఆర్యులు మధ్యాసియా విడచిన 17 వేల సంవత్సరముల తర్వాత ప్రారంభమాయెనని చెప్పవలసివచ్చును మధ్యాసియాకును గ్రీసుకును మధ్య భాగములో ఆర్యనాగరకత 17 వేల సంవత్సరములు నిద్రపోవుచుండెనని వీరు చెప్పసాహసింపరు కావున వేదముల ప్రాచీనతను తగ్గించుటకే వారు ప్రయత్నము చేయుచుందురు భారతీయార్యులును గ్రీకు ఆర్యులును కలసియుండిన కాలమునకు చాల వేల సంవత్సరముల తర్వాత గ్రీకు నాగరకత ప్రారంభమగుచో సమష్టినాగరకతకును, గ్రీకు నాగరకతకును అన్ని పోలికలుండవనియు, నందుచేత గ్రీకు నాగరకత ప్రారంభమైన క్రీ. పూ. 1000 సంవత్సరములకు అచిర ప్రాచీనకాలమునందే సమష్టి నాగరకత నెగడి యుండవలయునని పాశ్చాత్య పరిశోధకులెల్లరు భావించిరి కావున వారి యభిప్రాయము ననుసరించి వేదములకాలము క్రీ పూ 2000 ప్రాంతమై యుండవలయును. ఇట్లు కాక వేదకాలము 20 వేల సంవత్సరముల క్రిందటిదని నిరూపితమగుచో వారి సిద్ధాంతమంతయు పడిపోవును.

అపుడు మధ్యాసియాలో 20 వేల సంవత్సరముల క్రిందట సమష్టిగా నుండిన భారతీయార్యులును, యూరపీయార్యులును వేరుగా విడిపోయిరనుటకు బదులుగా ఆదినుండియు సమష్టిగా భారతదేశములో నుండిన ఆర్యులలో కొందరు ఇటీవల యూరపునకేగి యచట నాగరకతకు కారకులైనారనుటను అంగీకరించుటకు వారికెట్టి యభ్యంతరము నుండకూడదు. కాని వారికది రుచింపనందున వేదకాలమును తగ్గించుటకు వీరు ప్రయత్నించుచుందురు.

వేదకాలము వేలకొలది సంవత్సరములు వెనుకకు వెళ్లుటయనగా ఆర్యులు పైనుండి వచ్చినారను సిద్ధాంతమునకు గొడ్డలిపెట్టె యగుచుండుటచేతను, ఇటీవలి పరిశోధనలన్నియు వేదమునట్లు వెనుకకు తీసికొని పోవునవే యగుటచేతను ఆర్యులు మొదటినుండియు భారతదేశములోనే యుండిరనునది క్రమముగా నిర్బాధ సిద్ధాంతమగుచున్నది.

మహాకవి శ్రీ బాణభట్ట ప్రణీత

పార్వతీ పరిణయము

ఆంధ్రీకరణ శ్రీ జూలూరి హనుమంతరావు

ప్రథమాంకము

శ్రీ గౌరీ పరిణీతి మంగళసుదృక్
ప్రేమార్ద్రితారాగమై
రాగానన్ హరువీక్ష సేయఁగడులోలం
బౌచు లజ్జావిధిన్
దోఁగన్ ఘూర్ణితమై నిమీలితమునై
ధూమోద్గమవ్యాజచేఁ
గ్రీఁగన్నై పతిదృష్టితోఁగలసి సుశ్రీకమ్ము
మా కిచ్చుతన్.

మఱియును

భావజు ననన్యసామాన్య బహుళదర్ప
నఘటన ఘటనాపటుతరమైన విభుత
యమరమౌ నతరళలభ్యమౌ నశేష
శేముషీ సంపదను బ్రపోషించుఁగాత

(నాంద్యంతమున)

సూత్రధారుడు - (భక్తిపూర్వకముగా నంజలి ఘటించి)

అజుని తామరతంపరయౌ కుటుంబ
యోగమును క్షేమమునుగూర్చి
యోముచుండి
సతము నానంద విగ్రహచరితులైన
యాది దంపతి లోకకళ్యాణులగుత!

(అని పుష్పాంజలి సమర్పించి) అర్యా! ఇటురమ్ము

నటి.- (ప్రవేశించి) ఆర్య! వచ్చితిని

సూత్ర - ఆర్యా! ఈపరిషత్తు నేడభినవమగు పార్వతీపరిణయమను రూపకమునుజూచుట కభిలషించుచున్నదా యేమి?

నటి - ఆర్య' మఱల నిది యేకవి నిర్మితి?

సూత్ర -

బ్రహ్మముఖముల నర్తించువాణి యెవని
రసనమందున నిల్చి నర్తనము సేయు
నతుల వత్సాన్వయార్ణ వామృతకరుండు
బాణుఁడను పేరి కవిసార్వభౌముఁడతఁడు

ఆతని రచితమగు విచిత్ర సంవిధానవస్తువుచే నీ సామాజికులను సంతోషపఱచుదము.

నటి - ఆర్య! వర్తమానకాల నాటకము లితరములందుఁ గాక యీ రూపకమునందుననే మీ కభిలాష యేల?

సూత్ర -

అగ్రమగు సన్నిధాన సమగ్రతయును
తుష్టిఁగూర్చెడు రసపరి పుష్టతయును
నమల సందర్భ సౌకుమార్యమ్ము సభ్య
జనుల రంజింపఁజేయ దక్షత వహించు.

అందుచే నీ రూపకమునందు గుణగ్రాహకత్వమువలన బ్రవృత్తుఁడ నైతిని.

నటి.- అటులయినచో యుక్తమే.

సూత్ర.- (నటినిఁజూచి) ఆర్యా! పార్వతీ పరిణయ ప్రసంగముచేఁ జింతాకులిత మనస్కవై కనుపింతువేమి కారణము?

నటి - ఆర్య! పరిణయప్రసంగము చేయుటచే మన బాలచండికకు ననురూప వరలాభ మహోత్సవమెట్లు కలుగునోయని నిరంతరము నా హృదయము చింతాకులమగుచున్నది

సూత్ర.- విషాదము పొందకు.

కన్నెకు నభిమతుఁడగు వరు
నెన్నంగా నుద్యమించు నెపుడున్ విధియే
సన్నుత మహతీదయితుం
డన్నారదమౌనివోలె నా గిరిజకునై

(ఇది ప్రస్తావన)

(తరువాత నాకాశమార్గమున నారదుఁడు ప్రవేశించును)

నారదుడు:- జన్మించినది మొదలు మమ్మీయమర కార్యఘటనా కుతూహలము వదలునది కాదు ఏలనన- దక్షునివలన లబ్ధసంజాతయై దాక్షాయణి పతిద్రోహియగునాతని(ద్యజించి శైలరాజసదనాన గౌరిగా నిపుడు జన్మించినది. ఆమెను హిమవత్సానువున(దప మొనరించు నీశునిచే సంభావింప(జేయుటకు దేవతల భావికార్యమును సమీకరించుకొని ప్రవర్తించుచున్నాను.

(కొంచెము క్రిందకవతరించి చూచి) పరివహమను పవన పంథానమును బ్రవేశించినాను. అగుటయు

తీరుగ దోసిలంతలయి దీప్తులతో వికసించు
చున్న మం
దారల మందమందముగ(దాకుచు గాలులు
దెచ్చు తావులం
దారుచు నాడు తుమ్మెదలు తంత్రులనార్ద్రము
సేయు స్వర్ణదీ
వారికణాలు నా మహతిపై హృదయమ్మిదె
వ్రాలు నిర్వృతిన్

(సరభసావతరణము నిరూపించి క్రిందకు జూచి)

మధ్యమలోక ప్రాంగణ ప్రదేశమును
బ్రాపించినాను

అల్లవె కొన్ని తుంగశిఖరాళుల నద్రులు వ్యంజితంబులౌ
నల్లవె వాహినింగలియనౌ సెలయేఱులు
నిర్మలంబులై
యల్లవె నీలమేఘరుచులౌ తరులట్టుల(దోచు
గుంపుగా
మెల్లన మెల్లనంగానెడు మేదినిచూపులకందు
సంస్థితిన్

(మఱల(జూచి యాశ్చర్యముతో)

కనుచూపుల కెక్కెడి గిరి
వనతటి నీ గుల్మముల ప్రభాసిలుచు(గ్రమ
మ్మున భూతలమది గగన
మ్మున కెక్కెడునట్లు రభసమున దిగునాలో

హిమవదుపకంఠభూమిని క్షణకాలములోనే చేరగలను. (కొంచెము ప్రదేశమవతరించి- చూచి) ఇదియే శైలరాజము.

అమల విహారమందిరము లట్టుల నెత్తగు
శృంగపాళితో
నమరి నభోవకాశమును నంతట(బెంచెడు
రీతి(జెల్వమౌ
నమృతకరాంశు గౌర రుచిరావృతమౌ కట
కాళితోడ నా
క్రమణము పొందునో యనెడు కైవడి(దోచు
దిశాంతరమ్ములన్.

అసాధారణమగు భువన దురంధరత్వముచే మందర గంధమాదనాదులగు మహామహీధరముల నధఃకరించు చున్నది

త్రిభువన గురుత్వమున గుణాతిశయమునను
బ్రహ్మ సంపాదితాధికారంపు సిరుల
దిన దినమ్మును శాసించు దేవతాత్మ
చారుకుల శైలచక్రమ్ము సర్వమిదియ

ఇప్పుడు నేను గిన్నరగీత నిష్పంద కృష్ణసారము తోడను, జమరీమృగజాల విక్షేపముచే విరచితమగు నళీక చంద్రోదయ విలాసము తోడను, గస్తూరీ పరిమళములచే గగన గమన ఖేదాపనయముతోడను, శైలేయ గంధములతో నిండిన కటక ప్రదేశముతోడను బ్రస్తుత వస్తుసాధనకై యీ యోషధి ప్రస్థమును బ్రవేశింతును (అటులే యొనర్చి ముందునకుచూచి) ఇదియే యోషధిప్రస్థము.

ఆయత హేమశృంగముల నంబుధరమ్ములు
విశ్రమింప శో
భాయుత దేవభూజములు ప్రాంగణమండల
రాజగా మణి
ప్రాయ మహోన్నతాయతనరమ్యతచే హరి
చాప సృష్టిగా(
బాయక నాదుచేతమనపాయము విస్మయ
మందిరంబగున్.

(పుర ప్రవేశమొనరించి యెదుట దృష్టి నిలిపి) ఇవిఆకాశము నొరసికొను గోపుర శిఖరావలీఢ నక్షత్రపథము హిమవద్గృహము.

(ప్రవేశించి జనాంతికముగా) ఓ కంచుకీ! కులాచల చక్రవర్తి యెచ్చటనున్నాఁడు? ఏమంటివి? "మేనాదేవితో నేదియో మాటలాడుచు లోపల మండపమునందున్నా" డనియా? సరే! కార్య నివేదనమునకు నవసరము సాధితమైనది. (అని పరిక్రమించును)

(మేనా పరివృత పరిజనములతో హిమవంతుడు ప్రవేశించును)

హిమవంతుడు - దేవి! గృహమేధినులకుఁ గన్యాపితృత్వ మధికతర దుఃఖముఁ గలిగించును. మన కులాలంకరణ యగు గౌరి పరిణయ యోగ్యమగు దశను గలిగియున్నది

మేనా.- ఆర్యపుత్రులు నుడివిన విధముగా వివాహ మంగళయోగ్యయై యున్నది.

హిమ.- దేవి! ఇదియును వినుము

యౌవనదశ కుచయుగళ
మ్మె విధి నభివృద్ధి నీరజేక్షణలకు నౌ
నా విధి వరచింతాహృత
భావముతోఁ దనువు కార్శ్యభరమౌ నాకున్.

మేనా:- రాత్రిందివము లీ విషయమునే భావించుచు నిహిత హృదయనగు నాకును నే లక్ష్యము గోచరమగుట లేదు.

హిమ - (చూచి) దేవి! వీణా విహారియగు నారదముని యిటకే వచ్చుచున్నాడు. అర్ఘ్యము దీసికొనిరమ్ము.

మేనా.- ఆర్యపుత్రుని యాజ్ఞానుసారమటులే తెచ్చెదను.

హిమ.- (లేచి యంజలిబద్ధుఁడై) భగవన్! స్వాగతము

నారద.- అభ్యుదయ పరంపరలు గలుగుగాత!

(హిమవంతుఁ డాసనముఁ జూపించి యర్ఘ్యము నొసఁగును నారదుడు స్వీకరించును)

హిమ - (హర్షముతో నంజలిఘటించి)

అఖిల కామనముల స్వాయత్తసిద్ధులై
పరమనిష్ఠలౌచుఁ బరమునందు
నున్న మిమ్ము బోటి సన్మునులాగ మనోత్స
వంబు లల్పపుణ్యవతుల కగునె!

నార - నిస్పృహులమైనను మాదృశులచే సర్వాశ్రమోపకారిణులై తాదృశులగు గృహమేధిను లాలోకింపఁబడవలె.

హిమ - మీ కెయ్యది యభిహితమో యది మా కనుగ్రాహ్యము.

నార.- అనుగ్రాహకుని యనుగ్రాహ్యత యందు వితర్కమేల? తీరరూపుఁడవగు నీవు మాచే నభిగంతవ్యుఁడవే.

ఏలనన-

ఆ త్రిలోక సంపూజిత యమరగంగ
యాకసమునుండి శివశిరస్సధి వసించి
తిరిగి నీ శిఖరానకు దిగుటవలన
పడసినాడ త్రిభువన పావనత నీవు.

హిమ.- నిదేశవర్తులౌ పరిజనులు దూర దూరముగఁ దొలఁగుచున్నారేలనో!

నార.- అప్రతిమరూపలక్ష్యలై యలరుగంగ గౌరియను గన్యకలు మీకుఁ గలరుకాదె!

హిమ.- అవును.

నార.- అందు గంగయు సమరూపుఁడైన వరుని నంబుధిని స్వీకరించినదౌనె మున్నె.

హిమ - అదియు నిజమే.

నార.- తమ రెండవ పుత్రికకు మీచే నే వరుఁ డన్వేషింపఁబడెనో!

హిమ.- భగవన్! ఈ విషయమునకే యాలోచించు నా మనసునఁ దావ మ్మధికమగుచున్నది.

నార.- నాగమానుష దివి భువనములలోన
గిరిజకును దీటుగాఁగల వరుఁడులేడు
ఎవఁడు ప్రభుడౌనొ యాదేవుఁడే త్వదీయ
తనయమది గోరుచుండు నుద్వాహమాడ.

హిమ.- ఆతనిని భగవంతుఁడని నివేదించుటకుఁ బ్రగల్భము లాడుచున్నారు.

నార - (తనలో) ఇప్పుడు సామాన్య వచనముల చేతనే చంద్ర చూడామణి యాతని

మననువ నూహింపఁబడినాఁడు. (బిగ్గరగా) ఈ విషయము నా ప్రణిధాన చక్షువుచేఁ దెలిసికొనఁబడినది; విశ్వాధికుఁడగు నొకా నొకవరుని నీ యీ తనయ పొందఁగలదని మఱల నిట్టి విశేషముచే నని కాదు.

హిమ:- విశ్వాధికుఁడనుటచేఁ గృతార్థుఁడనైతిని.

నార:- పురాతనశక్తి దిగివచ్చి యే నీపుణ్యము చేతనో నీ సుతయైనది. అసాధారణ రూప లక్ష్మియగు నీమెను లోక సామాన్యసుతగా భావింపవలదు. ఈ కారణమున నీ యీ సుత యెవనికో యొకనికి నీయ వాంఛింపఁబడవలదు.

హిమ:- నేను మీ యాజ్ఞ నుల్లంఘించునది లేదు

నార - అభ్యుదయ నిమిత్తమై మఱియొం డుపదేశింపవలయును అదియు అష్టతనువులచే లోక రక్షకరుఁడును, తేజస్త్రయముచే మహితమగు విహితేక్షణ శ్రీ కలవాఁడును నితరములగు సద్విషయములందు నీశ్వర శబ్దవాచ్యుఁడు నెవఁడో యా చంద్రమౌళి త్వదీయ తటము నందుఁ దపశ్చర్య నున్నాడు

హిమ - అవును

నార:- మీ యంతికమున కేతెంచిన యిందుశేఖరుని నేదేని సపర్యలచే సేవింపవలయు.

హిమ:- భగవన్! ఆ సపర్యయేదియో తెలియఁజేయుడు.

నార:- అనురూప సఖీజన పరివృతయగు భవదీయ పుత్రిక గౌరిని సమిత్కుశ దూర్వాదుల నుపహరించి చంద్రశేఖరునకుఁ బరిచర్య నొనర్పుమని ప్రవేశించుడు.

హిమ. అట్టులే యొనర్చెదను

నార:- (తనలో) బీజావాపనము సామాన్యవృత్తిచేతనే కర్తవ్యము నివేదింపబడినది. ఇఁక వచ్చినదారినే పోదును (ప్రకాశముగా) హిమవంతా! నే చెప్పిన విధమనుసరింప వలసినది

(అని యాకాశమార్గమున నిష్క్రమించును)

హిమ.- (చూచి)

తన దేహరుచుల దివ మం
దున నైనను జూపఁ గొముదుల దక్షిండా
ముని చంద్రుఁడు రెండవ శశి
యన స్వర్లోకమున కదియె యారోహించున్.

(మేనాదేవితో) దేవి! మహాముని వచనముల వినియుంటివి కదా!

మేనా:- విశ్వాధికుడగు పురుషుఁడు వరుఁడు కాఁగలడని వినియున్నాను

హిమ,- (తనలో) విశ్వాధిక శబ్దోపక్షేపము చేతను, కర్తవ్యోపదేశము చేతను నా కూఁతునకుఁ జంద్రశేఖరుఁడే వరుఁడని సూచితమైనది. (ప్రకాశముగా) దేవి! నారదోప దిష్టమగు నిందుమౌళి సపర్యనొనరింప గౌరిని నియోగించుట కుద్యమింతము.

(అని సర్వరు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము

కావ్యగానము

శ్రీ శనగన నరసింహస్వామి

స్వీయగురూత్త మాంఘ్రము లెద జేరిచి, సంలన దూన షోడశ
ప్రాయము, తోయదస్వనసబంధు సుకంఠము లందగింప, రా
మాయణకావ్య మార్షజనమండలి గానము జేసినారు సై
తేయులు, పుల్కరించి వనదేవత కన్నులు విచ్చి మెచ్చగా.

హర్ష బాష్పాకు లేక్షణు లగుచు మునులు
కవయిత నతించి, వృత్త సాక్షాత్కరణ సు
ధీమతి నుతించి, వాచోవిధేయ కావ్య
గాయకుల మెచ్చి కురిసిరి కాన్కరాశి.

కలశము నొక్కమౌని కరకంజము నందిడె ముందు, సన్న వ
ల్కల మొక డంసమాంసల తలమ్మున నల్లన పీచె, మౌంజమే
ఖల నొకడిచ్చి మోహాన ముఖమ్ముల ముద్దులు ముమ్మరించె, వా
'రలమలమ'న్న మానక మృగాజిన మొక్కడొసంగె తుష్టుడై.

గురుదేవుని యానతి తమ శిరసుల మకుటములు గాగ జేరి రయోధ్యా
పురమును కుశలవు లిరువురు నరనారీ బృందవిధుర నయనాతిథులై.

"యత్తపోవహ్ని, ధూమమ్ము లెత్తి నాక
మండ లాధిపు కనుచూపు మందగించె,
తన్మునీంద్ర సభాపతి, ధన్యు, వామ
లూరుసంభవు నెఱుగరో మీరు ప్రజలు!

ఏ కాస్యవశ్య వేదైకపారాయణ కర్మావరీణ చతుర్ముఖుండు,
సర్వశాస్త్రస్ఫార సామ్రాజ్య సర్వంక షజ్ఞాన జగదేక జయపతాక;
వేదాంత సరహస్య విమల పారావార గండూషణ క్రియాకలశసూతి;
దేవభాషావ్యాకృతి ప్రౌఢ పరిచయా పారఘుంటాపథ పారదృశ్వ,
సర్వతోముఖ సాహిత్యసార్వకాల పథికపాథేయదాత, పుంభావవాణి,
సతతకవితా మహాటవీ చారిమౌని సింహ, మాచార్య వాల్మీకి, శిష్యజలధి.

మాదేశికస్వామి, మత్తేభయానమ్ము ఛాత్రపాళికి సదాచార శిక్ష;
మాదేశికస్వామి, మంద్రకంఠధ్వని శిష్యరాశికి సుఖాసీనముద్ర,
మాదేశికస్వామి, మధురానురాగమ్ము కావ్యశీలికి ధైర్య కంచుకమ్ము,
మాదేశికస్వామి, మంగళాశీరేఖ ఋష్యవాటికి పునర్భృగ్యుగమ్ము,
ఆ మహామతి పాదపీఠాంగణమ్ము మా, శిరోవీథికా సుమశ్రీ శివమ్ము,
మాట పసలేని భువనసమ్రాట్టు లెట్లు సాటి? యాతడు కవితాకిరీటధారి.

సోదరుల మేము సాహితీసుందరులము,
గురుకృపా గర్వకోటీర గురుశిఖులము.
రాజ రాజాధిరాజ మార్తాండు లైన
శిరము వంచము మా కళాసీమలోన.

సారము చచ్చి యెండిన ప్రజాప్రవిమూఢ మదాంధ చిత్త కే
దారము లందు సత్య కవితా మధు సారణి పొంగ జేసి, సం
స్కార సజీవ బీజములు చల్లగ బంపె గురుండు మమ్మహం
కారము వీడి రండచిరకాలములో ఫలియించు జన్మముల్

సాధింప జూతురా, స్వర్గప్రవేశమ్ము నిశ్రేణి దీని మన్నించుకొనుడు;
సవరింప జూతురా, భవదీర్ఘరోగమ్ము పరమౌషధము దీని పంచు కొనుడు
తరియింప జూతురా తప్తసంసారాబ్ధి తరణిరాజము దీని దాచుకొనుడు,
వరియింపజూతురా చిరజీవితత్త్వమ్ము అమృతభాండము దీని నందుకొనుడు

విమల రామాయణమ్ము మంత్రమ్ము, తపోఽగ్ని
శుచుడు వాల్మీకి ఋషి, యనుష్టుప్పు ఛంద,
మవని నాథుడు శ్రీరాము డార్య మూర్తి
దేవత, యికేమి రండధో గ్రీవులగుచు".

రాజ వీథుల రచ్చల రామగాన పానశాలల నొనరించి పఱచి యజ్ఞ
దీక్షితుండగు రఘుదేవు దీనకర్ణ గోచరమ్మయ్యె కుశలవ కుశలవాణి.

"శ్రీరామాయణ తత్త్వదర్శనున కాశీర్వాద మేలా? సుధా
పారత్నాకర రత్నవేదికి శుభాశంసమ్ము లొండేల? ధా
రా రమ్యస్థిరసాహితీ క్రతువు లార్యాభూమి విశ్వప్రజా
ధీరశ్రేణి కొసంగు గాత ధనధీ దీర్ఘాయు రారోగ్యముల్."

శీతాద్రిప్రతిమాన దివ్యకవితా సింహాసనాసీన! శ్ర
ద్ధా తారుణ్యము తోడ రామచరిత ధ్యానమ్ము గావించి. మ
చ్చేతో ఽనంద ఫలమ్ము, మద్గత భవశ్రీ వాసనా రూప మీ
రీతిం గూర్చితి నల్పకావ్యము సమూరీ కారముం జూపుమా!

కలవీణారవ భావనాబల మహంకారింపగా జొక్కి, నా
తొలి కబ్బమ్మిది సంతరించితి వచోధూర్తత్వ ముందక్క ని
శ్చల చిత్తమ్మున; రామచంద్ర మహిమాస్థానోత్తమోద్యాన కో
కిలమా! మామకవాణి భావుక మనఃకీరమ్ము గావింపుమా!

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada
Printed at Nava Bharathi Press, Vijayawada-2